www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 12
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 277

సోమవారం | 22-1-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 7.53 తదుపరి త్రయోదశి; నక్షత్రం: మృగశిర తె. 4.59 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: ఉ. 9.44-11.24; దుర్ముహూర్తం: మ. 12.49-1.34; అమృతఘడియలు: రా. 7.46-9.27; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.01

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సర్వాంగ సుందరంగా ముస్తాబై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అయోధ్య రామ మందిరం

శ్రీరామ జయం

అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ నేడే

- మధ్యాహ్నం 12.30కు అభిజిత్ లగ్నంలో వేడుక
- ముందుగా 56 రకాల భోగ్ ప్రసాదం నివేదన
- తొలిగా మోదీకి.. రేపటి నుంచి ప్రజలకు దర్శనం
- ఆధ్యాత్మిక శోభతో అయోధ్య నగరం కళకళ
- ఉదయం ఆలయ ప్రాంగణంలో సంగీత ప్రదర్శన
- ఏపీ ఘటం, కర్ణాటక వీణా నాదం, తమిళనాడు నుంచి నాదస్వరం, మృదంగ విద్వాంసులు
- 70 ఏళ్ల తర్వాత నూతన మందిరంలోకి రామ్ లల్లా
- కొత్త విగ్రహం ముందే పాత విగ్రహాల ప్రతిష్ఠ
- నేడు 10 లక్షల దివ్వెల వెలుగుల్లో అయోధ్య

నేడు జరిగేది బాలరాముడి ప్రతిష్ఠ!

- భూతలం వరకే ఆలయ నిర్మాణం పూర్తి
- మొదటి అంతస్తులో రామ్‌దర్బార్.. అందులో రాజారాం, సీత.. ఏడాది చివరికల్లా మొత్తం పూర్తి

అయోధ్య, జనవరి 21: "ఎన్నాళ్లో వేచిన ఉదయం.. ఈనాడే ఎదురవుతుంటే.." అంటూ రామభక్తులంతా ఆ బాల రాముని దర్శనం కోసం తపిస్తున్న సమయం ఆసన్నమైంది! అల సాకేతపురిలో జన్మించి.. సరయూ నది ఒడ్డున ఆటలాడి.. తండ్రిమాట జవదాటని పితృవాక్య పరిపాలకుడిగా ఎదిగి.. హిందూ జన హృదయ సామ్రాట్టుగా విరాజిల్లుతున్న ఆదర్శపురుషుడు, అవతారమూర్తి ప్రాణప్రతిష్ఠ సుముహూర్తానికి ఇంకా కొన్ని గంటలే ఉంది! బాల రాముడి నేత్రోన్మీలనాన్ని తిలకించి పులకించిపోయే క్షణాలు దగ్గరికొచ్చేశాయి! మరపురాని ఈ వేడుకలను కనులారా వీక్షించేందుకు.. ఆ సంబరాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకుని ఆ జ్ఞాపకాలను పదిలంగా మనసుపొరల్లో దాచుకునేందుకు.. దేశం నలుమూలల నుంచి తరలి వస్తున్న భక్తులతో అయోధ్యాపుర వీధులన్నీ నిండిపోయాయి! లౌడ్ స్పీకర్లలో వినిపించే రాముడి పాటలతో.. రాముడి భజనలతో మారుమోగుతున్నాయి!! రెపరెపలాడుతూ ఎగిరే రామ ధ్వజాలతో.. రామనామ సంకీర్తన చేసే సాధుసంతులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ సందడి

మిగతా 2వ పేజీలో...



రామసేతు వద్ద ప్రధాని

- సేతుబంధన తీర్థంలో ధ్యానం
- సముద్ర స్నానం, శివుడికి పూజలు
- కడలి ఒడ్డున ప్రాణాయామం
- కోదండ రామాలయంలో ధ్యానం
- పవిత్ర జలాల కలశంతో ఢిల్లీకి

3

భయపడుతున్నారా సార్..!

వైఎస్సార్ బిడ్డ ఎవరికీ భయపడదు. ప్రభుత్వం కావాలనే నా కాన్వాయ్‌ను అడ్డుకుంది. అంటే కాంగ్రెస్‌కు భయపడుతున్నట్లే కదా! భయపడుతున్నారా సార్?

-జగన్‌కు షర్మిల సూటి ప్రశ్న



పార్టీ జెండా చేతబట్టి ఏపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన షర్మిల

వైసీపీలో వణుకు!

- షర్మిల రాకతో ప్రకంపనలు
- వెంటనే వైసీపీ సోషల్ మీడియా ఎదురుదాడి
- షర్మిల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా పోస్టింగ్‌లు
- వివరణ పేరిట సజ్జల విసుర్లు

11

వైఎస్ పేరును షర్మిల దుర్వినియోగం చేస్తున్నారు

- లేని పార్టీకి అధ్యక్షురాలిగా గందరగోళం సృష్టిస్తున్నారు
- బాబుకు ఉపయోగపడేందుకే
- జగన్‌పై ఈర్ష్యతోనే: సజ్జల



షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

దోచుకోవడం.. దాచుకోవడమే!

ఏపీలో ఎక్కడ చూసినా మైనింగ్, ఇసుక, మద్యం మాఫియానే

అన్న జగన్ సర్కారుపై చెల్లెలు షర్మిల ఫైర్

- జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి.. 10 లక్షల కోట్ల అప్పులు తెచ్చారు
- రాష్ట్రానికి రాజధాని ఉందా?.. విజయవాడలో మెట్రో ఉందా?
- 10 పెద్ద పరిశ్రమలైనా వచ్చాయా?.. 3 కాదు.. ఒక్క రాజధానైనా కట్టారా?
- రాహుల్‌ను ప్రధాని చేయడం వైఎస్ కల.. బిడ్డగా నెరవేర్చేందుకు కృషి చేస్తా
- ప్రజలు వైసీపీ, టీడీపీ ట్రాప్‌లో పడొద్దు.. ఏపీ పుట్టినిల్లు.. తెలంగాణ మెట్టినిల్లు
- రెండు చోట్లా పనిచేసే హక్కు నాకుంది.. ఎవరో వదిలిన బాణాన్ని కాను
- తెలంగాణలో నియంతను గద్దె దించా: షర్మిల.. ఆమె సమక్షంలో పార్టీలోకి ఆళ్ల
- ఇచ్ఛాపురం టూ కర్నూలు!.. వైఎస్ పాదయాత్ర ముగించిన చోటే.. రేపటి నుంచి అంతర్గత భేటీలకు షర్మిల శ్రీకారం.. తర్వాత జనంలోకి



- పోలవరం కోసం ఉద్యమాలు చేసిన జగన్‌రెడ్డి.. బీజేపీకి **తొత్తుగా మారారు**
- మణిపూర్‌లో క్రైస్తవులు చచ్చిపోతున్నా బీజేపీకి మద్దతిస్తున్నారు
- **మీరు మనుషులేనా?**
- అన్నపై షర్మిల ధ్వజం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రలో ఎక్కడ చూసినా మైనింగ్, ఇసుక, మద్యం మాఫియానేనని.. దోచుకోవడం, దాచుకోవడమేనని పీసీసీ నూతన అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. అభివృద్ధి జరగడం లేదు గానీ.. దళితులపై దాడులు మాత్రం వందకు వంద శాతం పెరిగాయని ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఆమె.. పార్టీ నేతలు, కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ఆంధ్రరత్న భవన్‌లో సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి జరగలేదని, అప్పులు మాత్రం రూ.10 లక్షల కోట్లకు

మిగతా 11వ పేజీలో...



'చలో విజయవాడ' కోసం ఆదివారం రాత్రికే పెద్ద ఎత్తున విజవాడ చేరుకుని, ధర్నా చౌక్ సమీపంలో రోడ్డుపైనే పడుకున్న అంగన్వాడీలు

ఢీ అంటే ఢీ

నేడు అంగన్వాడీల 'చలో విజయవాడ'

- 'జగనన్నకు కోటి సంతకాలు' అందజేతకు పిలుపు
- అప్రమత్తమైన సర్కారు.. అంగన్వాడీలపై ఉక్కుపాదం
- రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలకు నోటీసులు
- అనంతలో 12 మందిపై కేసులు.. ముందస్తు అరెస్టులు
- విజయవాడకు బయలుదేరినవారిని రైల్వేస్టేషన్లలో అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలింపు

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేతనాల పెంపుపై ప్రభుత్వం నుంచి స్పందన కరువవ్వడంతో 41 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా సోమవారం 'చలో సీఎంవో/చలో విజయవాడ'కు పిలుపునిచ్చారు. 'జగనన్నకు చెబుదాం' పేరుతో సేకరించిన కోటి సంతకాల ప్రతులను

మిగతా 12వ పేజీలో...

అంగన్వాడీలపై వేటు!

- నేటి ఉదయం పది గంటల్లోగా విధుల్లో చేరాలి
- లేదంటే ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు
- చిరుద్యోగులపై జగన్ సర్కారు కర్కశం
- వారి స్థానంలో కొత్తగా నియామకాలకు ఆదేశాలు

12

అపరిచిత వాట్సప్ కాల్స్‌తో జాగ్రత్త

- అలాంటివాటికి స్పందించవద్దు..
- కొత్తగా 'సెక్స్టార్షన్' నేరం జరుగుతోంది
- కేంద్ర హోం శాఖ హెచ్చరిక



12

బెరైటీస్‌లో భారీ గోల్‌మాల్

మంగంపేటలో 650 కోట్ల దోపిడీ!

- సీ గ్రేడ్ పేరిట ఏ గ్రేడ్ తరలింపు
- గనుల శాఖ అధికారుల స్కెచ్
- బినామీ కంపెనీలతో అక్రమాలు
- దందాలో బంగారుకొండ కీలక పాత్ర
- అండగా రంగంలోకి వసూల్‌రాజా
- విచారణ జరగకుండా కాపాడే యత్నం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఇసుక, మట్టి, ఖనిజాలు.. ప్రకృతి వనరులను దేన్నీ వదలకుండా దోచేస్తున్నారు. వైసీపీ నేతలు అడ్డగోలుగా ఇసుక తవ్వకాలతో కోట్లు కొల్లగొట్టగా... వ్యాపారుల ముసుగు తొడిగిన గనుల గజ దొంగలు, కొందరు గనుల శాఖ అధికారులు కలసి రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల ఆదాయాన్ని తీసుకొస్తున్న బెరైటీస్‌ను కొల్లగొట్టారు. దోపిడీలో గనుల ఘనుడు బంగారుకొండది కీలక పాత్ర. సర్కారుకు రావాల్సిన 650 కోట్ల రూపాయల ఆదాయాన్ని దోచుకున్నారు. ఈ మొత్తం ప్రాథమిక అంచనా మాత్రమే. లోతైన విచారణ జరిగితే దీనికి మూడింతల దోపిడీ బయట పడుతుందని అధికారవర్గాల అంచనా. వృత్తి, విభాగాలతో సంబంధం లేనివారు సైతం ఏపీఎండీసీలో మకాం వేసి అందినకాడికి దండుకొని వెళ్లిపోయారు. అయితే విచారణ ముందుకుసాగకుండా, అక్రమార్కులను కాపాడేందుకు ప్రభుత్వంలోని పెద్ద తలకాయలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. తీగలాగితే దోపిడీ వెనుక ఉన్న పెద్దల డొంక కదిలిపోతుందన్న ఆందోళన బంగారుకొండ, అయన్ను అడ్డగోలుగా కాపాడుతున్న వసూల్‌రాజా, తప్పులు చేసిన గనుల శాఖ అధికారుల్లో నెలకొంది. దీంతో విజిలెన్స్ విచారణ ముందుకు

మిగతా 3వ పేజీలో...

సరదాగా సంబరాలు

సీరియస్‌గా అక్రమాలు



ఆ ఎమ్మెల్యే తీరే వేరు



- జగనన్న కాలనీల్లో భారీ అవినీతి
- పరిహారం సొమ్మునూ వదలని వైనం
- ప్రతి పనికీ రేటు.. కట్టకపోతే వేటు
- 'రియల్' వ్యాపారంలో భారీగా భోజ్యం
- మైనింగ్ దోపిడీలోనూ భాగస్వామ్యం
- మద్యం నుంచి మట్టి వరకు హాంఫట్
- అరగంట ఎమ్మెల్యే అవినీతి పురాణం
- ఆయన మేతపై సొంత నేతల నుంచే సెగ
- టికెట్ ఇస్తే ఓడిస్తామని బహిరంగ సవాళ్లు

పల్నాడు జిల్లాకు చెందిన ఆ ఎమ్మెల్యేకి తెలిసింది రెండే రెండు పనులు. ఒకటి అడ్డదిడ్డంగా సంపాదించడం.. రెండోది కుదిరినకాడికి పాపపు పనులు చేయడం. ఈ రెండు పనుల్లో ఆ ఎమ్మెల్యే పీహెచ్‌డీ చేశాడని సొంత పార్టీ నేతలే చెబుతారు. 'తివిరి ఇసుమున తైలంబు తీయ'గల ఈ ఎమ్మెల్యేకి అధికారం చేతిలోకి రావడం మరిన్ని పాపపు పనులకు పురిగొల్పింది.

ఏదైనా కార్యక్రమాలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు పిలిస్తే 'తలకాయ మాంసం ఉందా' అని అడగటం ఈ ఎమ్మెల్యే ప్రత్యేకత. వయసు మీద పడినా ఎందులోనూ యావ చావ లేదని సొంత పార్టీ నేతలే అంటుంటారు. ఇక, వచ్చే ఎన్నికల్లో టికెట్ సెగ మామూలుగా లేదు. సొంత నేతలే ఓడిస్తామని చెప్పేస్తున్నారు.

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లాలో ఓ ఎమ్మెల్యే రోజువారీ డబ్బు సంపాదన లక్ష్యం నిర్దేశించుకొని చెలరేగి పోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా దందాలతో పేట్రేగిపోతున్నారు. అధికారమే అండగా ఇక అవకాశం రాదేమోనన్నట్లుగా లక్ష్యాలు నిర్దేశించి మరీ దోచుకుంటున్నారు. మట్టిని సైతం వదలకుండా కొల్లగొడుతున్నారు. అభివృద్ధి పనులకు రేటు నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారు. రియల్ వ్యాపారం చేయాలన్నా కప్పం

మిగతా 12వ పేజీలో...

అక్రమార్కుల్లో వణుకు!



- దొంగ ఓట్ల వ్యవహారంపై ఈసీ సీరియస్
- బెంబేలెత్తిపోతున్న రెవెన్యూ అధికారులు
- ఇప్పటికే 'తిరుపతి'లో ముగ్గురిపై వేటు
- మరికొందరిపైనా చర్యలు తీసుకునే చాన్స్
- రాష్ట్రవ్యాప్తంగా దొంగ ఓట్లపై భారీగా ఫిర్యాదులు
- 92 మంది తహసీల్దార్‌లు, 76 మంది డీటీలపై ఆరోపణలు
- తాజా ఓటర్ల జాబితా అక్రమాలపైనా ఈసీ నిఘా

ఆ అధికారులను బదిలీ చేయండి

- సొంత జిల్లాల్లోని వారికి, మూడేళ్లుగా ఒకేచోట ఉన్న వారికి తక్షణ ట్రాన్స్‌ఫర్
- సీఎస్‌కు సీఈసీ ఆదేశం

జాబితాలో అవకతవకలపై గవర్నర్ ఆరా!

అడుసు తొక్కనేల? కాలు కడగనేల? అన్నట్లుగా దొంగ ఓట్ల వ్యవహారంలో పలువురు రెవెన్యూ అధికారుల పరిస్థితి తయారైంది. అధికార పార్టీ నేతలు చెప్పినట్టల్లా విని, ప్రతిపక్షాల సానుభూతిపరుల ఓట్లను అడ్డగోలుగా తొలగించిన అధికారుల్లో భయం పట్టుకుంది. తిరుపతి ఉప ఎన్నికల వ్యవహారంలో ఈసీ కొరడా ఝుళిపించడంతో వణికిపోతున్నారు. ఇప్పటికే ముగ్గురిపై వేటు పడగా, మరికొందరిపైనా చర్యలుంటాయనే చర్చ సాగుతోంది. దొంగ ఓట్ల వ్యవహారంపై ఈసీ లోతుగా పరిశీలిస్తోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో దొంగ ఓట్ల వ్యవహారం దుమారం రేపుతోంది. ఎన్నికల్లో గెలిచేందుకు అధికార పార్టీ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రతిపక్షాల సానుభూతిపరుల ఓట్లు తొలగించడం, దొంగ ఓట్లు నమోదు చేయించడంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన తిరుపతి

మిగతా 11వ పేజీలో...

వనవాస రామా!

» 14 ఏళ్ల సీతారామ లక్ష్మణుల అరణ్యవాసం

» అయోధ్య నుంచి లంక దాకా ప్రస్థానం

తెల్లవారితే చక్రవర్తి అయి రాజ్యమునేలే రామయ్య.. తండ్రి మాటకై పదవిని వదిలి నార వస్త్రాలు ధరించి ధర్మపత్ని సీత, లక్ష్మణ సహితంగా అడవుల వైపు నడిచాడు. 14 ఏళ్ల వనవాసంలో లెక్కకుమిక్కిలి కష్టాలను అనుభవించాడు. భక్తకోటిని ఆదుకునే కోదండ రామయ్య పూలబాటను వదిలి ముళ్లబాట పట్టాడు. అంతఃపురవాసాన్ని వదిలి పూరిపాకలో గడిపాడు. అడవుల్లో ఆకలి దప్పులకోర్చాడు. రాక్షసులతో తలపడ్డాడు. గొప్ప గొప్ప రుషి పుంగవులను కలిసి జ్ఞానసముపార్జన చేశాడు. ఈ ప్రస్థానం ద్వారా కష్టసుఖాలను ఒకే విధంగా స్వీకరించాలనే గొప్ప సందేశాన్ని భావితరాలకు ఇచ్చాడు. మరి.. రఘురాముడి ప్రస్థానం అయోధ్య నుంచి కానల వైపు ఎలా సాగింది? ఆ పురాణ పురుషుడి 14 ఏళ్ల వనవాసం ఎక్కడెక్కడ గడిచింది?



అయోధ్య నుంచి ప్రయాగ్‌రాజ్‌కు

అయోధ్య ప్రస్తుతం యూపీలో ఉంది. పట్టాభి రాముడిగా వెలుగొందాల్సిన రామయ్య.. సీత, లక్ష్మణుడితో కలిసి అడవులవైపు బయలుదేరింది అయోధ్య నుంచే! ముగ్గురూ నేరుగా ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి వెళ్లి.. ఆ మహర్షి ఆశీస్సులు తీసుకుంటారు. 14 ఏళ్ల సుదీర్ఘ వనవాసంలో భాగంగా ఎక్కడెక్కడ ఉండాలన్న విషయంలోనూ సలహాలు తీసుకుంటారు. రావణ సంహారం జరిగి..తిరిగి అయోధ్యకు వెళ్లేముందు కూడా సీతారామ లక్ష్మణులు ఆ మహర్షి ఆశీస్సులు తీసుకుంటారు.



చిత్రకూటం, మధ్యప్రదేశ్

శ్రీరామ వనవాసంలో కీలక ప్రదేశమిది. రాముడు ఇక్కడే కుటీరం ఏర్పాటు చేసుకొని సీత, లక్ష్మణుడితో కలిసి 11 ఏళ్లకు పైగా గడిపినట్లుగా రామాయణం చెబుతోంది. సప్తరుషుల్లో ఒకరైన అత్రి మహాముని, ఆయన సతీమణి అనసూయా దేవిని సీతారాములు ఇక్కడే కలిసి ఆశీస్సులు తీసుకుంటారు.



పంచవటి, నాసిక్

ప్రస్తుతం మహారాష్ట్రలోని నాసిక్‌లో ఉంది. చిత్రకూటం నుంచి బయలుదేరిన సీతారామలక్ష్మణులు పంచవటిలోనూ కొన్నాళ్లున్నారు. రావణుడి సోదరి అయిన శూర్పణఖ రామ లక్ష్మణులను మోహించడం, లక్ష్మణుడు.. ఆమె ముక్కు, చెవులు కోసిన ఘట్టం అంతా ఇక్కడే జరిగినట్లు రామాయణ గాథ చెబుతుంది. సీతను రావణుడు అపహరించిందీ ఇక్కడే.

లేపాక్షి, ఆంధ్రప్రదేశ్




ప్రస్తుతం ఏపీలోని అనంతపురం జిల్లాలో ఉన్న ప్రదేశమిది. పుష్పక విమానంలో సీతను రావణుడు తీసుకెళుతున్నప్పుడు పక్షిరాజు జటాయువు జానకీమాతను రక్షించేందుకు లంకేశుడితో పోరాడింది ఇక్కడే. లక్ష్మణుడితో కలిసి పంచవటి నుంచి సీతను వెతుక్కుంటూ బయలుదేరిన శ్రీరామచంద్రుడు ఓ చోట రెక్కలు తెగి.. దేహమంతా రక్తసిక్తమై పడివున్న స్థితిలో జటాయువును చూస్తాడు. పక్షిరాజును ఉద్దేశించి 'లే పక్షి' అని రాముడు అన్నాడని.. అందుకే ఆ ప్రదేశానికి లేపాక్షి అనే పేరొచ్చిందని పురాణ కథనం. జటాయువు ప్రాణం వీడుతూ సీతను రావణుడు అపహరించాడని రామలక్ష్మణులకు వివరిస్తాడు.



కిష్కింధ, కర్ణాటక

కిష్కింధను ఇప్పుడు హంపిగా పిలుస్తున్నారు. వానర రాజు సుగ్రీవుడిని రాముడు కలిసిన చోటు ఇది. సుగ్రీవుడితో స్నేహం.. ఆయన సోదరుడు వాలి సంహారం.. సీతాన్వేషణకు హనుమంతుడిని పంపడం.. రావణుడితో యుద్ధం కోసం వానర సైన్యంతో కదలడం వంటి కీలక ఘట్టాలకు కిష్కిందే నెలవు.

రామేశ్వరం తమిళనాడు



రామయణంలో పొందుపర్చిన అన్ని ప్రదేశాల్లోకెల్లా అత్యంత ప్రముఖమైన ప్రదేశం రామేశ్వరం. వానర సైన్యంతో కలిసి సముద్రం దాటి లంకకు వెళ్లేందుకు రాముడు వారధిని నిర్మించింది ఇక్కడి నుంచే. రాముడు సైకత లింగాన్ని తయారు చేసి పూజలు చేశాడని రామాయణంలో ప్రత్యేక ప్రస్తావనా ఉంది.



అశోక వాటిక, శ్రీలంక

శ్రీలంకలో ఉన్న దర్శనీయ స్థలాల్లో అశోక వాటిక ప్రఖ్యాతిపొందింది. శ్రీలంకలోని నువారా ఎలియా అనే ప్రాంతంలో ఉంది. అశోక వాటికను 'సీతా అమ్మన్ టెంపుల్'గా పిలుస్తున్నారు. సీతను రావణుడు ఉంచింది ఇక్కడే. సీతమ్మ జాడ తెలుసుకునేందుకు లంకలో అడుగుపెట్టిన హనుమంతుడి పాదముద్రలూ ఇక్కడ చూడొచ్చు.



తలైమన్నార్, శ్రీలంక

రామ-రావణ యుద్ధం జరిగిన చోటు.. ఆ సంగ్రామంలో రావణుడు నేలకొరిగిన చోటు.. అశోకవనం నుంచి వచ్చిన సీత మళ్లీ రాముడి చెంతకు చేరిన చోటు ఇది. తలైమన్నార్‌లోనే రావణుడి సోదరుడైన విభీషణుడిని లంకకు రాజుగా ప్రకటించిన అనంతరం ఇక్కడి నుంచే సీతారామలక్ష్మణులు బయలుదేరి అయోధ్యలో అడుగుపెడతారు.

శ్రీరామ జయం



(మొదటి పేజీ తరువాయి)


నడుమ.. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అభిజిత్ లగ్నంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం మొదలు కానుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమంలో పాల్గొని రాముడి విగ్రహం కళ్లకు కట్టిన పసుపు వస్త్రాన్ని తొలగించి (నేత్రోన్మీలనం అనంతరం) తొలి దర్శనం చేసుకుంటారు. ఆ తర్వాత స్వామివారికి హారతి ఇస్తారు. మంగళవారం నుంచి భక్తులకు బాలరాముడి దర్శన భాగ్యం కలగనుంది. కాగా.. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం రామ్‌లల్లాకు ముందుగా నివేదించే 56 రకాల భోగ్ ప్రసాదం ఇప్పటికే లఖ్‌నవూ నుంచి అయోధ్యకు చేరుకుంది.

50 వాయిద్యాలతో మంగళ ధ్వనులు

రామమందిరం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో దాదాపు 2గంటల పాటు మంగళ ధ్వనులు ప్రతిధ్వనించనున్నాయి. దీనికోసం భారతీయ సంప్రదాయానికి చెందిన ఘటం (ఏపీ), మృదంగం, నాదస్వరం (తమిళనాడు), వీణ (కర్ణాటక) తదితర 50 రకాల సంప్రదాయ సంగీత వాయిద్యాలను సిద్ధం చేశారు. 22న ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

కొత్త ఆలయంలోకి రామ్‌లల్లా

దాదాపు 70 సంవత్సరాల పాటు ఒక గుడారానికి పరిమితమై అక్కడే పూజలందుకుంటున్న పాత రామ్ లల్లా.. 21న రాత్రి శయన హారతి అనంతరం 22న సోమవారం కొత్త ఆలయంలో నిద్ర లేవనున్నారు. ఆదివారం రాత్రి హారతి తర్వాత పాత విగ్రహాన్ని నూతనంగా నిర్మించిన రామమందిరంలోకి తరలించారు. అలాగే లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, స్వామి హనుమ విగ్రహాలను కొత్త ఆలయంలోకి తీసుకెళ్లారు. దశాబ్దాల అనంతరం ఈ నెల 20, 21వ తేదీల్లో పాత ఆలయం మూసి ఉండటంతో భక్తులకు వరుసగా రెండు రోజుల పాటు రామ్ లల్లా దర్శనం లభించలేదు. ఇప్పుడు వారందరికీ ఆయన కొత్త మందిరంలో దర్శన భాగ్యం కలిగించనున్నారు. కొత్తగా ప్రతిష్ఠించే బాల రాముడి విగ్రహం ముందు భాగంలోనే.. ఈ విగ్రహాలను కూడా ఉంచుతారు. రామ్‌లల్లా పాత విగ్రహం ఎత్తు కేవలం ఆరు అంగుళాలు మాత్రమే కాగా, మిగిలిన విగ్రహాలు అంతకంటే చిన్నవి. ఈ నేపథ్యంలోనే.. పెద్ద విగ్రహాన్ని తయారు చేయించాలని ట్రస్టు నిర్ణయించింది.



10 లక్షల దీపాలు.. 121 మంది ఆచార్యులు..

బాల రాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం (22న) సాయంత్రం అయోధ్య నగరాన్ని 10లక్షల మట్టి దీపాలు వెలిగించనున్నారు. నగరంలోని 100 ఆలయాలతో పాటు ఇతర ప్రధాన కూడళ్లను దీపాలతో అలంకరిస్తామని ట్రస్టు అధికారులు వెల్లడించారు. ఇక.. అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన పూజా క్రతువుల్లో 121మంది ఆచార్యులు పాల్గొంటున్నారు. కాగా.. అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిర నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.1,100 కోట్లకు పైగా ఖర్చయిందని, మిగిలిన పనులు పూర్తి చేయడానికి మరో రూ.300 కోట్లు అవసరమవుతాయని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి తెలిపారు. పాత రామ్‌లల్లా విగ్రహం ఐదారు అంగుళాలు మాత్రమే ఎత్తు ఉండటంతో 25-30 అడుగుల దూరం నుంచి దర్శించుకోవడానికి భక్తులకు సాధ్యం కాదని.. అందుకే పెద్ద విగ్రహం ప్రతిష్ఠిస్తున్నామని ఆయన వివరించారు.

అయోధ్య కాషాయమయం


ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఇళ్లు, భవనాలు, దుకాణాలు.. అన్నింటిపైనా కాషాయ జెండాల రెపరెపలతో అయోధ్య నగరమంతా కాషాయమయంగా కనిపిస్తోంది. భక్తులు అయోధ్య వీధుల్లో కాలినడకన, గుర్రాలపై ప్రయాణిస్తూ కూడా జెండాలు ఊపుతూ ఉత్సాహంగా వెళ్తున్నారు. కొన్నిరోజులుగా కాషాయ జెండాల అమ్మకాలు అనేక రెట్లు పెరిగిపోయాయి.

రామమందిరం ప్రత్యేకతలు ఇవీ...

1 సంప్రదాయ నాగరా శైలిలో రామమందిరం నిర్మితమవుతోంది. ఈ మందిరం పొడవు 380 అడుగులు, వెడల్పు 250 అడుగులు, ఎత్తు 161 అడుగులు.

1 మూడు అంతస్తులుగా ఉండే రామమందిరంలో ఒక్కో అంతస్తు 20అడుగుల ఎత్తు ఉంటుంది. ఈ ఆలయంలో 392 స్తంభాలు, 44 ద్వారాలు ఉన్నాయి.

1 మొదటి అంతస్తులో శ్రీరామ దర్బార్ ఉంటుంది. ఇక్కడ మొత్తం ఐదు (నృత్య, రంగ్, సభా, ప్రార్థనా, కీర్తనా) మండపాలు ఉంటాయి.



1 తూర్పువైపు ఉన్న సింహ ద్వారం నుంచి భక్తులు 32 మెట్లు ఎక్కి ఆలయం లోపలికి ప్రవేశిస్తారు.

1 మందిరం చుట్టూ 732 మీటర్ల పొడవు, 14 అడుగుల వెడల్పుతో దీర్ఘచతురస్రాకారంలో భారీ ప్రహరీని నిర్మించారు.

1 ఈ ప్రహరీ 4 మూలల్లో సూర్యుడు, దేవీ భగవతి, వినాయకుడు, శివుడి మందిరాలు ఉన్నాయి. ఉత్తర భాగంలో అన్నపూర్ణా దేవి, దక్షిణ భాగంలో హనుమాన్ గుడి ఉన్నాయి.

ప్రధాని అయోధ్య పర్యటన ఇలా...

బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ సోమవారం ఉదయం 10.20 గంటలకు అయోధ్య చేరుకుంటారు. 10.55 గంటలకు రామ జన్మభూమికి చేరుకుంటారు. 12.05 నుంచి 12.55 గంటల మధ్య గర్భాలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు.. కార్యక్రమానికి హాజరైన అతిథులతో మాట్లాడుతారు. 2.05గంటల ప్రాంతంలో మందిర నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులతో ఇష్టాగోష్ఠి. అనంతరం అక్కడి శివాలయంలో పూజలు చేస్తారు. 2.40 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని 3.05 గంటలకు ఢిల్లీ బయలుదేరి వెళతారు. భద్రతా చర్యల్లో భాగంగా అయోధ్యలో 9,700సీసీ కెమెరాల ను, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశా రు. 12వేల మంది పోలీసులను, ఎన్ఎస్‌జీ బలగాలను మోహరించారు.

నేడు జరిగేది బాలరాముడి ప్రతిష్ఠ!


» భూతలం వరకే ఆలయ నిర్మాణం పూర్తి

» ఆలయ ట్రస్టు చైర్మన్ నృపేన్ మిశ్రా

అయోధ్య, జనవరి 21: రామాలయ నిర్మాణం పూర్తికాకముందే ప్రాణ ప్రతిష్ఠ చేయడాన్ని, గర్భగుడిలోకి ప్రధాని మోదీని అనుమతించి.. తమకు మాత్రం వెలుపల ఆసనాలు ఏర్పాటు చేయడాన్ని నలుగురు శంకరాచార్యులు వ్యతిరేకించడంపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు చైర్మన్ నృపేన్ మిశ్రా స్పందించారు. వారు సనాతన ధర్మాచరణ పర్యవేక్షకులని పేర్కొన్నారు. 'వారు ధర్మగురువులు. నేను సామాన్యుడిని.. అయితే జాతికి నేనో విషయం చెప్పదలిచాను. ఆలయం గ్రౌండ్ ఫ్లోర్ భూతలంలో బాలరాముడిని ప్రతిష్ఠ చేస్తున్నామని ప్రకటించాం. ఇందులో గర్భ గుడి, ఐదు మండపాలుంటాయి. దీనివరకు నిర్మాణ పూర్తయింది. మొదటి అంతస్థు ఇంకా పూర్తి కావలసి ఉంది. అందులో రామ్‌దర్బార్ ఉంటుంది. రాజారాముడు సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న, ఆంజనేయ సమేతంగా దర్శనమిస్తాడు. రెండో అంతస్థులో ధ్యానం, ధార్మిక కార్యక్రమాలు ఉంటాయి' అని వివరించారు. మొత్తం ఆలయం ఈ ఏడాది చివరికల్లా పూర్తవుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా, రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కాబోమన్న నలుగురు శంకరాచార్యలను, ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆధ్యాత్మికవేత్త జగద్గురు స్వామి రామభద్రాచార్య మహరాజ్ "వినాశకాలే విపరీత బుద్ధి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అహం వీడి వేడుకలకు హాజరు కావాలని హితవు పలికారు.

రాముని బంట్లు!

కోట్లాది మంది హిందువుల కల సాకారమై అయోధ్యలో నిర్మితమైన భవ్యమైన రామమందిరంలో బాల రాముడు కొలువుదీరుతున్నాడు! కానీ.. ఇది అంత సులువుగా జరిగిపోలేదు. రామ జన్మభూమి ఉద్యమం పేరుతో ఎంతో మంది చేసిన కృషి ఫలితమే ఈ ఆలయం. ఉద్యమంలో అత్యంత కీలకపాత్ర పోషించినవారిని.. ఆలయ నిర్మాణం సాకారం కావడంలో ముఖ్యులను ఒక్కసారి గుర్తుచేసుకోవాల్సిన సందర్భమిది.



లాల్ కృష్ణ అడ్వాణీ: రామ జన్మభూమి ఉద్యమం అనగానే గుర్తొచ్చే మొట్టమొదటి పేరు.. ఎల్‌కే అడ్వాణీ! అంతకుముందు ఎన్నో ఏళ్లుగా ఎంతో మంది సాధుసంతులు అయోధ్యలో రామాలయం కోసం పోరాడుతున్నా.. ఆ అంశాన్ని రాజకీయ, సామాజిక ఉద్యమంగా మలిచి ప్రజాబాహుళ్యంలోకి చొచ్చుకుపోయేలా చేసింది మాత్రం అడ్వాణీయే. 1990లో.. ఒక టొయోటా వ్యాన్ ట్రక్కును రథంగా మార్చి గుజరాత్‌లోని సోమ్‌నాథ్ ఆలయం నుంచి అయోధ్యలో రామజన్మభూమి దాకా ఆయన ప్రారంభించిన యాత్రకు విస్తృత మద్దతు లభించింది. 1984 లోక్‌సభ ఎన్నికల్లో 2 సీట్లతో ప్రస్థానం ప్రారంభించిన బీజేపీని వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చి రామ మందిరాన్ని నిర్మించడానికి అవసరమైన భూమికను ఏర్పరచింది అడ్వాణీ రథయాత్రేనన‌డంలో సందేహం లేదు.

కల్యాణ్ సింగ్: బాబ్రీ కూల్చివేత జరిగిన సమయంలో యూపీ సీఎం. 1991 జూన్‌లో ఆయన సీఎంగా ప్రమాణం చేయడానికి ముందే రామ్ లల్లా విగ్రహం వద్దకు వెళ్లి తన పాలనలోనే అక్కడ రామమందిర నిర్మాణం జరిపించి తీరుతానని ప్రతిజ్ఞ చేశారు. 1992లో మసీదు కూల్చివేస్తున్న కరసేవకులపై ఫైరింగ్ ఆర్డర్ ఇవ్వడానికి నిరాకరించారు. రామమందిర నిర్మాణ ఉద్యమంలో అత్యంత కీలక ఘట్టం అదే.

ప్రమోద్ మహాజన్: అయోధ్య ఉద్యమంలో భాగంగా అడ్వాణీ తొలుత సోమ్‌నాథ్ నుంచి అయోధ్య దాకా పాదయాత్ర చేపట్టాలని భావించారు. అయితే, రాముడి రథం లాంటిదాంట్లో యాత్ర చేపడితే బాగుంటుందని, ప్రజల్లోకి బాగా వెళ్తుందని అప్పటి బీజేపీ జనరల్ సెక్రటరీ ప్రమోద్ మహాజన్ సూచించారు. ఆయన ఇచ్చిన రథయాత్ర ఐడియా అద్భుతంగా వర్కవుట్ అయ్యింది. రథయాత్ర సక్సెస్ అయింది.



అశోక్ సింఘాల్: విశ్వ హిందూ పరిషత్ 1984లో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వందలాది సాధువులు, హిందూ ప్రముఖులతో 'ధర్మ సదస్సు' నిర్వహించింది. రామజన్మభూమి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని అక్కడే నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత ఆ ఉద్యమానికి అశోక్ సింఘాల్ ప్రధాన రూపకర్తగా మారి ముందుకు నడిపించారు. 1980లో రామజన్మభూమి తాళాలు తెరవాలని కోరుతూ.. రామ్‌జానకీ రథయాత్రను నిర్వహించారు. ఆయన కృషి వల్లనే కరసేవ ఉద్యమం కూడా మొదలైంది. బాబ్రీమసీదు తాళాలు తెరుచుకున్న తర్వాత.. అక్కడ ఆలయం కట్టాలనే ఉద్యమానికి తెరతీశారు. ఆపై దాన్ని అడ్వాణీ అందిపుచ్చుకున్నారు.



మురళీ మనోహర్ జోషి: అడ్వాణీ చేపట్టిన రథయాత్రలో 'సెకండ్-ఇన్-కమాండ్'గా వ్యవహరించిన కీలక వ్యక్తి మురళీ మనోహర్‌జోషి. 1992లో మథురలో.. బాబ్రీమసీదు కూల్చివేతకు కారణమయ్యేలా కరసేవకులను రెచ్చగొట్టే ప్రసంగం చేశారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి.

ఉమాభారతి: రెచ్చగొట్టే నినాదాలతో ప్రసంగాలు చేయడంలో దిట్ట. బాబ్రీమసీదు కూల్చివేత సమయంలో ఆమె ఇలాగే తన నినాదాలతో కరసేవకులను రెచ్చగొట్టినట్టు లిబర్హాన్ కమిషన్ తేల్చింది. ప్రణాళిక ప్రకారం ఆమె ఇచ్చిన సంకేతంతోనే మసీదు కూల్చివేత మొదలైందని ఆమెపై దాఖలైన అభియోగపత్రంలో పేర్కొన్నారు.

వినయ్ కతియార్: రామ మందిర నిర్మాణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు ఏర్పాటైన సంస్థ బజ్‌రంగ్ దళ్‌కు తొలి అధ్యక్షుడు వినయ్ కతియార్. ఫైర్‌బ్రాండ్. కాగా, బాబ్రీ తాళాలు తెరిపించి శిలాన్యాస్‌కు అనుమతించిన రాజీవ్ గాంధీ, మసీదు కూల్చివేత వేళ మౌనముద్ర దాల్చిన నాటి ప్రధాని పీవీ కూడా మందిర నిర్మాణంలో పరోక్షంగా కీలకపాత్ర పోషించారు. - సెంట్రల్ డెస్క్

రాముడి కోసం 'భీష్ముడి' పోరాటం

రామమందిరం సాకారంలో కురువృద్ధ న్యాయవాది పరాశరన్ పాత్ర కీలకం

» 92 ఏళ్ల వయసులో కోర్టులో వాదనలు

» సుప్రీంకోర్టును మెప్పించి హిందువులకు రామజన్మభూమిని ఇప్పించిన ప్రజ్ఞాశాలి



92 ఏళ్ల వయసులో, యావత్ భారతదేశాన్ని ప్రభావితం చేస్తున్న అత్యంత సంక్లిష్టమైన కేసును స్వీకరించారు. పగలూ రాత్రీ అన్న తేడా లేకుండా కష్టపడి ఆ కేసుపైన వాదనలను నిర్మించుకున్నారు. సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా 40 రోజుల పాటు జరిగిన విచారణలో తన వాదనలను వినిపించి ధర్మాసనాన్ని మెప్పించారు. శ్రీరాముడి జన్మస్థలాన్ని హిందువులకు అప్పగించారు. ఆ దిగ్గజ న్యాయవాది పేరు కేశవ్ పరాశరన్. 1973 నాటి కేశవానంద భారతి కేసు తర్వాత సుప్రీంకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది రామజన్మభూమి కేసులోనే. 2019 ఆగస్టు 6 నుంచి అక్టోబరు 16 వరకూ 40 రోజులపాటు రోజువారీ విచారణ జరిగింది. హిందూ కక్షిదారుల తరఫున వాదనలు వినిపించే న్యాయవాదుల బృందానికి కేశవ్ పరాశరన్ నాయకత్వం వహించారు. కోర్టులో వాదనలు జరిగే సందర్భంలో ఒక్కోసారి పరాశరణ్ ఏకబిగిన నాలుగు గంటలకుపైగా నిలబడి ఉండేవారు. శ్రీరాముడి మీద పరాశరణ్‌కు ఎంతటి భక్తిప్రపత్తులంటే.. కేసు విచారణ జరిగినన్ని రోజులూ ఆయన, ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించటానికి ముందు తన బూట్లను విడిచి పక్కన పెట్టి వచ్చేవారు. 'అయోధ్యలో 55-60 మసీదులున్నాయి. వాటిల్లో దేంట్లోనైనా ముస్లింలు నమాజు చేసుకోవచ్చు. కానీ, హిందువులకు మాత్రం ఇది రాముడు పుట్టిన ప్రదేశం. దీనిని మేం మార్చుకోలేం కదా!' అని పరాశరణ్ ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. ఒక ప్రదేశం (అయోధ్య జన్మస్థానం) కూడా కేసు కక్షిదారుల్లో ఒకరిగా ఉండటం ఎలా సాధ్యమని ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి ప్రశ్నించినప్పుడు.. 'రుగ్వేదం ప్రకారం సూర్యుడు దేవుడు. కానీ, ఆయనకు విగ్రహం లేదు. హిందువులు నిరాకార శక్తిని కూడా దేవుడిగా కొలుస్తారు. హిందూ లా ప్రకారం కోర్టులో దేవుడిపై కేసు వేయవచ్చు. దేవుడు కూడా కేసు వేయవచ్చు. కాబట్టి, అయోధ్య జన్మస్థానం ఒక కక్షిదారుగా ఉండటం సాధ్యమే' అని పరాశరణ్ పేర్కొన్నారు. ముస్లిం కక్షిదారుల పక్షాన రాజీవ్ ధావన్ వాదిస్తూ.. 'అది మసీదు. ఎప్పటికీ మసీదే' అని బలంగా చెప్పినప్పుడు.. దానికి కౌంటర్‌గా, 'అది ఒకప్పుడు ఆలయం. ఎప్పటికీ అది ఆలయమే' అని పరాశరణ్ వాదించారు. ధర్మాసనం ఎదుట ఇరుపక్షాల వాదనలు ముగిసిన రోజు.. రాజీవ్ ధావన్‌ను కలిసి వీడ్కోలు చెప్పి వెళ్లిపోవటానికి పరాశరన్ 15 నిమిషాలపాటు వేచి చూసి, ధావన్‌ను కలిసి వెళ్లిపోయారు.

న్యాయవాదిగా సుదీర్ఘ ప్రస్థానం

పరాశరన్ 1927 అక్టోబరు 9న తమిళనాడులోని శ్రీరంగంలో జన్మించారు. 1958లో సుప్రీంకోర్టు లాయర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 1976లో దేశంలో ఎమర్జెన్సీ సమయంలో పరాశరన్ తమిళనాడు ఏజీగా ఉన్నారు. ప్రధాని ఇందిర హయాంలో సొలిసిటర్ జనరల్‌గా, అటార్నీ జనరల్‌గా పనిచేశారు. 1989 వరకూ అటార్నీ జనరల్‌గా కొనసాగారు. పరాశరన్‌కు 2003లో పద్మభూషణ్, 2011లో పద్మవిభూషణ్ పురస్కారాలు లభించాయి. 2016 తర్వాత పరాశరన్ రెండు కేసులు మాత్రమే చేపట్టారు. ఒకటి అయోధ్య కాగా మరొకటి శబరిమల. - సెంట్రల్ డెస్క్

ఖాన్‌మార్కెట్ లైబ్రరీలో అయోధ్య భూ రికార్డులు

సుప్రీంకోర్టులో హిందూ కక్షిదారుల లాయర్ల బృందంలో శుభేందు ఒకరు. ఈ కేసులో ఓ ముఖ్యమైన అంశాన్ని శుభేందు తాజాగా వెల్లడించారు. 'కేసు విచారణ జరిగిన 40 రోజుల్లో దాదాపుగా మేం ఆఫీసులోనే ఉండేవాళ్లం. కేసుకు బలం చేకూర్చటానికి ల్యాండ్ రికార్డులు, చారిత్రక ఆధారాల కోసం వెతికేవాళ్లం. ఓ మధ్యాహ్నం లంచ్ కోసం ముగ్గురు లాయర్లం ఖాన్ మార్కెట్‌కు వెళ్లాం. భోజనం తర్వాత అక్కడున్న ఓ పుస్తకాల షాపునకు వెళ్తే, యాదృచ్ఛికంగా అయోధ్యకు సంబంధించిన పాత భూరికార్డులు దొరికాయి. ఈ రికార్డులు కేసులో ముఖ్య పాత్ర పోషించాయి' అని శుభేందు వెల్లడించారు.

ఆలయ రూపశిల్పి చంద్రకాంత్



అయోధ్య, జనవరి 21: అయోధ్య రామాలయ మాస్టర్ ప్లాన్ రూపకర్త చంద్రకాంత్ సోమ్‌పురా. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడారు. 32ఏళ్ల కల నెరవేరబోతోందని చెప్పారు. "32 ఏళ్ల క్రితం అప్పటి వీహెచ్‌పీ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ నా వద్దకు వచ్చి అయోధ్యలో రామమందిరం కోసం ప్లాన్‌ను రూపొందించాలన్నా రు. రామజన్మభూమి వద్దకు ఇద్దరం వెళ్లాం. కానీ, అక్కడి భద్రతా సిబ్బంది లోపలికి వెళ్లి కొలతలు తీసుకోవడానికి అనుమతించలేదు. దీంతో, అడుగుల లెక్కతోనే కొలతలు తీసుకున్నాను" అని చెప్పారు. ఆ తర్వాత వాస్తు, శిల్ప శాస్త్రాలకు అనుగుణంగా 2020లో మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇందులో చంద్రకాంత్ కుమారుడు ఆశిష్ కూడా పాలుపంచుకున్నారు.



500 ఏళ్ల అయోధ్య రామమందిర చరిత్ర ఇదీ..

1528 అయోధ్యలో రాముడి జన్మస్థలమని హిందువులు భావించే చోట మొఘల్ చక్రవర్తి బాబర్ మసీదును నిర్మించాడు.

1853-1949 ఈ స్థలం గురించి హిందూ-ముస్లింల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగాయి. దీంతో బ్రిటిష్ వాళ్లు మసీదు లోపలి భాగాన్ని ముస్లింలకు, మసీదు వెలుపలి ప్రాంతాన్ని హిందువులకు కేటాయించారు.

1949 మసీదు లోపల రాముడి విగ్రహం బయటపడింది. ముస్లింలు ఆందోళనలు వ్యక్తం చేశారు. దీంతో మసీదును వివాదాస్పద ప్రాంతంగా ప్రకటించి మసీదుకు తాళం వేశారు.

1950 మసీదు లోపల బయటపడిన రామ్ లల్లా విగ్రహానికి పూజలు చేసేందుకు అనుమతించాలని ఫైజాబాద్ సివిల్ కోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. 1959లో నిర్మోహీ అఖాడా మూడో పార్టీగా పిటిషన్ వేసింది.

1961 మసీదు లోపలి రామ్ లల్లా విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ యూపీ సున్నీ వక్ఫ్ బోర్డు కోర్టుకు వెళ్లింది.

1986 మసీదు తలుపులు తెరవాలని, హిందువులు పూజలు చేసుకు నేందుకు అనుమతి ఇవ్వాలని ఫైజాబాద్ జిల్లా కోర్టు తీర్పునిచ్చింది.

1992, డిసెంబరు 6 కరసేవకులు బాబ్రీ మసీదును కూల్చివేశారు. తర్వాత చెలరేగిన హింసలో 2వేల మందికి పైగా చనిపోయారు.

2001 బాబ్రీ కూల్చివేత, హింస కేసులో స్పెషల్ జడ్జి అడ్వాణీ, కల్యాణ్ సింగ్ సహా 13 మందిని నిర్దోషిగా ప్రకటించారు.

2002 హిందూ భక్తులు వెళ్తున్న రైలుకు గోద్రాలో నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 58 మంది చనిపోయారు. తర్వాత చెలరేగిన హింసలో 2వేల మందికి పైగా మృతి చెందారు.

2010 అలహాబాద్ హైకోర్టు అయోధ్యలోని వివాదాస్పద భూభాగాన్ని మూడొంతులుగా విభజించి.. రెండు వంతులను హిందూ పార్టీలకు, ఒక వంతును వక్ఫ్ బోర్డుకు కేటాయించింది.

2011 అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

2017 మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు హిందూ, ముస్లిం పార్టీలకు సూచించింది. దీంతో పాటు పలువురు బీజేపీ నేతలపై నేరపూరిత కుట్ర ఆరోపణలను పునరుద్ధరించింది.

2019, మార్చి 8 అయోధ్య కేసు మధ్యవర్తిత్వానికి సుప్రీంకోర్టు ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. 8వారాల్లోగా ప్రొసీడింగులను పూర్తి చేయాలంది.

2019, నవంబరు 9 అయోధ్యపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. వివాదాస్పద స్థలం మొత్తాన్ని రామ్ లల్లాకే కేటాయించింది. మసీదు నిర్మాణానికి 5ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కేంద్రం, యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

2020 ఫిబ్రవరి 5 అయోధ్య రామాలయ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం 15 సభ్యులతో ట్రస్టును ఏర్పాటు చేసింది.

2020 ఆగస్టు 5 ప్రధాని మోదీ రామాలయ నిర్మాణానికి పునాది రాయి వేశారు.

2024, జనవరి 22 భవ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ

2 నుంచి 303 సీట్ల వరకూ..

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా బీజేపీ ప్రస్థానం.. రామ జన్మభూమి ఉద్యమంతోనే పార్టీ ఎదుగుదల

- కీలకపాత్ర పోషించిన అద్వాణీ రథయాత్ర
- వాజపేయి హయాంలో కోర్ అంశాలకు తగ్గిన ప్రాధాన్యం
- మోదీ రాకతో తిరిగి హిందుత్వ విజృంభణ
- 400కుపైగా సీట్లు లక్ష్యంగా వచ్చే ఎన్నికలకు కసరత్తు



నాలుగు దశాబ్దాల క్రితం 1980లలో రామ జన్మభూమి ఉద్యమం ప్రారంభమైంది. ఆ ఉద్యమం తన అంతిమ లక్ష్యాన్ని నేడు చేరుకుంది. ఈ ప్రస్థానంలో కర్త, కర్మ, క్రియ బీజేపీ అంటే అతిశయోక్తి కాదు. రామ జన్మభూమి ఉద్యమంలాగే బీజేపీ కూడా ఇంతింతై వటుడింతై అన్నట్లుగా భారతీయ రాజకీయ వినీలాకాశాన్ని పూర్తిగా ఆవరించింది. ఆ ప్రస్థానాన్ని ఓసారి గమనిస్తే.. జనసంఘ్ అవశేషాల నుంచి పురుడు పోసుకున్న బీజేపీ.. 1984లో తొలిసారిగా పోటీ చేసిన లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లను మాత్రమే గెల్చుకుంది. నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య అనంతరం జరిగిన ఎన్నికలు కాబట్టి, కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే అత్యధికంగా 414 సీట్లను ఆ ఎన్నికల్లో కైవసం చేసుకుంది. మరోవైపు అప్పుడప్పుడే రామ జన్మభూమి ఉద్యమం దేశవ్యాప్తంగా ఊపందుకుంటోంది. ఈనేపథ్యంలో 1989లో పాలంపూర్ తీర్మానం ద్వారా అయోధ్య రామమందిరం నిర్మాణానికి కట్టుబడి ఉంటామని బీజేపీ ప్రకటించింది. తద్వారా జాతీయ రాజకీయాల్లో తనకంటూ ముద్రను బీజేపీ వేసుకోవటం మొదలైంది. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తన సంఖ్యాబలాన్ని 85 సీట్లకు పెంచుకుంది. 1990ల తొలినాళ్లలో మండల్ రాజకీయాల దశ మొదలైంది. దీనికి ప్రతిగా బీజేపీ రామ జన్మభూమి ఉద్యమాన్ని ఉధృతం చేసింది. గుజరాత్‌లోని సోమ్‌నాథ్ ఆలయం నుంచి బీజేపీ అగ్రనేత అద్వానీ రథయాత్రను ప్రారంభించారు. యాత్ర సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నప్పటికీ.. హిందువులలో అశేష ప్రజానీకాన్ని ఈయాత్ర ఆకర్షించి, బీజేపీని బలోపేతం చేసింది. 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 121సీట్లను కైవ సం చేసుకుంది. 1992 డిసెంబరులో బాబ్రీ మసీదు విధ్వంసం జరిగింది. ఈ నేపథ్యంలో రామ జన్మభూమి ఉద్యమం మరింత తీవ్రంగా ముందుకొచ్చిం ది. 1996లో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 161 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించి వాజపేయి ప్రధాని పదవిని చేపట్టినప్పటికీ మెజారిటీ నిరూపించుకోలేకపోవటంతో రెండు వారాల్లోపే ఆ ప్రభుత్వం కూలిపోయింది. అస్థిర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన ఆ సమయంలో మరో రెండేళ్లలోనే 1998 లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. దీంట్లో బీజేపీ 182 సీట్లతో మరోసారి అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించి మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే అన్నాడీఎంకే మద్దతును ఉపసంహరించుకోవటంతో ఏడాదిలోనే ఆ ప్రభుత్వం కూడా కూలిపోయి 1999లో మళ్లీ లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఈసారి కూడా బీజేపీ 182 సీట్లతో తిరిగి వాజపేయి ప్రధానిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వం స్థిరంగా ఐదేళ్లపాటు కొనసాగింది. వాజపేయి హయాంలో అయోధ్య, ఉమ్మడి పౌరస్మృతి తదితర అంశాలను బీజేపీ పక్కనపెట్టింది. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ అధికారంలోకి వచ్చి వరుసగా రెండు పర్యాయాలు కొనసాగింది. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్రమోదీ బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ఎంపికైన తర్వాత తిరిగి తన కోర్ అంశమైన హిందుత్వను బీజేపీ బలంగా ముందుకు తీసుకొచ్చింది. ఆ ఎన్నికల్లో 282సీట్లతో విజయ పతాకాన్ని ఎగరవేసి మోదీ ప్రధానిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల్లో బీజేపీ సంఖ్యాబలం 303కి చేరింది. అదే ఏడాది అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. అయోధ్యలో ప్రధాని మోదీ భూమి పూజ లో పాల్గొని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆలయం సాకారమైంది. ఈ నేపథ్యంలో మరికొన్ని నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో 400కుపైగా సీట్లను సాధించి గతంలో కాంగ్రెస్ నెలకొల్పిన రికార్డును బద్దలుకొట్టాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధంగా బీజేపీ ప్రస్థానంలో అయోధ్య విడదీయరాని భాగంగా మారింది.

(సెంట్రల్ డెస్క్)

బెరైటీస్‌లో భారీ గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి)

సాగకుండా ఎంత డబ్బు ఇచ్చేందుకైనా రెడీ అని ప్రభుత్వ పెద్దలకు సంకేతాలు పంపిస్తున్నారు. త్వరలో ఎన్నికలుండటంతో అసలు విచారణే లేకుండా చేయాలని పన్నాగాలు పన్నుతున్నారు.

మంగంపేటలో విలువైన ఖనిజం

బెరైటీస్ ఓ విలువైన మినరల్. ఆయిల్, గ్యాస్ వెలికితీసే బావుల్లో వేడిని తగ్గించేందుకు దీన్ని కూలంట్‌గా వాడతారు. పారిశ్రామిక, ఉత్పాదక రంగాల్లో వినియోగిస్తారు. ఈ మినరల్ తవ్వకాల్లో చైనా తొలిస్థానంలో, భారత్ రెండోస్థానంలో ఉన్నాయి. దేశీయంగా బెరైటీస్ లభ్యత, ఎగుమతిలో ఆంధ్రా వాటా 98 శాతం. అగ్రరాజ్యం అమెరికాకు వచ్చే మినరల్‌లో 35 శాతం, పశ్చిమాసియా దేశాలకు వచ్చే దానిలో 89 శాతం ఎగుమతి చేస్తున్నారు. ఏపీలో తయారయ్యే బెరైటీస్ పౌడర్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్ ఉంది. దీనికి కారణం నాణ్యతే. ఇందులో కడప జిల్లా మంగంపేటలోని బెరైటీస్‌దే అగ్రస్థానం. ఈ ఖనిజం అమ్మకాల ద్వారా గనుల శాఖ పరిధిలోని ఏపీఎండీసీకి ఏటా సగటున 1,400 కోట్ల ఆదాయం వస్తోంది. ఇది ఇసుక ద్వారా వచ్చే ఆదాయం కంటే రెట్టింపు. వైసీపీ ముఖ్యనేతలు ఇసుక తవ్వుకొని కోట్లు సంపాదిస్తుంటే, కొందరు అధికారుల కన్ను బెరైటీస్‌పై పడింది. గనుల ఘనుడు బంగారుకొండ, మరికొందరు జాయింట్ వెంచర్‌గా ఏర్పడి బినామీ కంపెనీలు పుట్టించి బెరైటీస్ కొనుగోలు, ఎగుమతి వ్యాపారంలోకి దింపారు. బంగారుకొండ అధికారాన్ని అడ్డం పెట్టుకొని గోల్‌మాల్ పనులతో అతి నాణ్యమైన బెరైటీస్‌ను ఏమాత్రం నాణ్యతలేని గ్రేడ్‌గా చూపి దారి మళ్లించారు. ఈ దోపిడీలో ఇదే అతి పెద్ద ట్విస్టు.

సరికొత్తగా దోపిడీ

బెరైటీస్‌లో ఏ గ్రేడ్, బీ గ్రేడ్, సీ (డీసీఅండ్ డబ్ల్యూ) గ్రేడ్ అనే రకాలు ఉంటాయి. మైనింగ్ చేసిన తర్వాత బెరైటీస్‌ను దాని నాణ్యతను బట్టి ఆయా గ్రేడ్ డంపింగ్ యార్డ్‌లలో ఉంచుతారు. ఆ తర్వాత వేలంలో ఆయా గ్రేడ్ బెరైటీస్‌ను కొన్నవారికి అమ్మేస్తారు. ఇది అంతర్గతంగా జరిగే ప్రక్రియ. ఏ గ్రేడ్ బెరైటీస్ టన్నుకు సగటున 6 వేల ధర ఉంటుంది. బీ గ్రేడ్‌కు 4,500 నుంచి 5 వేల వరకు, సీ గ్రేడ్‌కు 1,500 నుంచి 3,000 వరకు ధర ఉంటుంది. మంగంపేట బెరైటీస్‌లో సింహభాగం ఏ గ్రేడ్ ఉంటుంది. దీనికి అమెరికాతో పాటు పశ్చిమాసియా దేశాల్లో భలే డిమాండ్ ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని గనుల గజదొంగలు వ్యవహారం నడిపించారు. ముందస్తు ప్రణాళిక/ఒప్పందం ప్రకారం అతి తక్కువ ధర ఉండే సీ గ్రేడ్ డంపింగ్ యార్డ్‌లో ఏ గ్రేడ్ బెరైటీస్‌ను డంప్ చేయించడం.. ఆ తర్వాత దాన్ని సీ గ్రేడ్ పేరిట తరలించడం.. అనంతరం దాన్ని ఏ గ్రేడ్ బెరైటీస్ పౌడర్‌గా మార్చి విదేశాలకు ఎగుమతి చేయడం.. ఇలా ఎవరికీ అనుమానం రాకుండా సులువుగా వ్యవహారం సాగించారు. సంవత్సరానికి 3 మిలియన్ టన్నుల బెరైటీస్‌ను తవ్వితీస్తే, అందులో 25 శాతం సీ గ్రేడ్ కోటాలో చూపించి దారి మళ్లించినట్లు తెలుస్తోంది. ఇలా గత నాలుగున్నరేళ్లలో రూ.650 కోట్లు స్వాహా చేసినట్టు అంచనా. నలుగురు అధికారులు బినామీ కంపెనీ పేరిట దోపిడీ సాగించినట్టు తెలిసింది.

గుట్టు రట్టు

మంగంపేట బెరైటీస్‌లో గ్రేడింగ్ గోల్‌మాల్‌పై ప్రభుత్వానికి గతేడాది ఫిర్యాదులు వచ్చాయి. గనుల శాఖలోని ఉన్నతాధికారులపై ప్రభుత్వానికి వచ్చిన ఓ ఫిర్యాదులో ప్రాథమిక ఆధారాలున్నాయి. దీంతో మంగంపేట గనుల అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి పెద్దిరెడ్డి ఏపీఎండీసీ డైరెక్టర్ వెంకటరెడ్డిని ఆదేశించినట్లు తెలిసింది. ఏ కారణంతోనో వెంకటరెడ్డి ఆ పనిచేయలేదు. దీంతో ప్రభుత్వమే జోక్యం చేసుకొని మంగంపేటలోని అధికారితో పాటు మరో ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసింది. తీవ్రమైన విషయం కావడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. ఆ తర్వాత బంగారుకొండ అక్రమాలకు అండగా వసూల్‌రాజా రంగప్రవేశం చేశారు. మంగంపేట బెరైటీస్‌లో ఎలాంటి అక్రమం జరగలేదని, కాబట్టి విచారణ అవసరం లేదని అక్రమాలను కప్పిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. సస్పెన్షన్‌లో ఉన్న అధికారిని తిరిగి కొలువులోకి తీసుకునేందుకు సైలెంట్‌గా సర్వం సిద్ధం చేశారు. అయితే విజిలెన్స్ నివేదిక వచ్చాకే ఏదైనా అంటూ మంత్రి పెద్దిరెడ్డి అడ్డం తిరగడంతో మరోసారి ముఖ్యనేత ను రంగంలోకి దింపే ప్రయత్నం జరుగుతోంది. ప్రభుత్వం మారక ముందే ఈ కేసును మూసివేయాలని వసూల్‌రాజా గట్టి పట్టుదలగా ఉన్నారు.

ఇంటి దగ్గరే క్యాన్సర్ పరీక్షలు

- మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్‌ను ప్రారంభించిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి



అత్యాధునిక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చి ఇనిస్టిట్యూట్... అత్యాధునిక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్ ఆదివారం ఈ బస్‌ను ప్రారంభించారు. దీనికి సుమారు రూ.16 కోట్లు ఖర్చు కాగా, ఎస్‌బీఐ తమ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా రూ.1.5 కోట్ల ఆర్థిక సహాయం అందించిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ బస్‌లో అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌రే, మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ యంత్రాలతో పాటు క్యాన్సర్ నిర్ధారణకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, పరీక్షా ఫలితాలను వెనువెంటనే అందించేలా అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించాయి. దేశంలో ఇటువంటి ప్రత్యేకమైన బస్‌ను కలిగిన సంస్థ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి మాత్రమేనని బాలకృష్ణ చెప్పారు. పలువురు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నా భయం, బిడియం, అవగాహనలేమితో పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు రారని, అలాంటి వారికి ఇంటి వద్దనే స్క్రీనింగ్ చేయడం ద్వారా వ్యాధిని త్వరగా గుర్తించవచ్చని చెప్పారు. యాడ్ లైఫ్, అకడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ కల్పనా రఘునాథ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 1,177 ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాల్లో 2,24,532 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఆస్పత్రి సీఈవో డాక్టర్ కే కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రకృతి క్షేత్రాలకు బంగ్లాదేశ్ బృందం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాభివృద్ధితో నేల ఆరోగ్యం, పంట నాణ్యత, పర్యావరణ పరిరక్షణ అంశాల్లో ఏపీ రైతు సాధికార సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం కొనియాడింది. బంగ్లాదేశ్‌లో ప్రకృతి సేద్య రంగానికి చెందిన పల్లి కర్మ సహాయక ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను మూడు రోజుల పాటు పరిశీలించారు. అనంతరం విజయవాడలోని ఓ హోటల్‌లో రైతు సాధికార సంస్థ అధికారులతో ఆదివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ ప్రతినిధులు మహ్మద్ రఫీకుల్, కపిల్‌కుమార్ పాల్, శంషాద్ ఫర్హానా, తహఫిక్ హస్సేన్‌షా మాట్లాడుతూ రసాయనాలు వాడకుండా దేశీయ వంగడాలతో ఆహార ఉత్పత్తులు పండించడం వల్ల ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.



ఇదిగో రామమందిర ఉపగ్రహ చిత్రం

అయోధ్య, జనవరి 21: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈక్రమంలోనే ఇస్రో ఉపగ్రహం నుంచి తీసిన రామమందిర చిత్రాలను విడుదల చేసింది. ఇస్రో ప్రయోగించిన ఇండియన్ రిమోట్ సెన్సింగ్ కార్టోశాట్ అనే భూపరిశీలన ఉపగ్రహం గత డిసెంబరు 16న తీసిన ఈ ఫొటోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ద్వారా ఇస్రో విడుదల చేసింది. ఈ చిత్రంలో నిర్మాణ దశలో ఉన్న రామమందిరం దర్శనమిచ్చింది.

రామసేతు వద్ద ప్రధాని ధ్యానం

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

- పవిత్ర జలాల కలశంతో ఢిల్లీకి

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాట ప్రధాని మోదీ రెండ్రోజుల ఆధ్యాత్మిక పర్యటన ఆదివారం మధ్యా హ్నం ముగిసింది. 19న చెన్నైలో 'ఖేలో ఇండియా' క్రీడలను ప్రారంభించిన ఆయన శని, ఆదివారాల్లో వివిధ ఆలయాలను సందర్శించారు. అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో 11రోజుల అనుష్ఠాన దీక్షలో ఉన్న ఆ యన ఈ రాష్ట్రంలో రామాయణంలోని కీలక ఘట్టాలతో సంబంధం ఉన్న శ్రీరంగం ఆలయాన్ని, రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. రాత్రి రామేశ్వరంలోని శ్రీరామకృష్ణమఠంలో బస చేశారు. ఆదివారం ఉదయం ధనుష్కోడి ప్రాంతానికి చేరుకుని అక్కడ బంగాళాఖాతం, హిందూమహాసముద్రం కలి సే రామసేతు లేదా 'అరిచ్చలై మునై (పౌరాణిక నామం 'సేతు బంధన తీర్థం')' ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ మోదీ శివ పూజ చేశారు. శ్రీరాముడి జీవితంలో 'అరిచ్చలై మునై'కి ఎంతో ప్రాధాన్యం ఉందని, ఇది రామసేతుకు ఆరంభ కేంద్రమని తర్వాత ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. అరిచ్చలై మునై వద్దే మోదీ సముద్రస్నానమాచరించారు. కడలి ఒడ్డున ప్రాణాయామం చేశారు. తర్వాత కారులో కోదండ రామాలయానికి వెళ్లారు. మూలవిరాట్ వద్ద ఆయన నిల్చొని కాసేపు ధ్యానం చేశారు. ఆ తర్వాత రామేశ్వరం నుంచి హెలికాప్టరులో మదురై చేరుకుని.. విమానంలో పవిత్ర జలాల కలశంతో ఢిల్లీ బయల్దేరారు.




చిదంబరశాస్త్రి రూపొందించిన శ్రీరామయంత్రం, ప్రొఫెసర్ అన్నదానం చిదంబరశాస్త్రి

అయోధ్యకు శ్రీరామ యంత్రం

- ట్రస్టుకు అప్పగించిన చీరాల వాసి చిదంబరశాస్త్రి

చీరాల టౌన్, జనవరి 21: అయోధ్యలో సోమవారం జరిగే బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ప్రొఫెసర్ అన్నదానం చిదంబరశాస్త్రి ముఖ్యభూమిక పోషించారు. ప్రతిష్ఠ కోసం ఆయన శ్రీరామ యంత్రాన్ని రూపొందించారు. దాన్ని అక్కడి ట్రస్టుకు అప్పగించారు. ఈ యంత్రం పైనే ఇప్పుడు బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ యంత్రంలో ఉండే మంత్రబలం రాముని ఆకర్షణ శక్తిని మరింత పెంచుతుందని శాస్త్రి చెప్పారు.

అయోధ్య చేరుకున్న శ్రీవారి లక్ష లడ్డూలు

తిరుమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా భక్తులకు అందించేందుకు టీటీడీ ప్రత్యేకంగా తయారుచేసిన లక్ష లడ్డూలు అయోధ్యకు చేరుకున్నాయి. రామమందిర ప్రారంభోత్సవంలో పాల్గొనడానికి అయోధ్యకు చేరుకున్న టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి ఆదివారం వాటిని రామమందిర ట్రస్టు ప్రతినిధులకు అందజేశారు. 25 గ్రాముల చొప్పున తయారుచేసిన ఈ లక్ష లడ్డూలను 350 బాక్సుల్లో పెట్టి ఇటీవల విమానంలో తిరుపతి నుంచి అయోధ్యకు పంపారు. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అయోధ్యకు లక్ష లడ్డూలు సరఫరా చేసేందుకు టీటీడీ అధికారులు గతంలో అంగీకరించారు.

అయోధ్యలో తానా ఆహారం పంపిణీ

అయోధ్య, జనవరి 21: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ వేళ తానా(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) రామభక్తుల సేవకు ఉపక్రమించింది. అయోధ్యలో భక్తులకు ఆదివారం ఉచితంగా ఆహారాన్ని పంపిణీ చేసింది. వేలాదిమంది భక్తులు ఈ ఆహారాన్ని స్వీకరించారు. సోమవారం కూడా భక్తులకు ఉచితంగా ఆహారాన్ని పంపిణీ చేయనున్నట్టు తానా ప్రకటించింది.

గుండు సూదిపై శ్రీరాముడి స్వర్ణ విల్లు



అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ 21వ వార్డు గాంధీనగర్‌కు చెందిన కొత్తపల్లి రమేశ్‌ఆచారి అనే కళాకారుడు ఆదివారం గుండు సూదిపై బంగారంతో శ్రీరాముని స్వర్ణ విల్లును తయారు చేశారు. కేవలం 60 మిల్లీ గ్రాముల బంగారు రేకుతో అర సెంటీమీటరు ఎత్తు, సెంటీమీటర్ వెడల్పుతో రామ బాణం, జైశ్రీరామ్ అనే తెలుగు అక్షరాలను రూపొందించారు. - కాశీబుగ్గ

చిరుధాన్యాల రామచంద్రుడు



విశాఖ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చిరుధాన్యాలతో అయోధ్య రామమందిరం, శ్రీరామచంద్రుడి చిత్రాలను తీర్చిదిద్దారు. చిరుధాన్యాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గత కొన్నాళ్లుగా విజయ్‌కుమార్ పలుచిత్రాలు రూపొందిస్తున్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



తాళపత్ర శ్రీరాముడు

హిందువులకు శ్రీరాముడు అంటేనే ఒక ప్రత్యేక అనుబంధం.. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆ అనుభూతిని పలువురు వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు గ్రామానికి చెందిన తాళపత్ర చిత్రకారుడు భూపతి రాజు గోవిందరాజు.. తాటిమొవ్వ ఆకులతో ఇలా శ్రీరాముడి చిత్రాన్ని తీర్చిదిద్దారు. 8 గంటల పాటు శ్రమించి దీన్ని రూపొందించినట్టు ఆయన తెలిపారు. ఈ చిత్రాన్ని అయోధ్యకు పంపుతానని ఆయన చెప్పారు. - ఉండ్రాజవరం

రాముడి ఆగమనం.. అవనికే ఆనందం



అయోధ్యలో శ్రీరామచంద్రుని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ 'అయోధ్యలో రాముని ఆగమనం-అవనికే ఆనందం' అనే నినాదంతో శ్రీరాముని సైకత శిల్పం రూపొందించారు. ఆయనకు తన కుమార్తెలు సోహిత, ధన్యత సహకరించారు. ఈ సైతక శిల్పం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. - రంగంపేట

'పూల రాముడు'



అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా కడియంలో పల్ల వెంకన్న నర్సరీ రైతులు పల్ల సత్యనారాయణ, పల్ల వెంకటేశ్, వినయ్.. వారి నర్సరీలో వివిధ రకాల మొక్కలు, పరిమళాలు వెదజల్లే రంగురంగుల పూలతో శ్రీరాముని అందంగా తీర్చిదిద్దారు. - కడియం

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



ఇంకో అబద్ధం

ఆ పుస్తకం చదవడమెందుకు?
ఈ సినిమా చూడడమెందుకు?
దొరికిన పదాలకు అర్థాలు వెదుకుతున్నానా,
దొరికిన అర్థాలకు పదాలు తొడుగుతున్నానా?

పొడిచే పొద్దులలో, పొద్దును మూసే మబ్బులలో,
పౌరాణిక భూముల లోని వాగ్రత్త సమాధులలో,
సమాధుల తల శిలల మీద గాథలైన ఘోరాలలో,
నేను వెదికే బద్ధాలలో, బద్ధాలు విస్తరించే కొద్దీ
పల్చబడి అస్తమించే ఒక్కొక్క దిన-కరాలలో,
రోజూ సూర్యకిరణాల్ని తాగి భళ్లున వాంతి
చేసుకుంటున్న అతి దీనోచిత నక్షత్రాలలో,
మృతం అయినందుకే ఏదైనా అమృతమని
భాషించే మహా మాయక రాజకీయాలలో,
'నానోమీటర్ల'లో మాత్రమే కొలతలకు అందే
రాజకీయ కవితల్లోని అబద్ధాల తొడుగులలో,
అతి అత్యతి పల్చని పదాల రేకుల మీద
ప్రోగ్రాములు రాసే సరికొత్త 'ఇ.యూ.వి.
లితోగ్రఫీ'లను ఎవరు కొనగలరో వారికి
ఇంటలెక్చువల్ పేటెంట్లు అమ్ముకునే విజ్ఞానులు
వదులుకునే మానాభిమానాల్లో, అమ్ముకోదగినది
ఏదో ఒహ పని చేయకుండా ఉండలేని
బానిస-బౌద్ధిక శ్రమ జీవన సుందరమైన, లోనికి
తోకలు ముడుచుకున్న వా-నరుల హస్తాలలో

ప్రియమైన పాఠకుడా నేనేమి వెదుక్కుంటున్నానో
నాకు తెలియదు. పేరు మరిచిపోయిన పాత ఈగ
న్నేను. ఊరికే అలుకుతున్నాను మన ముంగిలిని
ఎండిపోయిన పేడను కాసిని నా కన్నీళ్లతో తడిపి

ఇన్ని వైఫల్యాలూ, ఇన్నిన్ని దుఃఖాల తరువాత
నేను వెదుక్కుంటున్నది ఏమిటో
పాఠక మహాశయా, ప్లీజ్, నువ్వైనా చెప్పగలవా
పొడుపు కథను నొప్పి తెలీకుండా విప్పగలవా?

హెచ్చార్కె

(నానోమీటర్ = 0.000000001 మీటర్.
ఇ.యూ.వి. = ఎక్స్‌ట్రీమ్ అల్ట్రా వయొలెట్ లితోగ్రఫీ: 13.5 నానోమీటర్ల వేవ్‌లెంగ్త్ కలిగిన కాంతికిరణంతో అత్యంతపల్చని సిలికాన్ వేఫర్ల మీద వ్రాసే టెక్నాలజీ.)

'అక్షరం' పురస్కారం

అక్షరం లిటరరీ ట్రస్ట్, కర్నూలు ఇస్తున్న అక్షరం లిటరరీ అవార్డ్‌ను 2024 సంవత్సరానికి ప్రసేన్ స్వీకరిస్తారు. పురస్కార ప్రదాన సభ జనవరి 28 ఉ.11గంటలకు మాంటిస్సోరీ హైస్కూల్, ఎ-క్యాంపు, కర్నూలులో ఉంటుంది.

జి. వెంకటకృష్ణ

'చిత్ర కళా ప్రపంచం'

ఎల్.ఆర్. వెంకటరమణ రచించిన చిత్రకళా వ్యాసాల పుస్తకం 'చిత్ర కళా ప్రపంచం' ఆవిష్కరణ జనవరి 27 సా.6గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, షోయబ్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో రావూరి సురేష్‌బాబు, ఏనుగు నరసింహారెడ్డి, రూప్ కుమార్ డబ్బీకార్, ఎస్. రఘు తదితరులు పాల్గొంటారు.

పాలపిట్ట బుక్స్

'అనంత' సహృదయత

హృదయ, బుద్ధి ఔన్నత్యాలూ, జ్ఞానవివేకాలూ మేళవించిన లేఖలు వాటిని అందుకొనే వ్యక్తుల సంక్షుభిత హృదయాలకు ఊరటనిస్తాయి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ లేఖలు ఆపాతమధురాలు, ఆలోచనామృతాలు. అనంతకృష్ణుల వారు 20వ శతాబ్దం మొదటి దశకం నుంచి నలభై ఏళ్లపాటు మైసూరులో సంస్కృత పండిత ప్రకాండుల మధ్య, కర్ణాటక సంగీత కోవిదుల నడుమా జీవితం గడిపి, సాహిత్య సంగీతాల సంస్కారాల్నీ మాధుర్యాల్నీ రక్తగతం చేసుకొన్నారు. అందువల్లే శర్మగారి సాహిత్య రచనల్లో భావ ఔదాత్యమూ, సంగీత రచనల్లో జీవన పరిమళమూ గుబాళిస్తాయి. రాళ్ళపల్లి వారి విమర్శనా రచనల వైశిష్ట్యం గురించి సాహిత్య ప్రియులకు కొత్తగా చెప్పవలసినదేమీ లేదు. అనంతకృష్ణుల వారి లేఖల్లోని రామణీయకాన్ని, సుకుమార హాస్యాన్ని, జీవన సౌందర్యాన్ని దర్శించే సువర్ణావకాశం పాఠకులకు కలిగినట్లు లేదు.

రాళ్ళపల్లి వారు మానవీయ విలువల్ని ఆరాధించటమే కాక సాధ్యమైనంత వరకు ఆచరణలో పెట్టినారు కూడా. తమ గురువైన కట్టమంచి రామలింగారెడ్డి రాసిన 'నవయామిని' కావ్యాన్ని అందుకొని ఆయన మైసూరు నుంచి 15-10-1947న రాసిన లేఖలోని ఈ వాక్యాలు ఆయన ఉదాత్తతకు ఇచ్చిన అపారమైన గౌరవాదరాలు వెల్లడి అవుతాయి. "నాయందు ఎప్పటి వాత్సల్యముతో తాము పంపిన 'నవయామిని' కావ్య కుసుమ మందినది. ధన్యుడను. ఇంతకుముందే 'భారతి'లో దానిని చదివి, ఇన్నాళ్లకు మరల మీ సహజధర్మములలో గొప్పది యగు కవిత్వమునకు వచ్చితిరి గదా యని ఆనందాశ్రువులను విడిచి యుంటిని. నా అనుభవము నొక్కమాటతో చెప్పవచ్చునేని తిక్కన్నగారి భారతేక్షువును తుదముట్ట రసించిన వారికి గూడ- ఈ చిక్కదనము, చక్కదనమును లభించునవి గావు. ఈ మహామహుని గొప్పతనము నందలి యేక దేశము నేననుభవించి ధన్యుడనైనది మీరిచ్చిన సహవాస భాగ్యము వలననే. కావున ఆయనకు మీకును గల ఆధ్యాత్మిక ప్రణయమును నేను గొంత యెఱుగుదును.

" 'బిల్హణీయ మందలి విషయము మంచిది కాదు' అనునది సత్యమైన ధీర వాక్యము. మీవంటి పరిణత ప్రజ్ఞులు మాత్రమే చెప్ప గలిగినది; చెప్పవలసినది. ఆ నాయికా నాయకుల నిద్దఱిని పవిత్ర హృదయులనుగా భావించి, భావింప జేసితిరి. నీతి – ముఖ్యముగా -- కామనీతి ఎంత స్వచ్ఛందముగా నున్న నంత మేల్మిగా భావించుట ఆధునిక కవులలో పలువురికి సహజమైనది. ఇట్టి కాలములో పక్వమైన ధీరత గలవారు తప్ప ఇతరులు ఈ రచనలు చేయలేరు. ఇందుకై నాహార్దమైన సంతోషమును తమకు కానుక పెట్టుచున్నాను." ఉదాత్తమైన మానవీయ విలువల్ని ప్రతిపాదించిన ఓ ప్రఖర విమర్శకునికి మరో ప్రబుద్ధ శిష్య విమర్శకుడు అర్పించిన వినమ్ర నివాళి ఇది.

అనంతకృష్ణుల వారిని కొందరు విద్వాంసులు 'అభిరుచి విమర్శకులు' అని అన్నారే కాని వారు జీవితంలోని రాగద్వేషాల్ని, సుఖదుఃఖాల్ని, మిట్టపల్లాల్ని సూక్ష్మంగా పరిశీలించిన, వివేచించిన వివేకవర్ధనులే. కర్ణాటకలోని బళ్ళారి జిల్లా హొస్పేట నివాసి రాజగురు ఏటూరు తోళప్పాచార్యుల వారితో శర్మగారికి జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు మనకాశ్చర్యాన్ని కలిగిస్తాయి. రాళ్ళపల్లి వారి సాంఘిక, రాజకీయ చింతన ఈ లేఖాంశంలో సుస్పష్టమవుతుంది - "నెహ్రూ కాలంలో నాస్తిక దావానలం అంటుకొన్నదన్నారు. ఆయనకు అధికారం రావడం వల్ల అట్లు జరిగింది. కాని రామలింగారెడ్డి వంటి ప్రతిభావంతులైన నాస్తికులు, స్వార్థపరులు మనదేశంలో అలికిన పంకం అంతా యింతా కాదు. దానికి లోబడిన నా పూర్వ వయస్సులోని చిత్తవృత్తిని తల్చుకుంటే నాకిప్పుడూ ఒళ్ళు జలదరిస్తుంది. సిగ్గుపడుతూ వుంటాను. నెహ్రూ ప్రతిగా రెడ్డి వచ్చివుంటే మన దేశస్థితి యేమైపోయియుండునో ఊహించుటకూ భయంగా వుంది. గాంధీ గారి వాసన కొంతకు కొంతైనా నెహ్రూకు తగిలి కట్టు పరిచిందనుకోవలసియున్నది.

> రాళ్లపల్లి వారి మాటల్లో మాధుర్యం వుంది, మృదుత్వం వుంది. అప్పుడప్పుడు అక్కడక్కడా మెరుపు తీగలా మెరిసే ధ్వని కూడా వుంది. సహృదయత, స్నేహశీలత, వాత్సల్యం, సద్విమర్శ ఆయన మాటల్లో, రాతల్లో సంగమించి వారి లేఖలు చదువరులకు మనోల్లాసం, మనోవికాసం కలిగిస్తాయి.


" 'రామరాజ్యము' ఒకటి వాల్మీకి గ్రంథానికి వదలి చూస్తే, రాజకీయాలూ ఎప్పుడూ ఇట్లే సాగుతావుండినవనిపిస్తుంది. కనుకనే ధర్మము - నీతి వేరుపరిచిరి పెద్దలు. నీతి రాజులది. తాత్కాలికోపద్రవాలను సామదానాదులతో అణచేది దానిపని అంతే. మనుష్యుని సామాన్యమైన యోగక్షేమాలను నిర్ణయించి నడిపేది ధర్మం. అది రాజులో, మంత్రులో, సేనాపతులో చేయగలిగిన పని గాదు. ఫలాపేక్ష లేక, భగవత్ప్రీతిగా ప్రజలకు నిర్విరామంగా ధర్మాన్ని బోధించి, మనస్సులను మార్చే పని రాజకీయాదులను తాకని వ్యాసాదుల వంటి వారిది. మనలో మఠాలు, స్వయమాచార్యులు మొదలైన సంస్థలందుకై యేర్పడినవి. కాని ఆ సంస్థలన్నీ సంస్థానాలై రాజులకన్న అన్యాయముగా అధర్మముగా ప్రవర్తించి పాడైనవి. ...భగవత్ స్వరూపము వలె ధర్మము గూడ వైయక్తికంగా, సాంఘికంగా దినేదినే మన హృదయంలో పెరిగి ప్రసరించవలసిన తత్వమనకు తీరదు. 'ధర్మోధర్మ విదుత్తమః' అని ఆయనకే ఆ బరువంతా మోపి మనం సాధ్యమైనంత ప్రశాంతంగా కాలం గడపవలసి వున్నాము. మన చేత ఏమీ జరగదనే నమ్మకం దినే దినే క్షణే క్షణే పెరుగుతూ వుంది. ఉండనీయండి." (తిరుపతి 12-10-1969)

కాలం గడిచే కొద్దీ శర్మగారికి సమాజంలో, దేశంలో స్వార్థం పెరిగి, చాలామందిలో రాముని సేవ కంటే ఆత్మారాముని సేవే ముఖ్యమై కూర్చుంది, అన్న అభిప్రాయం బలపడుతూ వచ్చింది. సాంఘిక పరిస్థితులు మరింత దుర్భరంగా తోచసాగాయి. అనంతకృష్ణుల వారు సన్మిత్రులు శ్రీమాన్ తోళప్పాచార్యుల వారితో ఈ విషయమే ప్రస్తావించారు - "బైట రాజ్యం, సంఘం రెండూ అవివేక భారంతో వట్టి ద్రవ్యార్థమైన జీవితంలో అల్లకల్లోలంగా వుండే కాలంలో మనమున్నాము. ఎక్కడా త్యాగం కాని, లోక క్షేమ దృష్టి కాని లేక, ఎవరినీ నమ్మి వుండడానికి వీలులేక, యే నిమిషంలో ఏమి మూడుతుందో అని శంకిస్తూ కాలం గడపవలసి వుంది. పురాణ కథలు నిజమైతే మళ్ళీ కృతయుగం పుట్టించడానికి కల్క్యవతారం దిగే దానికి ఇంతకన్నా మంచికాలం వుండదు." (బెంగళూరు 11-10-1974)

రాళ్లపల్లి వారి విమర్శ ప్రాచీన సంస్కృతాంధ్ర కావ్య నాటకాలకే పరిమితం కాలేదు. ఆధునిక రచనలకు పీఠికలు రాసినా, అందుకున్న రచనల గురించి ముచ్చటైన మూడు మాటలు రచయితలకు పంపినా ఆయన చూపు సమకాలీన సాంఘిక పరిస్థితుల వైపు తప్పనిసరిగా మళ్లేది. ముఖ్యంగా పెద్దలతో, పిన్నలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు సమకాలీన సమాజపు పోకడల్ని నిశితంగా పరిశీలించేవారు, తమ అభిప్రాయాల్ని నిర్భయంగా వెల్లడించేవారు. విషమ పరిస్థితులు దాపురించినప్పుడు వాటిని ఎదుర్కోలేక, నిస్సహాయులై దేవుడికి దండం పెట్టి నిట్టూర్చేవారు.

రాళ్లపల్లి లేఖల్లో మనకు ఆయన ప్రతిపాదించిన, అనుసరించిన విమర్శనా సూత్రాలు స్పష్టంగా దర్శనమిస్తాయి. ప్రసిద్ధ విమర్శకులైన నాగళ్ళ గురుప్రసాద రావుకి రాసిన లేఖలో రాళ్లపల్లి వారి విమర్శనామార్గం బోధపడుతుంది - "నా విమర్శ లేశములను గూర్చి మీరు గొప్పగా భావించితిరి. కృతజ్ఞుడను. నా దృష్టిలో, నా వ్యవహారములో విమర్శ ఒక శాస్త్రము గాదు. ఆ దృష్టితో నా విమర్శలు నేనెప్పుడును సాగింపలేదు. నాకు తోచినది అభిమాన - సంప్రదాయములకు పూర్తిగా లొంగక స్పష్టముగా వినతితో చెప్పవలెనని నా ప్రయత్నము. ఉర్భటడ ఛిటజ్జీజీఛిజీటఱు జీట్చు న్లౌఛిజ్లొజుట్చుఇజిడ అని ఒక తత్వదర్శి అన్నాడని విన్నాను. నా విషయమున అది సరియని యంగీకరిస్తాను. ఇందు ప్రాత-క్రొత్త యను - రాగవిరాగములుండవు. ఉండినను దుర్బలములుగా ఉండునంతే.

"విమర్శకత్వము గూడ కవిత్వము వంటిది. ప్రాతకొత్త రీతుల పులుముడులు నేటి కవిత్వములో ఎంత కలవో విమర్శలందును అంతకు తక్కువ లేవు. కనుక భవభూతి వాక్యమును మరిచిపోని మీ వంటివారికి 'మన మెక్కడకు పోవుచున్నాము?' అను నిర్విణ్ణపు ప్రశ్న రానక్కరలేదు. 'నేనెక్కడ పోవుచున్నా'నని ప్రశ్నించుకొన్నచో చాలును. అది మన సద్గతిని సాగించును. సాహిత్య వీధు లందును 'యశసేర్థకృతే' అను ఫలదృష్టియే నాటికి నేటికి పలువురిని నడపించు రథము. అది సహజము. సాధ్యమైనచో మనలను మనము వేరుత్రోవల సాగించుకోవచ్చును."



రాళ్లపల్లి వారు చెప్పినట్లు రచయితలు చాలామంది పేరు ప్రసిద్ధుల కోసమో ఆర్థిక లాభం కోసమో రచనా వ్యాసంగం చేసిన, చేస్తున్న మాట నిజమే. నేటి రచయితలు, విమర్శకులు చాలా మంది నుదుటిపై నానారకాల లేబిళ్లను తగిలించుకొని రచనా వ్యాసంగం చేస్తున్నా, నిమగ్నత, నిబిడతలు కనపడుతున్నా నిబద్ధత మాత్రం వాళ్ల రచనల్లో హుళక్కి. ప్రభుత్వానికీ వ్యవస్థకూ విరుద్ధంగా పోరాడుతున్నామని ఘోషిస్తూ వాదాల డాళ్లను అడ్డం పెట్టుకొని అకాడమీల అవార్డుల్ని, ప్రభుత్వ మిచ్చే జీవనసాఫల్య పురస్కారాల్ని మూటకట్టుకోవడం చూస్తూనే వున్నాం.

అనంతకృష్ణుల వారు తమ అభిప్రాయాలు ప్రకటించేటప్పుడు చాలా వరకు నిక్కచ్చిగానే, నిజాన్నే వెలువరిస్తారు. ఏ కొన్ని సందర్భాల్లోనో ధ్వనిని వూతకర్రగా తీసుకుంటారు. అక్కడ కూడా సత్యం దాగకుండా ఆకుచాటు పిందెలా తొంగి చూస్తూ వుంటుంది. ప్రసిద్ధ శతావధాని సి.వి. సుబ్బన్న గారికి రాసిన ఈ వుత్తరం శర్మగారి ఋజుమార్గాని సాక్షి - "అవధాన విద్య అనేకులకు ఆకర్షకమైన వినోదమే. అందులో అడుగుపెట్టిన తర్వాత పైకెత్తుటకు గజప్రయత్నమే కావలయును. జనులు ఎంతో విశ్వాసము తోసే అట్లు ఎత్తనీయరు. ఇది యెఱిగియే మీకు నేను తీవ్రముగా వ్రాయుట. భావమందు, అర్థములందు, శబ్దములందును పునరాలోచన కవకాశమియ్యక పని పూర్తి చేయించు వాడుక కవికి ఆశుకవితావధాన వ్యాసంగపు ఫలమై పరిణమించును. తిరుపతి వేంకటేశ్వరుల వంటి ప్రతిభావంతులగు పండితులు గూడ దీనికి తప్పలేదు గదా, అనగా మీ ప్రతిభ తక్కువయినదని కాదు. కవితాకళ ఆ చౌక రకపు వినోదములతో పర్యవసింపరాదని నా యాశ." (తిరుపతి : 25-1-1962)

శర్మగారు సుసంస్కృతులూ, సుకుమార స్వభావులూనూ. పెద్దల పట్ల గౌరవం, పిన్నల పట్ల స్నేహ సౌహార్ద భావం గల మధుర స్వభావులు. తుమ్మల సీతారామ మూర్తి చౌదరి కావ్యం 'ఆత్మార్పణము' అందుకొని వారికి రాసిన లేఖలోని కొన్ని వాక్యాలు - "ఎందఱో, ఎన్ని విధములనో దాని నిది వఱకు వ్రాసిరి. మీరిప్పుడా కథకు చక్కని మెఱుగు లిచ్చితిరి. మీకు సంస్కృతాంధ్రముల యందు ధారాళమైన శైలి కలదు, మీ గ్రంథమును జదువునప్పుడేదో యొక ప్రాతకాలపు ప్రబంధమును చదువుచున్నట్లు భావము కలుగును. తొడకు లేని శుద్ధమైన శైలిగల మీరు ఇక మీద నాంధ్రసాహిత్యమునకు నెంతయో పరిపోషమునీయగలరు." (మైసూరు 15-7-1929) ప్రతిభను పురస్కరించే సహృదయత రాళ్లపల్లి వ్యక్తిత్వానికి పుట్టుసొమ్మేకాని పెట్టుసొమ్ము కాదని పై మాటలు చెప్తాయి.

బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి ఆహ్వానం మేరకు టీటీడీ సాహిత్య సమావేశంలో పాల్గొనేందుకు తనకు సెలవు లేదనీ, సెలవుల్లో అయితే సంతోషంగా రాగలననీ చెప్తూ రాళ్లపల్లి వారు రాసిన ఈ మాటలు వారి వ్యక్తిత్వ గరిమను చాటుతాయి. - "నేనెవరికీ పూజారిగా ఇది వరకూ బ్రదుక లేదు. ఇప్పుడా ఆగమాన్ని నేర్చుకోలేను." (మైసూరు. 16-3-1949)

శర్మగారి రాతల్లో గుణదోషాల చర్చ సంయమన దృష్టితో దర్శనమిస్తుంది. వారు ముఖ్యంగా విమర్శకులు. వారు రాసిన కవిత్వం తక్కువే అయినా, అందులో భావరామణీయకం, అక్షరరమ్యత ఎక్కువే. ఆయన గద్యంలో పలుచోట్ల పద్యపరిమళం, సౌకుమార్యం మనస్సుకు ఇంపు కలిగిస్తాయి. మిత్రులైన కుంటిమద్ది శేషశర్మకు 'గాథాసప్తశతీ సారం' ప్రతి పంపుతూ రాళ్లపల్లి వారు తిరుపతి నుంచి 6-4-1964న రాసిన లేఖలోని ఈ వాక్యాలు చూడండి - "ఈ దినము నా 'సప్తశతి' ప్రతి యొకటి మీకు పంపినాను. ఈ గజగర్భము ఇంత కాలానికి ఈ శశ ప్రసవమును సాధించినది," అని రాస్తారు. ఏనుగు 22 నెలల పాటు గర్భం ధరించిన తర్వాత ప్రసవిస్తుందట. ఏనుగు కడుపున ఏనుగే పుట్టాలి కదా. శర్మగారు 'సంపూర్ణ శాలివాహన గాథాసప్తశతి సారము' ముగించేందుకు సుమారు నలభై ఏళ్ల సుదీర్ఘ కాలం పట్టింది. మరి ఆ రచన గున్న ఏనుగు కావాలి కదా? కాని రాళ్లపల్లివారు సృష్టించింది సుకుమారమైన, సుందరశోభితమైన కుందేలును. 'వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్' అంటే ఇదేనేమో!

రాళ్లపల్లి వారు ఏదైనా ఓ విషయం గురించి తనకు తగిన సాక్ష్యాధారాలు పుష్కలంగా లభించినప్పుడే అభిప్రాయాల్ని ఖరాఖండిగా వ్యక్తం చేస్తారు. లేకపోతే 'నాకు తెలిసినంత వరకు' 'నామటుకు తోచినట్లు' అని అంటూ తటస్థంగా వుండిపోతారు. అంతేకాని హద్దు మీరిన స్వభాషాభిమానాన్ని కాని, అభిప్రాయాన్ని కాని ప్రకటించరు. డా. కోవెల సంపత్కుమారాచార్యగారి 'తెలుగు ఛందోరీతులు' గ్రంథంపై తమ అభిప్రాయం కోవెల వారికి తెలుపుతూ, విమర్శకులు కవుల దేశకాల పరిస్థితుల గురించి లోతైన అధ్యయనం చెయ్యకుండా వూహించి తమ అభిమతం తెలుపడం సమంజసం కాదంటూ ఇలా రాస్తారు - "తెలుగు కవి పద్మడును, కన్నడ కవి పద్మడును ఒకడే యను కొనుట (పుట-42) నాకు వట్టి నిరాధారాభిమానముగా తోచుచున్నది. ఆ యభిప్రాయము మనమెంత మరచిన నంతమేలు."

రాళ్లపల్లి వారి లేఖల్లో కనపడే భావసౌజన్యం, భాషా సౌకుమార్యాల మణికాంచన సంయోగం పాఠకుల్ని మురిపిస్తుంది. ఆత్మీయ మిత్రులైన కలుగోడు అశ్వత్థరావుగారు తమ రచనలకు పీఠిక రాయమని పదేపదే బలవంత పెట్టినప్పుడు శర్మగారు ఓ లేఖలో సున్నితంగా మందలిస్తారు. ముద్దుపలుకు ముక్కు తిమ్మన్న మధుర ప్రబంధం 'పారిజాతాపహరణము'లోని పంక్తులు జ్ఞప్తిక తెచ్చుకొని "మెత్తని కినుక తోడ గౌరవ మెనసెడి వాక్యమ్ములతో" శర్మగారిలా రాశారు- "పీఠికలు - అభిప్రాయాలు ప్రకటించుట యందు మీకును నాకును ఐకమత్యము కుదరదేమో! మీ వంటి స్వతంత్రులు, పారమార్థిక చింత గలవారును దానికి లొంగవలసిన పనిలేదు. ఇది మరుగు లేక పలుమారు చెప్పినాను. కాని మీ మనస్సును మార్చలేక పోయినాను." (తిరుపతి, 3-11-67)

రాళ్లపల్లి వారి మాటల్లో మాధుర్యం వుంది, మృదుత్వం వుంది. అప్పుడప్పుడు అక్కడక్కడా మెరుపు తీగలా మెరిసే ధ్వని కూడా వుంది. సహృదయత, స్నేహశీలత, వాత్సల్యం, సద్విమర్శ ఆయన మాటల్లో, రాతల్లో సంగమించి వారి లేఖలు చదువరులకు మనోల్లాసం, మనోవికాసం కలిగిస్తాయి. వారి వ్యక్తిత్వం, కృతిత్వాలను మనోజ్ఞంగా చెప్పాలంటే సి. నారాయణ రెడ్డి గారి వశ్యవాక్కు కంటే నాకు మరొకరి మాటలు స్ఫురించవు:

"మతము వైష్ణవము; అభిమతము సుందర శివము
పలుకులో మార్దవము; తలపులో ఆర్జవము
ఆర్ద్రతకు అతని నయనాంచలమ్ములకు ముడి
ఔచితికి అతని మత్యంతరాళమ్ము ఒడి."

ఘట్టమరాజు
99640 82076


ఎనకబడ్డోల్ల బతుకు కతలు

ఎండ్లూరి సుదాకరయ్య గోరు కొందరు పెద్ద మడుసులు కుట్ర జేసి కులం పేరుతో ఊరి శివరకు నెట్టేసిన ఎనకబడ్డ జాతిలో పుట్టిండు. సిన్నప్పుడే ఆకలి రుసి తెలుసుకున్నడు. అగసాట్లు పడే సదూకున్నడు. పెద్ద సదూలే సదివిండు. ఎన్నెన్ని సురుకులు తగులుతుంటే ఓర్సుకోని సదివిండో గానీ శానా కసితో సదివిండు. గొప్ప కొలువు గూడా సంపాయించిండు. పిల్లోడిగా ఉండకాన్నుంచే ఆ అయ్యకు అచ్చర మంటే బో పేనం. ఏడో కలాసు సదివేతప్పుడే మసిబొగ్గుతో గోడల మీన కయితలు రాసేటోరంట. తోటి సావాసగాల్లు ఆయన కైతల్ని తెగ మెచ్చుకొని బుజాల మీన తువ్వాల గప్పేటోల్లంట. ఇంగ ఆన్నుంచి యీలు సిక్కినప్పుల్లా సుదాకరయ్య కైతలు, కతలు రాత్తానే ఉండు.

అట్టా ఆయన రాసిన బొక్కుల్లో ఒకటి 'మల్లెమొగ్గల గొడుగు'. ఈ కతలన్నీ మాదిగ పల్లె బతుకుల్ని సూపెట్టేయే. వోరు పుట్టి పెరిగిన ఊరు రావికుంటపల్లెంట. ఆడ ఆయన బందూలు, ఇరుగుపొరుగుల బతుకుల్లోని కట్టాలు, అవమానాలు, ఆకలి బాదలు ఈ కతల్లో కనబడతయి. పెకాశం జిల్లాలోని కనిగిరి సుట్టుపక్కల సదూలేని మట్టి మనుసుల బాసను ఏం మార్సకుండా, రంగులెయ్యకుండా వున్నది ఉన్నట్టు రాయడం ఈ కతల్లో పత్తేకం. వాటిల్ల ఒక్కో కత సదూతుంటే.. ఎండు తునకల్లో గోగాకేసి మసాలా ఎట్టి వండుతున్నట్టు గుమగుమ లాడుతుంటది. ఆ అయ్య రాసిన ఒక్కో కత ఇంటుంటే.. ఏడి ఏడిగా కమ్మకమ్మగా ఒక్కో ముద్ద గొంతు దిగుతున్నట్టే ఉంటది.

ఈ కులపిచ్చి యవ్వారం నిన్నటిదో మొన్నటిదో గాదు. ఇప్పటికీ అదే నడుత్తుంది. బూమికి, ఊరికి దూరమై వెలివాడల్లో మగ్గుతుంది. "ఇంగెక్కడి కులం? ఎప్పుడో బొయింది" అనే పెద్ద మనుసులంతా ఒక్క పాలి మా పల్లెల్లోకి వొచ్చి తొంగి సూడండి. మా బతుకుల్లోకి వొచ్చి విశారించండి. మా అవమానాలు, ఆకల్లు, కన్నీలు, మీకు కొత్త నిజాలు సెప్తయి. వేల ఏండ్లుగా సాగుతున్న నిశిద్ద చరిత్ర కొత్త రంగు పులుముకొని పలకరిత్తది. ఊరి సివర్న వుండే మా గుడిసెల్ని దీసకపోయి మీ ఇల్ల పక్కన వెయ్యండి. మా పిల్లలకు మీ పిల్లలతో లగ్గం సెయ్యండి. అంబేద్కరయ్య సెప్పినట్టు కులాంతర వివాహాలు జరిగితేనే కులం బొయినట్టు. అందుకు మీ పెద్ద మనసులు ఒప్పుకుంటయా? ఆలోసన సెయ్యండి.

ఈ పుత్తకంలో ఏదో ఒక్క విసయం గాదు. అబాగ్యుల దుక్కము, సంతసము, పౌరుశము, పట్టుదల, బలయానత, ఆశ్శము.. ఇట్టాంటి గునాలు అన్నీ సెప్పుకొచ్చిండ్రు. ఈటిల్లో సగం కతలు దప్పు సుట్టూ సెప్పు సుట్టూ తిరుగుతయి. మాదిగల సారం, సారాంశం పెకటించే గొంతులై మాటాడుతయి. "నేను గాని సుక్కేసుకొని కాక బెట్టిన పలక వాయిస్తే.. దీనెబ్బడాల! సరస్వతి గూడా ఈన అవతల బార్నాకి సిందులెయ్యకపోతే నేను మా యబ్బకి బుట్టలా" అంటడు బోడెయ్య.



కిర్రు సెప్పులు కుట్టడంలో సెయ్ దిరిగిన కోటన్న "సెప్పులు మా కులదేవతలు" అని గొప్పగా సెప్పుకుంటడు. సెప్పులు గుట్టే విద్దె గురించి కోటన్న సెపితే ఇనాల: "సెంద్ర మండలం మీదికి బొయ్యే వోడికి సెప్పులు గావాల. ముండ్ల తుప్పల్లో దిరిగే వోడికీ సెప్పులు గావాల్సిందే. సెంద్రుడు కాడికి యోగిరి బొయ్యినోడు ఎంత గొప్పో నిప్పు దగల కుండా, ముల్లుదగలకుండా ఎన్నెలంత సల్లంగుండే తోలుసెప్పులు గని పెట్టినోడు యొందులో తక్కువా?" ఇది పెద్ద కులపోల్లు బరాయించలేని ప్రశ్న.

తాటి సెక్కలు వుడకేసుకు తినే పుల్లమ్మ గాంధీ మహాత్ముడి గుర్సి: "సచ్చి యాడున్నడో గాందెయ్య మనోల్ల మీన శానా జాలి సూపిచ్చే వోడంటనే? అట్టయితే మనోల్లని వూరికి అసింట బెట్టిన సంగతి ఆ పెద్దాయనకు బాగా తెలుసుగావల్నే? వూరు వూరంతా ఒకటి గావాలని, అందరు అరిజన్లే అని ఆయన జగడం బెట్టి పోరాటం ఎందుకు జెయ్యలా?" అని పుల్లమ్మ బో తెలివిగ, కుశాలుగ అడుగుద్ది.

కులాల్లో ఎచ్చు తగ్గుల్ని సెపుతూ మనిసి పైసల్లో కూడా కులం ఉంటది అంటడు రాజారావు. రెడ్డీ ఓటల్, చౌదరి ఓటల్, బాపన ఓటల్ అనున్నట్లు మాదిగ ఓటల్ లేకపోవడానికి కారణం పెద్ద కులాలకు మాత్రమే యాపారం జేసి సంపాయించుకొనే అవకాశాన్ని కుల వెవస్థ కలిగించిందని "ఇక్కడ కులానికొక్క ఓటలుంది సార్.." అంటడు.

"మనం కుట్టిన సెప్పులతోనే ఈ పపంచకం మన మాడున కొడతా వుంది", "మా కట్టం ఎవురికి తెలుసుద్ది? ఈ సిల్లకర్రకీ, తప్పెట పుల్లకీ తెల్సుద్ది", "కులమేంది? జాతేంది? ఈ బూమ్మీద రొండే కులాలు. రొండే జాతులు. ఆడా! మగా! దీని మించినయ్యి ఇంగేమీ లెవ్వు", "మా నాయిన నడస్తా వుంటే సీకట్లో సెంద్రవంక కదిలినట్టుండేది. ఆ ఎల్తర్లోనే నాలుగు అచ్చిరాలు నేర్సుకున్నం. అవటాల ముంచి సీకటంటే బయ్యం పొయ్యింది", "అయితే కులముండ్లా! అది సీకటి కంటే సిక్కనైంది. ఇప్పుడు దాన్ని గోసే ఎల్తురు గత్తులు గావాలన్నా".. ఈ కోటేశన్లు అన్నీ సుదాకరు సారు రాసిన 'మల్లె మొగ్గల గొడుగు' బొక్కు లోనియే. ఎంత సక్కంగా రాసిండో? అయ్ సదూతుంటే మన బతుకుల్ని కల్ల ముందు పరిసినట్టే ఉంటది. కడుపులో ఎవురో సెయ్యి బెట్టి కెలికినట్టే ఎడద కలుక్కుమంటది.


ఇంగా, ఇట్టాంటియి ఎన్నో పుత్తకాలు ఏసిండ్రు. వాటిల్ని గూర్సి సెప్పాలంటే.. ఇట్టాంటి కాయితాలు మరిన్ని గావాల. సుదాకరు గోరి మాటలు గూడా ఇనసొంపుగా వుంటాయంట. మాటే గాదు.. బుద్ది గూడా బంగారమే అంటరు ఆయన్ను ఎరిగున్నోల్లు. ఎవురికీ అపకారం సెయ్యలేదు. ఒక మాటని కట్టిపెట్టలేదు. తన పనేందో! తనేందో! మనుసులంతా ఒకే కులమై బతకాలనీ, అంటరాని బుద్దులు పోవాలని బో కలలుగన్నడు. ఎనకబడ్డ కులంలో బుట్టినందుకు ఎన్ని అవమానాలు అనబగించిండో..! మడిసికి విలువ ఇచ్చేది సదు ఒక్కటేనని 'ఆత్మకత' అనే కైతలో రాసుకుండు. ఆ పాటమిప్పుడు తొమ్మిదో తరగతి పిల్లోల్లకు బొక్కులో పెట్టిండ్రు.

ఇంతాజేసి, ఆ అయ్యకు ఏం తొందరయ్యిందో, ఎవురో పిల్సినట్టు అడావుడిగా ఎల్లిపొయిండు. అయినా మన బెమ గానీ, యాడికి బోతల్లే? ఆకాసం అంచు మీన ఆ సివర్న నులకమంచ మీన గూసొని తన సవాసులతో కైత గోస్టి పెట్టి ఉంటడు. మజ్జె మజ్జెలో తన బిడ్డల్ని, బంధుమిత్రులనీ తల్సుకొని కిందికి సూస్తా ఉంటడు. ఇంకా అంబేద్కరయ్య ఆశించిన రాజ్యం కోసం కలలు కంటా ఉండి ఉంటడు.

లక్షలాది డప్పులకూ
కణకణమండే నిప్పులకూ
తిరగబడ్డ చెప్పులకూ...
తన అచ్చరాలను అంకితం జేసిన సుధాకరుడికి అచ్చర నివాలులు.

(జనవరి 28 ఎండ్లూరి సుధాకర్ ద్వితీయ వర్ధంతి)

సునీత గంగవరపు
94940 84576



> 'మల్లెమొగ్గల గొడుగు' కతలన్నీ మాదిగ పల్లె బతుకుల్ని సూపెట్టేయే. వోరు పుట్టి పెరిగిన ఊరు రావికుంటపల్లెంట. ఆడ ఆయన బందూలు, ఇరుగుపొరుగుల బతుకుల్లోని కట్టాలు, అవమానాలు, ఆకలి బాదలు ఈ కతల్లో కనబడతయి.



కాలం

శీలమంటే కాలమూ - ఆ
కాలమది విశాలమూ
కవిని కంటది కాలమూ - ఆ
కవిత కల సువిశాలమూ
ప్రకృతి ప్రణవాగ్ని క్రీడల
ప్రాణికోటికి పగలురేయది
తర్కమేదైతేమి ఇలపై
తత్వమది తా నెరుగకుంటె...

కవియు అనగ పొద్దుపొడుపు
పొద్దుతిరుగుడు పూలు కవులు
చెప్పడమే ఎన్నేళ్ళు ధరపై
చేయడం కొంతైన ఉండదు
కాంత కనకము భ్రాంతి లోబడి
కాలిపోదురు నేల పైన
మధుపమది పరుగెత్తి పూల
మధుకరమును సేకరించి
లోకహితమై వెలుగు దిశలా
లేకితనమది ఎలా నేలా...

రాజులను కీర్తించే కవులు
రాలిపోయిరి ఎప్పుడో నిట
రాణులను కొనియాడె కృతుల
రాసలీలల రాగ మాగెను
కన్నరా మా అన్నమయ్యల
రాగయోగుల త్యాగరాజుల
రాములోరిని ఎక్కిరించిన
రామదాసుని రచనలేమది
రాచకొండను ధిక్కరించిన
రాజులకే కవి రాజు పోతన..
ధూర్జటి కవి కంఠమున ముక్కంటి
మంటల గంటమేమది
వీరవీగేకాలమది
చిర్రెత్తిదూకిన సింహగర్జన
రాజులైతే నేమి ఇల
రారాజులైతే నేమి కవికి
అమ్మజూపను కదరా అమ్మను
ఇమ్మహిని ఉన్నంత కాలం
సానులతో సరసాల ఇల
మొగసానినసలే కాదు నేననే...

కాసుకోసమె కవిత దాసుల
వేషమది వేయేళ్ళ కాలం
కిరిటమని పేరెత్తే కవులకు
కీర్తియన్నది ఎంత కాలం
రాజ్యహింసల రక్తపాతపు
రాజ్యమే కొందరికి గొడుగు
రాజు నీడన బ్రతికె కవులకు
రగిలె రచనల రాదె నుడుగు
కాలమునే శాసించే కవికి
వేలమా నిట వెలిగె రవికి...

అందెశ్రీ

'ఇవీ మన మూలాలు'

కల్లూరి భాస్కరం రచన 'ఇవీ మన మూలాలు - జన్యుపరిశోధనల వెలుగులో భారతీయుల మూలాల పరిశీలన' ఆవిష్కరణ సభ జనవరి 28 సా.5గంటలకు సోమాజిగుడ ప్రెస్ క్లబ్ (ఏసీ హాల్), హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఆర్. రవికాంత్ రెడ్డి, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, కె. రామచంద్రమూర్తి, వాడ్రేవు చినవీరభద్రుడు, బి. పి. పడాల, తాడి ప్రకాష్, కుప్పిలి పద్మ, శ్రీశైల్ రెడ్డి పంజుగుల పాల్గొంటారు.

బుక్ రీడర్స్ క్లబ్

'జలతంత్రి'


తైదల అంజయ్య కవిత్వ సంపుటి 'జలతంత్రి' ఆవిష్కరణ సభ జనవరి 28 ఉ.10గంటలకు ప్రెస్ క్లబ్ మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరుగుతుంది. సభలో కె. రంగాచారి, కె. శివారెడ్డి, కోయి కోటేశ్వరరావు, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 944124473.

మంజీరా రచయితల సంఘం

కేంద్ర సాహిత్య అకాడమీ సదస్సు

ఈ సాహిత్య సదస్సు జరుగుతుంది. ఆ ఒక్కరోజు జరిగే కేంద్ర సాహిత్య అకాడమీ, రాజాం రచయితల వేదిక సంయుక్త నిర్వహణలో అబ్బూరి వరద రాజేశ్వరరావు శత జయంత్యుత్సవ సదస్సు జనవరి 28 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. సి. మృణాళిని, గార రంగనాథం, చింతకింది శ్రీనివాసరావు, అవధానుల మణిబాబు, డి.వి.జి. శంకరరావు, బాలసుధాకర మౌళి, ఎం. కృష్ణ కుమారి పాల్గొంటారు. వివరాలకు: 98857 58123.

గార రంగనాథం



గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఓటమి భయం పట్టుకుందా? కొద్ది రోజులుగా గన్నవరం నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పరిశీలిస్తే ఈ ప్రశ్నకు ఔననే సమాధానం వస్తోంది. తనకు కంట్లో నలుసుగా ఉన్న టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులు.. వేధింపులకు పాల్పడుతున్న వంశీ, ఆయన అనుచరులు గతంలో జేసీబీ సంస్కృతిని నియోజకవర్గానికి పరిచయం చేశారు. ఆ తర్వాత దాడుల సంస్కృతిని ఆశ్రయించి ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

అంగన్‌వాడ్రీ!



అర్ధరాత్రి వేళ నడి రోడ్డుపై పడుకున్న వీరు ఎవరూ లేని అభాగ్యులు కాదు. ఇల్లూ వాకిలి లేని అనాథలూ కాదు. వలస జీవులు అంతకన్నా కాదు. చిన్నారులతో అక్షరాలు దిద్దించే అంగన్వాడీలు, సహాయకులు. ఇచ్చిన హామీ ప్రకారం తమకు కనీస వేతనం అందించాలని 41 రోజులుగా విరామ మెరుగకుండా సమ్మె చేస్తున్నా జగన్ సర్కారు చెవి కెక్కించుకోవడం లేదు. తమను తొలగిస్తే తొలగించుకోండని తమకు న్యాయం జరిగేదాకా ఆందోళన ఆపేది లేదని పట్టుదలతో కొనసాగిస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం చలో విజయవాడకు పిలుపునిచ్చారు. పోలీసులు అనుమతించ లేదు. అయిన వెనక్కుతగ్గబోమని ఆదివారం రాత్రే వివిధ జిల్లాల నుంచి బెజవాడకు చేరుకున్నారు. ధర్నాచౌక్ వద్ద రోడ్డుపై పడుకున్నారు.

గన్నవరంలో వంశీ ఫ్యాక్షన్ రాజకీయాలు

భయ పెట్టి గెలుద్దాం!

- టీడీపీ నేత, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడిపై వంశీ అనుచరుల దాడి
- కాళ్లు.. చేతులు విరిగి ఆసుపత్రి పాలైన బాధితుడు
- టీడీపీ కార్యాలయంపై దాడితో మొదలైన విధ్వంసం
- నాయకులే లక్ష్యంగా కొనసాగుతున్న వరుస దాడులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నేత కసనేని రంగబాబు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గన్నవరం ఎమ్మెల్యే వంశీ అనుచరులు మరోసారి రెచ్చిపోయారు. గన్నవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై ఎమ్మెల్యే వంశీ అనుచరులు ఆదివారం దాడి చేశారు. రంగబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని పొలం కొనుగోలు చేస్తాం.. చూపించండి అంటూ ఎలైట్ హోటల్ వద్దకు పిలిపించిన వంశీ అనుచరులు ఆయనపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా కొట్టడంతో ఆయన కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. వంశీ తీరుపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు.. వేధింపులతో వంశీ తన స్థాయిని మరింత దిగజార్చుకుంటున్నాడే తప్ప టీడీపీ శ్రేణుల మనోభావాలను దెబ్బతీయలేడని స్పష్టం చేశారు.

వంశీ మార్కు కుటిల రాజకీయం

గన్నవరం నుంచి 2109లో టీడీపీ టికెట్‌పై గెలిచి వైసీపీ పంచన చేరిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ స్వగ్రామం గన్నవరం నియోజకవర్గంలోని ఉంగుటూరు. 2014, 2019లో రెండు సార్లు టీడీపీ టికెట్‌పై వంశీ గెలుపొందారు. దీంతో గన్నవరంపై పట్టు బిగించారు. వంశీ వైసీపీలోకి వెళ్లినా.. చాలాకాలం నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు చూసే నాయకుడు లేకున్నా పార్టీ బలంగా నిలబడింది. గత ఏడాది యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఇది వంశీ వర్గానికి మింగుడుపడటం లేదు. ఈసారి ఓటమి భయంతో ప్రత్యర్థి పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు.. దాడులకు పాల్పడుతూ వారిని భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈసారి ఓటమి భయం వంశీని వెంటాడుతోంది.

టీడీపీ కార్యాలయంపై దాడితో మొదలుపెట్టి..

గన్నవరం టీడీపీ కార్యాలయంపైన.. టీడీపీ శ్రేణులపైన 2023 ఫిబ్రవరిలో వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. వంశీ దాష్టీకాన్ని టీడీపీ శ్రేణులు గట్టిగానే ఎదుర్కొన్నాయి. వాస్తవానికి ఆ సమయంలో గన్నవరం నియోజకవర్గ టీడీపీకి పెద్ద దిక్కుగా ఏ నాయకుడూ లేరు. కానీ టీడీపీ శ్రేణులు సమిష్టిగా వంశీ అనుచరుల ఆగడాలను నిలువరించగలిగాయి. ఆ తర్వాత అదే ఏడాది జూన్‌లో గన్నవరం టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావును లక్ష్యంగా చేసుకుని వంశీ, ఆయన అనుచరులు వేధింపులకు దిగారు. గన్నవరం మండలం వెదురుపావులూరు పరిధిలో వెంకటేశ్వరరావు వారసత్వంగా సాగు చేసుకుంటున్న భూమిని స్వాధీనం చేసుకునేలా రెవెన్యూ అధికారులను ఉసిగొల్పారు. ఆ స్థలంలో ఉన్న షెడ్లను కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా కూల్చివేయించారు. ఈ వేడి సద్దుమణగకముందే గత ఏడాది డిసెంబరులో టీడీపీ వాణిజ్య విభాగం నాయకుడు, ప్రసాదంపాడు ఉపసర్పంచి గూడవల్లి నరసింహారావు (నరసయ్య) ఇంటిపై అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఆయనకు చెందిన మూడు కార్లను ధ్వంసం చేశారు. ఈ ఘటనకు వంశీ అనుచరులే కారణమన్నది అందరికీ తెలిసిన విషయమే. తాజాగా కాసరనేని రంగబాబుపై వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు.

ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరతీస్తున్నారు

గన్నవరం నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరు. రాజకీయ చైతన్యానికి నెలవు. ఎందరో ప్రముఖులు ఈ నియోజకవర్గం నుంచే చట్టసభలకు ప్రాతినిథ్యం వహించి ప్రజా సమస్యలపై తమ వాణిని వినిపించారు. మరెందరో ఐఏఎస్‌లుగా ఐపీఎస్‌లుగా ప్రజలకు సేవలందిస్తున్నారు. గన్నవరం నియోజకవర్గం 1955లో ఏర్పడింది. కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య ఈ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ప్రాతినిథ్యం వహించారు. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ తరపున రెండు సార్లు, సీపీఎం తరపున ఒకసారి ఆయన గెలిచారు. కాకాని వెంకటరత్నం కూడా గన్నవరం నుంచి 1968లో ఎమ్మెల్యేగా పనిచేశారు. అలాంటి ప్రముఖులు ప్రాతినిథ్యం వహించిన గన్నవరంలో వంశీ ఫ్యాక్షన్ రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా బరిలోకి దిగుతున్న వెలంపల్లికి తొలిరోజే నియోజకవర్గంలో చుక్కెదురైంది. వెలంపల్లితో కలిసి పార్టీని గెలిపించాలని అధిష్ఠానం చేసిన సూచనలను సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఖాతరు చేయలేదు. నియోజకవర్గంలో ఆదివారం ప్రచారం ప్రారంభించగా, దానికి మల్లాది విష్ణు దూరంగా ఉండిపోయారు.

ఆదిలోనే హంసపాదు!

తొలిరోజు ప్రచారంలో వెలంపల్లికి భంగపాటు

- హాజరు కాని సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది
- 10 నిమిషాలు ఉండి వెళ్లిపోయిన గౌతంరెడ్డి

సెంట్రల్ ప్రచారంలో సగం మంది 'పశ్చిమ' వాసులే



పశ్చిమ నియోజకవర్గ వాసులతో సెంట్రల్‌లో ప్రచారం

(విజయవాడ - ఆంధ్ర జ్యోతి) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వెలంపల్లి శ్రీనివాసరావుకు విజయవాడ సెంట్రల్ టికెట్ ఇవ్వడంపై మల్లాది విష్ణు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వెలంపల్లితో పోలిస్తే మల్లాదిపై అవినీతి ఆరోప ణలు తక్కువే. కానీ ఆయనకు టికెట్ నిరాకరిం చిన అధిష్ఠానం ఆయన స్థానంలో వెలంపల్లికి టికెట్ ఇవ్వడాన్ని విష్ణు, ఆయన అనుచరులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ కారణంగా ఆదివారం సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్ నుంచి వెలంపల్లి ప్రారంభించిన ప్రచార కార్యక్రమానికి వారు దూరంగా ఉండిపోయారు. ఇదే విషయంపై విలేకరులు వెలంపల్లిని ప్రశ్నించగా.. తామిద్దరం కలిసే ఉన్నామని, ఆయన సూచన మేరకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. విష్ణు ఎందుకు పాల్గొనలేదన్న ప్రశ్నకు సమాధానం దాటవేశారు. సుమారు గంటన్న రపాటు సాగిన ప్రచార కార్యక్రమంలో ఇదే నియోజక వర్గానికి చెందిన ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ గౌతంరెడ్డి కేవలం 10 నిమిషాలు పాల్గొని వెళ్లిపోయారు.

శనివారం రాత్రి నుంచే బుజ్జగింపులు

వెలంపల్లికి సెంట్రల్ సీటు కేటాయించడంపై సొంత పార్టీ నేతలే తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో శనివారం రాత్రి నుంచే వెలంపల్లి పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులకు ఫోన్లు చేసి బుజ్జగింపుల పర్వానికి తెరదీశారు. ప్రచారం ప్రారంభం రోజున నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు తన కార్యక్రమంలో పాల్గొనకపోతే ప్రజల్లోను.. ప్రత్యర్థి పార్టీ నాయకుల్లోను చులకనైపోతామని, అందరూ తన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కానీ సగం మంది కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు ఆదివారం నాటి కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. సెంట్రల్ నాయకుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన ప్రచారాన్ని వెలంపల్లి 12 గంటలకు ప్రారంభించారు. అప్పటికప్పుడు పశ్చిమ నుంచి తన అనుచరగణాన్ని పిలిపించుకుని ప్రచారం మొదలుపెట్టారు. దీంతో ఆదివారం వెలంపల్లి వెంట ప్రచారంలో పాల్గొన్న వారిలో సగం మంది పశ్చిమ నియోజకవర్గం వారే కనిపించారు.

● ఇలాగైతే గెలవడం ఎలా?

స్థానికేతరుడు కావడం.. సామాజికంగానూ సొంతవర్గం బలం లేకపోవడం.. పొరుగు నియోజకవర్గంలో చేసిన అవినీతి బాగోతాలు.. వెరసి వెలంపల్లి గెలుపుపై సొంత పార్టీలోనే చర్చకు తెరదీశాయి. మరోవైపు వెలంపల్లి కారణంగానే తనకు సెంట్రల్ సీటు దక్కకుండా పోయిందని మల్లాది విష్ణు భావిస్తున్నారు. విష్ణు సామాజికవర్గంలోనూ ఇదే భావన ఉంది. దీంతో వెలంపల్లికి సహకరించడం సంగతి దేవుడెరుగు ఆయన ఓటమికి కారణం కాకుంటే చాలని వెలంపల్లి వర్గం భావిస్తోంది. 2019లో వైసీపీ గాలి బలంగా వీచిన సమయంలోనూ వైసీపీ అభ్యర్థి అయిన విష్ణు కేవలం 12 ఓట్లతో గెలుపు సాధించారు. అలాంటిది ఇన్ని ప్రతికూలతల నడుమ వెలంపల్లి గెలుపు అసాధ్యమని సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు.

కాంగ్రెస్ కళకళ

షర్మిల రాకతో క్యాడర్‌లో నూతనోత్సాహం



ఎయిర్‌పోర్టు వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న షర్మిల

- ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీగా హాజరైన కార్యకర్తలు
- విమానాశ్రయం నుంచి కానూరు వరకు భారీ కాన్వాయ్
- ఉత్తేజపరిచిన షర్మిల ప్రసంగం

విజయవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన తర్వాత ముక్కుతూ మూలుగుతూ ఉన్న కాంగ్రెస్ పార్టీలో నూతన కళ కనిపించింది. పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు స్వీకరించడంతో కార్యకర్తల్లో నూతన ఉత్తేజం తారసపడింది. ఆమెకు స్వాగతం పలకడానికి నేతలు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలివచ్చారు. గన్నవరం విమానాశ్రయం వద్ద నుంచి కానూరులోని ఆహ్వానం కల్యాణమండపం వరకు కోలాహల వాతావరణం నెలకొంది. షర్మిల ముందుగా విమానాశ్రయంలో పాత అరైవల్ బ్లాక్‌కు చేరుకుంటారని సమాచారం రావడంతో కార్యకర్తలంతా అక్కడికి చేరుకున్నారు. తర్వాత ఆమె కొత్త టెర్మినల్‌కు చేరుకుంటారని సమాచారం అందడంతో మొత్తం కార్యకర్తలంతా అక్కడికి చేరుకున్నారు. రాష్ట్రంలో వివిధ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలు అనుచరులతో ఇక్కడికి చేరుకున్నారు. నేతలు, కార్యకర్తల రాకతో అంతర్జాతీయ టెర్మినల్ ముందు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉన్న విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యువకులు ర్యాలీగా వచ్చారు. రన్‌వే పై నుంచి బయటకు రాగానే షర్మిల తన వాహనం నుంచి కార్యకర్తలకు అభివాదం చేశారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్ మధ్య షర్మిల కానూరులోని ఆహ్వానం కల్యాణమండపం వద్దకు చేరుకున్నారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావడంతో కల్యాణమండపం హాలు నిండిపోయింది. బయట ఉన్న కార్యకర్తలు కార్యక్రమాన్ని వీక్షించడానికి ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి కార్యకర్తలు ఇక్కడికి తరలి వచ్చారు. ప్రమాణస్వీకార కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, ఎన్.రఘువీరారెడ్డి, మాజీ ఎంపీ చింతా మోహన్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, ఎన్.తులసిరెడ్డి, షేక్ మస్తాన్‌వలీ, కృష్ణా జిల్లా అధ్యక్షురాలు తాంతియా కుమారి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరసింహరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్, ధనేకుల మురళీ పాల్గొన్నారు.

సీఎం షర్మిల అంటూ నినాదాలు

పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం షర్మిల ప్రసంగించారు. వైఎస్సార్ మాదిరిగానే తాను ఏ పోరాటానికి అయినా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. మీరూ సిద్ధమేనా అని కార్యకర్తలను ప్రశ్నించారు. దీనికి కార్యకర్తలు సీఎం షర్మిల అంటూ నినాదాలు చేశారు. ఈ నినాదాలు హాలులో మారుమోగాయి. సీఎం జగన్‌ను విమర్శిస్తున్నప్పుడూ ఈ నినాదాలు వినిపించాయి. షర్మిల చేసిన ప్రసంగంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది.

● రాహుల్ సంధించిన బాణం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి షర్మిల బాణాన్ని రాహుల్‌గాంధీ సంధించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైఎస్ లక్షణాలను పుణికిపుచ్చుకున్న ఆమె కచ్చితంగా పార్టీకి పోయిన వైభవాన్ని తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. షర్మిల సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్, అసెంబ్లీలో ప్రాతినిథ్యం వహించాలని అభిప్రాయపడ్డారు. షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టాలని లక్షలాది మంది కార్యకర్తలు కోరుకున్నారన్నారు. షర్మిల ఇక నుంచి కాంగ్రెస్ బాణమని చెప్పుకొచ్చారు. ఏఐసీసీ కార్యక్రమాల కమిటీ ఛైర్మన్ కేసీ వేణుగోపాల్ పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలను నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చదివి వినిపించారు. అనంతరం ఆమెకు బాధ్యతలు అప్పగించారు. సీడ్ల్యూసీ సభ్యుడిగా గిడుగు రుద్రరాజును నియమిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఇచ్చిన నియామకపత్రాన్ని రఘువీరారెడ్డి చదివి వినిపించారు. అటు పీసీసీ అధ్యక్షురాలి, ఇటు సీడబ్ల్యూసీ సభ్యుడి నియామకాలు ఒకేసారి జరగడం ఇదే ప్రథమమని రఘువీరారెడ్డి వ్యాఖ్యానించారు.

నేడు..

ఓటర్ల తుది జాబితా విడుదల

- డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై తీవ్ర అభ్యంతరాలు
- నెల రోజులపాటు కొనసాగిన స్పెషల్ సమ్మరీ రివిజన్
- ఆ తరువాత కూడా రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు


ఆంధ్రజ్యోతి-విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదల కాబోతోంది. డ్రాఫ్టు ఓటర్ల జాబితాలో తప్పులు చోటు చేసుకోవటంతో.. తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. తుది ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న అంశాలను సరిచేసి నూరు శాతం స్వచ్ఛీకరణ జరిపారా అన్నది సోమవారం తేలనుంది. ఆగస్టు 22వ తేదీన ప్రకటించిన డ్రాఫ్ట్ జాబితాలో కూడా అక్రమాలు చోటుచేసుకోవటం, తప్పులు ఉండటం, ఓట్ల తొలగింపులు చేపట్టడం, ఓట్ల చేర్పులు అసాధారణంగా జరగటం, డబ్లింగ్ ఓట్లు ఎక్కువగా ఉండటం, చనిపోయిన వారి ఓట్లు తొలగింపు చేయకపోవటం వంటి పరిణామాలపై రాజకీయ పక్షాలు తీవ్రంగా అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కోసం స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను చేపట్టారు. ఈ రివిజన్ అనంతరం కూడా రాజకీయ పార్టీల నుంచి అనేక అభ్యంతరాలు వచ్చాయి. ఓటర్ల తొలగింపులపై చివరి వరకు కూడా ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. స్పెషల్ సమ్మరీ రివిజన్ తర్వాత కూడా రాజకీయ పక్షాలు రిటర్నింగ్ అధికారులకు, జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల అధికారికి అనేక ఫిర్యాదులు ఇచ్చాయి. రాజకీయ పార్టీల అభ్యంతరాల నేపథ్యంలో, వారితో జిల్లా ఎన్నికల యంత్రాంగం అనేక దఫాలు వారితో సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాల దరిమిలా రాజకీయ పక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలపై పరిశీలనలు జరిగాయి. మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ పలుచోట్ల ఇంకా ఫిర్యాదులు వచ్చాయి. ఇదే సందర్భంలో కేంద్ర ఎన్నికల బృందాలు రెండుసార్లు విజయవాడలో రాష్ట్రస్థాయి సమీక్షలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎన్నికల బృందాలకు తుది ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలను జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు వారికి వివరించారు. ఆ తర్వాత కూడా జిల్లా ఎన్నికల అధికారికి బలవంతపు ఓట్ల తొలగింపునకు సంబంధించి అప్పీల్స్ వచ్చాయి. ఈ క్రమంలో సోమవారం తుది ఓటర్ల జాబితా విడుదల కానుండటంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

కుడితిలో పడ్డ ఎలుక మాదిరిగా తహసీల్దార్లు గిలగిలకొట్టుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు రాక.. ఖర్చు పెట్టిన వాటిని ఎలా రాబట్టుకోవాలో తెలీక అంతర్మ థనంలో పడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అప్పులు చేసి మరీ ఖర్చు పెట్టారు. ప్రభుత్వం ఈ డబ్బులు ఇవ్వకపోతే సొంత అప్పుల ఖాతాలోకి వెళ్లిపోతాయని కొందరు రెవెన్యూ తహసీల్దార్లు ఆందోళన చెందుతుండగా.. మరికొందరు ఈ డబ్బులు వస్తాయన్న నమ్మకం లేక.. అవినీతికి తెరదీస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 45 మండలాల పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే తహసీల్దార్లకు అక్షరాలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.4.50 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది. ఒక్కొక్కరికీ హీనపక్షంగా రూ.10 లక్షలకు తగ్గకుండా ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా రాని దుస్థితి నెలకొంది.

తహసీల్దార్లలో అంతర్మథనం

బకాయిలు రాకుండానే బదిలీ అవుతున్నామని ఆందోళన

- ఒక్కొక్కరికి సగటున రూ.10 లక్షలకుపైనే ప్రభుత్వం బకాయి
- ఎన్టీఆర్, కృష్ణా జిల్లా పరిధిలో రూ.4.50 కోట్ల మేర పెండింగ్
- ఏ ఒక్క ఖర్చుకు కూడా పైసా కూడా రాని పరిస్థితి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రభుత్వ కార్యక్రమాల అమలులో రెవెన్యూ శాఖదే అగ్రస్థానమన్నది అందరికీ తెలిసిందే. ప్రభుత్వ కార్యక్రమాల ఖర్చులను కూడా గత నాలుగున్నరేళ్లకుపైగా మితిమీరిన విధంగా భరించాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న లే అవుట్ల మెరక పనుల కోసం కోట్లాది రూపాయలను తహసీల్దార్ల జేబుల నుంచి ఖర్చు చేయించింది. దాదాపుగా రెండున్నరేళ్ల తర్వాత కానీ వాటికి ఖర్చు చేసిన డబ్బులు ఇవ్వలేదు. ఈ ఒక్కదానికి తప్పితే మిగిలిన వేటికీ కూడా ఇప్పటి వరకు పైసా కూడా విదల్చలేదు. అప్పులు చేసి మరీ తెచ్చిన డబ్బులు రాకుండానే బదిలీ అవుతున్నామన్న ఆవేదనలో ఉన్నారు. తహసీల్దార్లు పర్యటించే వాహనాలకు నెలకు రూ.35 వేల చొప్పున ప్రభుత్వం డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది కాలంలో ఒక్కో తహసీల్దార్ తాము సొంతంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ఒక్కో తహసీల్దార్ రూ.4 లక్షల మేర ఖర్చు చేశారు. వీరు ఖర్చు చేసిన దానికి ఇప్పటి వరకు పైసా కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. ఈ మొత్తంలో కేవలం రూ.1.50 లక్షలు చెల్లించేందుకు మాత్రమే ఆర్థిక శాఖ అంగీకరించింది. ఈ మొత్తాన్ని కూడా రెండు నెలలు దాటుతున్నా పైసా కూడా జమ చేయలేదు.

● పెట్టిన ఖర్చు ఇలా..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ రక్ష పథకంలో భాగంగా సర్వే రాళ్లకు సంబంధించి తహసీల్దార్లే డబ్బులు ఖర్చు పెట్టారు. ఒక్కో సర్వే రాయిని రూ.70 చొప్పున సగటున గ్రామీణ మండల తహసీల్దార్లు 5 వేల సర్వేరాళ్లను కొనుగోలు చేశారు. సర్వే రాళ్ల కోసమే ఒక్కో తహసీల్దార్ సగటున రూ.3.50 లక్షల మేర ఖర్చు చేయాల్సి వచ్చింది. సర్వే రాళ్లకు సంబంధించిన డబ్బులు సగమే విడుదలయ్యాయి. నాలుగున్నరేళ్లుగా నెలకు రూ.1200 చొప్పున చెల్లించలేదు. ప్రతినెలా రూ.3 వేల మేర స్టేషనరీ ఖర్చులు అవుతాయి. సంవత్సరానికి రూ.1.80 లక్షల మేర ఈ డబ్బులను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అన్నీ కలుపుకుని తహసీల్దార్‌కు హీనపక్షంగా రూ.10 లక్షల నుంచి రూ.13 లక్షలకు పైబడి ప్రభుత్వం బకాయిలు పెట్టింది.

ఖర్చు రాబట్టుకునేందుకు ఎవరి మార్గం వారిదే..

ఎన్నికలయ్యాక ఎక్కడ పోస్టింగ్ పడుతుందో ఎవరికీ తెలీదు. ఇలాంటి పరిస్థితుల్లో తహసీల్దార్లలో ఆందోళన నెలకొంటోంది. కొందరు తహసీల్దార్లు మాత్రం ప్రభుత్వం నుంచి డబ్బులు రావటం కలేనని చేతివాటం మొదలుపెట్టారు. తమ దగ్గర పనుల కోసం వచ్చే వారి ఎదుట చేతులు చాస్తున్నారు.



ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేస్తున్న బోడే రామచంద్రయాదవ్

పుంగనూరులో ప్రజాస్వామ్యం ఖూనీ

» పోలీసులపై గవర్నర్ నజీర్‌కు బోడే రామచంద్ర ఫిర్యాదు

భవానీపురం, జనవరి 21 : పుంగనూరులో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ విజ్ఞప్తి చేశారు. ఏపీ రాజ్ భవన్‌లో గవర్నర్‌ను రామచంద్ర యాదవ్ ఆదివారం కలిసి పుంగనూరులో అరాచకాలపై ఫిర్యాదు చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో పోలీసులు మంత్రి పెద్దిరెడ్డి సొంత మనుషుల్లా వ్యవహరిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన కార్యక్రమాలను పోలీసులు బలవంతంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్యకర్తలపై దాడికి సంబంధించిన, సీఐ చెప్పుతో కొట్టిన ఫోటోలను ఫిర్యాదుతో పాటు గవర్నర్‌కు ఆయన అందజేశారు. ఫిర్యాదుపై గవర్నర్ సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.



గవర్నర్‌ను కలిసిన పీపుల్స్ యాక్షన్ ఫోరం, ఆదివాసీ వికాస సంఘం నేతలు

గుత్తికోయలకు ఎస్టీలుగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

» గవర్నర్ నజీర్‌కు ఆదివాసీ సంఘం నేతల వినతి

వన్‌టౌన్, జనవరి 21 : గుత్తికోయలకు ఎస్టీలుగా ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని పీపుల్స్ యాక్షన్ ఫోరం, ఆదివాసీ వికాస సంఘం నాయకులు ఆదివారం విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈమేరకు వారు మాట్లాడుతూ, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో 50 సంవత్సరాలకు పైగా నివాసం ఉంటున్న ప్రిమెటివ్ ఆదివాసీ తెగకు చెందిన గుత్తి కోయలకు అధికారులు ఎస్టీ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. సుమారు వంద గ్రామాల్లో 30 వేలమంది గుత్తికోయలు ఉన్నారన్నారు. వీరు ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. అడవి బిడ్డలుగా దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాల కల్పన,పోడు భూములకు పట్టాల పంపిణీ, సామాజిక పింఛన్లు ఇవ్వాలన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో పులుగుజ్జు సురేశ్, పొడియం ధన, కొత్తపల్లి విజయకుమార్, దీపక్ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.





పార్టీ కండువాలు కప్పి వారితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కొల్లు రవీంద్ర

దళిత ద్రోహి సీఎం జగన్ : కొల్లు రవీంద్ర

» టీడీపీలోకి భారీగా చేరికలు

మచిలీపట్నం టౌన్, జనవరి 21 : సీఎం జగన్మోహనరెడ్డి దళిత ద్రోహి అని, దళితులను పలు సందర్భాల్లో ఇబ్బంది పెట్టారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర విమర్శించారు. బందరు మండలం కరగ్రహారం ఎస్సీ కాలనీలో ఆదివారం 54 దళిత కుటుంబాలు పెద్ద ఎత్తున కొల్లు రవీంద్ర నేతృత్వంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారితో కొల్లు రవీంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లు కేవలం కుర్చీలకే పరిమితమయ్యాయన్నారు. 2009లో పేర్ని నాని దళితులకు పట్టాలిస్తామని మోసం చేశారన్నారు. కరగ్రహారం దళితులు తమకు రావలసిన 118 ఎకరాల భూమి కోసం ఉద్యమిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఆ భూములను ఇప్పిస్తామన్నారు. అంబేడ్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులకు న్యాయం చేసినట్టు ఎలా అవుతుందన్నారు. ఎస్సీ నాయకుడు గౌతమ్ మాట్లాడుతూ, దళితులకు రావలసిన 118 ఎకరాలు టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అపహాస్యం : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, జనవరి 21 : రాష్ట్రంలో రాజ్యాంగాన్ని అపహస్యం చేసి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసిన జగన్‌రెడ్డికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే రాష్ట్రం అంతా దిగ్భ్రాంతి చెందిందని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రాన్ని సంక్షేమం పేరుతో సంక్షోభం లోకి నెట్టాడని, రాష్ట్ర ప్రభుత్వంపై కాంట్రాక్టర్లు తమ బిల్లులు చెల్లించాలని వేసిన 11వేల కేసుల్లో కోర్టు ధిక్కార కేసులు నమోదయ్యాయంటే ఎంతటి దీనావస్థలో ఉందో తెలుస్తున్నదన్నారు. ప్రభుత్వాన్ని ఎదిరించిన ప్రజలు, మేధావులు, ప్రతిపక్షాలను పోలీసులతో అణిచి వేసిన వ్యక్తి, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసి, బ్రిటిష్ చట్టాలను అమలు చేస్తున్న వ్యక్తి, హక్కుల కోసం పోరాడుతున్న అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించిన వ్యక్తికి అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే హక్కు లేదన్నారు. ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేసిన వినాశకారి, విధ్వంసకారి జగన్‌రెడ్డికి ప్రజలు ఈసారి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని దేశంలో నంబర్ 1 స్థాయికి తీసుకెళ్లే అనుభవం, సమర్థత, విజన్ ఉన్న వ్యక్తి చంద్రబాబుకు అందరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముల్లంగి రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన రామలక్ష్మీ, గింజుపల్లి రమేష్, కట్టా నరసింహారావు, సయ్యద్ అన్వర్, యానాల గోపీచంద్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న ఉమా

బీసీలకు జగన్ వెన్నుపోటు.. : ఉమా

ఇబ్రహీంపట్నం, జనవరి 21 : బీసీ సంక్షేమం, అభివృద్ధికి స్వర్గీయ ఎన్టీఆర్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో కొండపల్లిలో ఆదివారం రాత్రి జయహో బీసీ సభను నిర్వహించారు. బీసీలకు జగన్ వెన్నుపోటు పొడిచారని, 34 శాతం ఉన్న బీసీల రాజకీయ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి 16800 రాజ్యాంగ బద్ధ పదవుల్ని రద్దు చేశాడని దుయ్యబట్టారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాలా అండగా టీడీపీ నిలుస్తుందన్నారు. జయహో బీసీ విజయవాడ పార్లమెంట్ పరిశీలకుడు వీరంకి గురుమూర్తి, ప్రేరేపి ఈశ్వర్, ఉయ్యూరు వెంకట నరసింహారావు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, పటాపంచల నరసింహారావు, చెన్నుబోయిన చిట్టిబాబు, అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), చుట్టుకుదురు వాసు, ధరణికోట విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, పీతా శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

కట్టలు తెంచుకున్న ఆవేశం

● నీటికోసం రోడ్డెక్కిన వైఎస్సార్ కాలనీవాసులు ● నిలిచిపోయిన వాహనాలు.. అందులోనే వెలంపల్లి కాన్వాయ్





రోడ్డుపై బైఠాయించిన కాలనీవాసులు, ఫోన్లో అధికారులతో మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాస్

విజయవాడ రూరల్, జనవరి 21: వైఎస్సార్ కాలనీలో మళ్లీ మంచినీటి సమస్య తలెత్తింది. నెల క్రితం తీవ్ర మంచినీటి సమస్యతో అల్లాడిన కాలనీ ప్రజానీకం మళ్లీ అదే సమస్యతో వారం రోజులుగా సతమతమవుతున్నారు. దీంతో వారి ఆవేశం కట్టలు తెంచుకుంది. ఆదివారం ఉదయం ఒక్కసారిగా వందల సంఖ్యలో ప్రజలు రోడ్లెక్కారు. మిల్క్ ఫ్యాక్టరీ వంతెన సమీపంలోని ఇన్నర్ రింగ్ రోడ్డుపైకి చేరుకుని బైఠాయించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తమ కాలనీ సమస్యను గాలికొదిలేశాడని ఎమ్మెల్యేగా గెలిచాక కాలనీకి వచ్చిన దాఖలాలే లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై వాహనాలను నిలిపివేసి ఎమ్మెల్యేకు, వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వసంత కృష్ణ ప్రసాద్ డౌన్ డౌన్ అంటూ రోడ్లపై బైఠాయించగా పోలీసులు ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు.

వారు ససేమిరా అనడంతో మంచినీటి విభాగం డీఈ, ఏఈ అక్కడికి చేరుకుని మంచినీరు సరఫరా చేసే బూస్టర్ వైర్లు కాలిపోయాయని అందుకే సమస్య తలెత్తిందని స్థానికులకు చెప్పారు. త్వరగా మరమ్మతులు చేయించి మంచినీటిని పునరుద్ధరిస్తామని చెప్పడంతో కాలనీ వాసులు శాంతించారు.

నిలిచిన వెలంపల్లి కాన్వాయ్

వైఎస్సార్ కాలనీలో మంచినీటి సమస్యపై కాలనీవాసులు రోడ్డెక్కడంతో ఇన్నర్‌రింగ్ రోడ్డుపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ఇటు మిల్క్‌ప్రాజెక్ట్ నుంచి అటు పైపుల రోడ్డు నుంచి వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అప్పడే సెంట్రల్ పర్యటనకు బయలుదేరిన ఎమ్మెల్యే వెలంపల్లి కాన్వాయ్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. దీంతో ఆయన కారు దిగి ఆందోళనకారుల వద్దకు వెళ్లి అధికారులతో ఫోన్లో మాట్లాడి సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పినా ససేమిరా అన్నారు. కొందరు ఆందోళనకారులు ఇది మీ నియోజకవర్గం కాదని ఎమ్మెల్యేను పిలవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అసహనానికి గురైన వెలంపల్లి అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఆందోళన తీవ్రతరం చేస్తాం: ఉమా

కాలనీలో మంచినీటి సమస్య పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానికంగా మంచినీటి సరఫరా నిలిచిపోయి స్థానికులు ఆందోళనకు దిగిన విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం కాలనీకి చేరుకున్నారు. అక్కడ స్థానికులతో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకుని అనంతరం అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మంచినీటి సమస్య పరిష్కరించకుంటే ఆందోళనలో తాను పాల్గొంటానని వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని అధికారులను, ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

» సుప్రీం తీర్పు మేరకు కనీస వేతనాలు ఇవ్వాల్సిందే

» వామపక్ష నేతల డిమాండ్



విజయవాడ ధర్నాచౌక్‌లో అంగన్వాడీలను బలవంతంగా ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

ధర్నాచౌక్, జనవరి 21: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత ఐదు రోజులుగా స్థానిక ధర్నాచౌక్‌లో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక నిరహారదీక్ష శిబిరాన్ని వామపక్ష నేతలు ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వ సాచివేత ధోరణి సరైందికాదన్నారు. కనీస వేతనం వంటి సుప్రిం కోర్టు తీర్పును ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఇటువంటి చర్యలు పెత్తందారి పోకడకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీలకు కనీసవేతనం పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై కోటి సంతకాలు సేకరించి ముఖ్యమంత్రికి సమర్పించాలని బయలు దేరిన అంగన్వాడీలను నగరానికి రాకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం జగన్ అంగన్వాడీలను పిలిచి వారితో చర్చించి సమస్యలు పరిష్కరించాలని, తన వద్దకు వస్తానన్న వారితో మాట్లాడాలని, ఇవి చేయకుండా అంబేడ్కర్ సాక్షిగా సామాజిక న్యాయం ఎలా చేస్తారని ప్రశ్నించారు. అనేక సంవత్సరాలుగా అంగన్వాడీ సెంటర్లలో విధులు, ఉద్యోగాలు కాపాడుకునేందుకు, అదేవిధంగా తమ కనీస డిమాండ్లను సాధించుకునేందుకు ఆందోళన కొనసాగిస్తామని అంగన్వాడీలు స్పష్టం చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం దీక్ష చేస్తున్న ఇద్దరి ఆరోగ్యం క్షీణించడంతో పోలీసులు వారిని ఆసుపత్రికి తరలించారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, సీహెచ్.బాబురావు, ఇఫ్టూ నేత ప్రసాద్, మహిళా సంఘం నాయకురాలు డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పవన్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చాయి

» పవన్ కళ్యాణ్‌తో కలిసి నడుస్తా

» బందరు ఎంపీ బాలశౌరి

మోపిదేవి/అవనిగడ్డ రూరల్, జనవరి 21 : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు తనకు బాగా నచ్చాయని, ఆయనతో కలిసి నడిచేందుకు నిర్ణయించుకున్నట్టు మచిలీపట్నం ఎంపీ బాలశౌరి స్పష్టం చేశారు. త్వరలో జనసేన పార్టీలో చేరనున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఇష్టదైవమైన మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మోపిదేవిలో విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ, ప్రస్తుతం మచిలీపట్నం ఎంపీగా ఉన్నా అవనిగడ్డ నియోజకవర్గం తన గుండెల్లో ఉంటుందన్నారు. ఎక్కడి నుంచి పోటీ చేస్తున్నది త్వరలో చెబుతానన్నారు. డెల్టా ప్రజలకు జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అంకితమివ్వాలన్నదే తన లక్ష్యంగా పవన్‌కళ్యాణ్ చెప్పటం ఎంతో గర్వించదగిన విషయమన్నారు. పవన్‌తో కలిసి నడిచేందుకు సిద్ధంగా ఉన్నట్టు బాలశౌరి తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు బండి రామకృష్ణ తదితరులు ఉన్నారు. ఎంపీకి మోపిదేవిలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీగా మోపిదేవి టోల్ గేట్ వద్ద ఘన స్వాగతం పలికారు. జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునిని దర్శించుకున్న ఎంపీ

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎంపీ వల్లభనేని బాలశౌరి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఎంపీ కుటుంబసభ్యులకు అందజేశారు.



మోపిదేవి వద్ద పూలు చల్లుతూ బాలశౌరికి స్వాగతం పలుకుతున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

నేలకొండపల్లిలో భారీగా మద్యం స్వాధీనం

మచిలీపట్నం: పెడన మండలానికి చెందిన అధికారపార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై ఎక్సైజ్ పోలీసులు శనివారం రాత్రి దాడిచేశారు. 400 మద్యం బాటిళ్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లోని బెల్ట్ షాపులకు అధికధరకు విక్రస్తున్నాడు. బెల్ట్‌షాపులో మద్యం నిల్వ ఉంచారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మచిలీపట్నంలోని ఎస్ఈబీ కార్యాలయానికి తరలించారు. దీనికి సూత్రధారి ఎంపీటీసీ సభ్యుడు ఎక్సైజ్ పోలీసులకు చిక్కలేదు. ఘటనపై కేసు నమోదుచేసి ఇద్దరిని కోర్టులో హాజరుపరిచినట్టు ఎక్సైజ్ ఎస్ఐ కాంతమ్మ తెలిపారు.

చిన్నారులకు వేమన పద్య పోటీలు

గవర్నర్‌పేట: సరస్వతీ సామ్రాజ్యం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం లో చిన్నారులకు వేమన పద్య పోటీలు నిర్వహించారు. ఠా గూర్ గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా కానూరు జడ్పీహెచ్ స్కూల్ అసిస్టెంట్ సీహెచ్ పార్థసారథి వ్యవహరించారు. సిబ్బంది, తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై అగంతకుల దాడి

» పొలం చూడాలని కారులో వచ్చిన వ్యక్తులు



అగంతకులు వచ్చిన ఇన్నోవా కారు

గన్నవరం, జనవరి 21 : పొలం చూపించాలంటూ పిలిచి టీడీపీ నేతను చితకబాదిన సంఘటన గన్నవరంలో ఆదివారం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసనేని రంగబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. గుర్తు తెలియని వ్యక్తులు తమకు పొలం కావాలని ఆదివారం మధ్యాహ్నం ఫోన్‌చేశారు. ఎక్కడికి వస్తారంటూ రంగబాబు అడగటంతో విమానాశ్రయం దగ్గరలో ఉన్న హోటల్ వద్దకు వస్తామని చెప్పారు. దీంతో వైఎస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్‌తో కలిసి కారులో వెళ్లారు. అక్కడ కారులో ముగ్గురు వ్యక్తులు ఉండి మాట్లాడారు. పొలం చూసేందుకు వెళదామని చెప్పడంతో సుధీర్‌ను కారు తిప్పుకురమ్మని చెప్పి రంగబాబు చెప్పాడు. ఇంతలో వెనుక నుంచి ఇన్నోవా కారులో వచ్చిన ఆరుగురు కర్రలతో రంగబాబుపై దాడి చేశారు. సుధీర్ వెనక్కి వచ్చేసరికి రంగబాబు తీవ్ర గాయాలతో పడిఉన్నాడు. తీవ్ర గాయాలైన రంగబాబును ముందుగా పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లగా పోలీసుల సూచనల మేరకు చిన్న అవుటుపల్లి పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. కాలు మడమ వద్ద రెండు ఎముకలు విరిగినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కనకారావు తెలిపారు.

రంగబాబును పరామర్శించిన టీడీపీ, జనసేన నేతలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రంగబాబును టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పరామర్శించారు. టీడీపీ నియోజకరవ్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఫోన్‌లో సమాచారం తెలుసుకున్నారు. ఆయన సోదరుడు యార్లగడ్డ సతీష్, టీడీపీ మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, జనసేన సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్, గూడవల్లి నరసయ్య, సురేష్, శ్రీధర్, రంగారావు, మాజీ ఎంపీపీ ఝాన్సి, మాజీ జడ్పీటీసీ ప్రసాద్, మేడేపల్లి రమాదేవి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

26న విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 21 : వడ్లమూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు 'మేధ-2024' పేరుతో క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్టు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గొల్లపూడి గ్రామంలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ గవర్నమెంట్ హైస్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నామన్నారు. క్విజ్ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన టీమ్‌కు రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, వ్యసరచన పోటీలలో ప్రథమ బహుమతి రూ. 3 వేలు, ద్వితీయ బహుమతి రూ. 2 వేలు అందజేయనున్నట్టు తెలియజేశారు. ఆశక్తి గల విద్యార్థులు తమ పేర్లను 25వ తేదీ సాయంత్రంలోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490336550 ఫోన్ నెంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష

వన్‌టౌన్: దుర్గగుడిలో నిత్యాన్నదానానికి కడప జిల్లా యరగుంట్లకు చెందిన సుధామల వెంకటరెడ్డి, వరలక్ష్మి రూ.1,00,116 విరాళం అందజేశారు. ఆదివారం ఆలయానికి వచ్చినవారు ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కట్టా సత్తయ్యను కలిసి విరాళం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

సూర్యారాధన: లోకక్షేమం కోరుతూ ఆదివారం అర్చకులు అరుణ పారాయణ, సూర్యనమస్కారాలు నిర్వహించారు. దుర్గమ్మ దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. చండీహోమం, లక్ష కుంకుమార్చన, నవావరణార్చనలో పాల్గొని, అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థించారు.



గన్నవరం విమానాశ్రయంలో కాంగ్రెస్ శ్రేణులకు అభివాదం చేస్తున్న వైఎస్ షర్మిల

గన్నవరం విమానాశ్రయంలో వైఎస్ షర్మిలకు ఘన స్వాగతం

గన్నవరం, జనవరి 21 : గన్నవరం విమానాశ్రయంలో వైఎస్ షర్మిలకు అపూర్వ స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం ఉదయం 11.37 గంటలకు వచ్చిన ఆమెకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, కాంగ్రెస్ నేతలు కొప్పుల రాజు, గిడుగు రుద్రరాజు, సుంకర పద్మశ్రీ, లాం తాంతియా కుమారి, కొలనుకొండ శివాజీ, నరహరశెట్టి నరసింహారావు, తదితరులు పూల బొకేలతో స్వాగతం పలికారు. తీన్‌మార్ డప్పులతో సందడి చేశారు. విమానాశ్రయం ఎదుట యూత్ కాంగ్రెస్ నాయకులు వెల్‌కం షర్మిల అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ర్యాలీతో విజయవాడ వెళ్లారు.



పార్కింగ్ ప్రదేశాన్ని తెలియజేసే ఫ్లెక్సీ

దుర్గమ్మ భక్తులపై వాహన పార్కింగ్ బాదుడు!

వన్‌టౌన్, జనవరి 21 : దుర్గామల్లేశ్వర దేవస్థానానికి వచ్చే భక్తుల వాహనాలను నిలిపేందుకు కొత్త పార్కింగ్ ఏరియాను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా దుర్గమ్మ ఫ్లై ఓవర్ కింద ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని దేవస్థానం రెండేళ్లకు లీజుకు తీసుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మహామండపం నుంచి కనకదుర్గనగర్ వరకు వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో అక్కడ వాహనాల పార్కింగ్‌ను ఎత్తివేశారు. కొత్త ఏరియాలో పార్కింగ్ చేసుకోవాలని సూచిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే దేవస్థానం అధికారికంగా ఎటువంటి పార్కింగ్ ఫీజు నిర్ణయించనప్పటికీ అక్కడ ఓ ప్రైవేట్ వ్యక్తి భక్తులనుంచి అనధికారంగా పార్కింగ్ ఫీజు వసూలు చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడుగంటలు కారు పార్కింగ్‌కు రూ. 50 వసూలు చేస్తున్నారు. కనకదుర్గనగర్ టోల్‌గేట్ వద్ద మాత్రమే పార్కింగ్ ఫీజుకు అనుమతి ఉంది. అయితే కొత్త ప్రదేశంలో పార్కింగ్‌కు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు దీనిపై ఆలయ అధికారులను వివరణ కోరగా.. భిన్న వివరణలు ఇచ్చారు. ఒక అధికారి ఆ స్థలంలో కేవలం దేవస్థానానికి చెందిన బస్సులు, ఉద్యోగుల వాహనాలను పార్కింగ్ చేస్తారని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో మాత్రం అటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం.



పార్కింగ్ ఫీజు రశీదు చూపుతున్న భక్తుడు

తానా కో-ఆర్డినేటర్‌గా మల్లినేని



పెనమలూరు, జనవరి 21 : తెలుగు అసోసియేషన్ అఫ్ నార్త్ అమెరికా(తానా) అంతర్జాతీయ కో-ఆర్డినేటరుగా కృష్ణాజిల్లా పెనమలూరుకు చెందిన మల్లినేని ఠాగూర్ ఎంపికయ్యారు. నరేన్ కొడాలి ప్యానెల్ తరపున పోటీచేసిన ఠాగూర్ 13300 ఓట్లు సాధించి రికార్డు విజయాన్ని సొంతం చేసుకొన్నారు. ఠాగూర్ తన స్వగ్రామమయిన పెనమలూరులో పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం, ఉపకారవేతనాలు, రైతులకు పవర్ స్ప్రేలు, రక్షణ కిట్లు, మహిళలకు కుట్టు విషన్లు, దివ్యాంగులకు త్రిచక్రవాహనాలు, వైద్య శిబిరాల ఏర్పాటు తదితర సేవా కార్యక్రమాలు చేశారన్నారు.

తానా ట్రస్టీగా సూరపనేని రాజా



వన్‌టౌన్ : తానా ఫౌండేషన్ ట్రస్టీగా సూరపనేని రాజా గెలుపొందారు. కృష్ణా జిల్లా పెనుమత్సకు చెందిన రాజా మూడు దశాబ్దాలుగా అమెరికాలో స్థిరపడ్డారు. తానాలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన విజయం పట్ల టీడీపీ నాయకుడు కేశినేనిశివనాథ్ (చిన్ని) హర్షం వ్యక్తం చేశారు. చిన్ననాటి మిత్రుడి విజయంతో తానా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

25న గుడివాడలో మెగా జాబ్‌మేళా

గుడివాడ, జనవరి 21 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ గురువారం ఉదయం 9.30గంటలకు గుడివాడలోని వీకేఆర్, వీఎన్‌బీ&ఏజికే ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావులు ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. జాబ్‌మేళాలో ఎఫ్త్రానిక్స్, చందు సాఫ్ట్‌టెక్నాలజీస్, హెటిరో ల్యాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్, జోయాలుక్కాస్ జ్యూవెలరీ, సుధీర్ టింబర్స్ ప్రైవేట్ లిమిటెడ్, గోల్డ్ ప్రిన్స్, వీఎస్ఆర్ జ్యూవెలర్స్, మోహన్ స్పిన్‌టెక్స్ లిమిటెడ్, నవత ట్రాన్స్‌పోర్ట్, మెడ్‌ప్లస్ ఫార్మసీ, వరుణ్ మోటార్స్, సంతోష్ ఆటోమోటివ్స్ వంటి 13 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. 7నుంచి 10వతరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన కృష్ణాజిల్లాలోని అన్నిమండలాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారు రూ.9వేల నుంచి 30వేల వరకు వేతనంతోపాటు ఇతర అలవెన్సులు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి, అర్హత వున్న అభ్యర్థులు ముందుగా స్కిల్‌యూనివర్స్ డాట్ ఏపీఎస్ఎస్‌డీసీ డాట్ ఇన్ లింక్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వీలుకానివారు తమ రెజ్యూమ్‌తోపాటు విద్యార్హత జిరాక్స్ కాపీలు, ఫోటోలు, ఆధార్‌కార్డు, అనుభవం వున్నవారు సంబంధిత సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 7981938644, 9848819682 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

చల్లపల్లి ఝాన్సీరాణికి డాక్టరేట్



అజిత్‌సింగ్‌నగర్: స్థానిక వడ్డేశ్వరం వద్ద ఉన్న కేఎల్ వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న చల్లపల్లి ఝాన్సీ రాణికి ప్రఖ్యాత వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వ విద్యాలయం ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌డీ అవార్డును మంగళవారం ప్రకటించింది. సాఫ్ట్‌వేర్ అండ్ సిస్టం ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొ.డా.నాగరాజు దేవరకొండ పర్యవేక్షణలో 'యాన్ ఎఫెక్టివల్ సిస్టం ఫర్ పోజ్ ఎస్టిమేషన్ అండ్ క్లాసిఫికేషన్ అఫ్ ఇండియా క్లాసికల్ డాన్స్ ఫామ్స్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్' అనే అంశంపై పరిశోధనకు ఝాన్సీరాణికి డాక్టరేట్ దక్కింది. వర్సిటీ సహచర అధ్యాపకులు శనివారం ఆమెను అభినందించారు. అనంతరం ఝాన్సీరాణి మాట్లాడుతూ పరిశోధన కాలంలో తన భర్త దాసరి వెంకటేశ్వరరావు సహకారం మరువలేనిదన్నారు.

కార్మిక సంఘాల మద్దతు

గవర్నర్‌పేట: అంగన్వాడీలు నిర్వహించే జగనన్నకు కోటి సంతకాలు సమర్పణకు ట్రేడ్ యూనియన్లు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్టు సంఘాల నేతలు పేర్కొన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. అంగన్వాడీల పోరాటం న్యాయసమ్మతమేనన్నారు. జనవరి 22న నగరంలో నిర్వహించే జగనన్నకు కోటి సంతకాలు సమర్పణకు పూర్తి మద్దతుగా నిలుస్తామన్నారు.

నేటి మధ్యాహ్నం వరకు వాణిజ్య సంస్థల మూత

వన్‌టౌన్: అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని వాణిజ్య సంస్థలను సోమవారం మధ్యాహ్నం 2గంటల వరకు మూసి ఉంచాలని చాంబర్ అధ్యక్షుడు విద్యాధరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.





నగర సంకీర్తన చేస్తున్న భక్త బృందం, శోభయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు, రథయాత్రలో పాల్గొన్న బొండా రవితేజ

నగరంలో రామనామ సంకీర్తన

పటమట, జనవరి 21: అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠను పురస్కరించుకుని హరేకృష్ణ మూమెంట్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో, సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ నుంచి ట్రెండ్‌సెట్ మాల్ మీదుగా మళ్లీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ వరకు జరిగిన రామనామ సంకీర్తనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. వారందరూ హరే రామ అంటూ పెద్దపెట్టున నినదిస్తూ నగర వీధుల్లో సంకీర్తన నిర్వహించారు. హరేకృష్ణ గోకుల క్షేత్రంలో నగర సంకీర్తనతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, దేవాది దేవునకు సేవలు అద్భుతంగా జరిగాయన్నారు. సీతారాముల పల్లకి ఉత్సవం భరత నాట్యం అద్భుతంగా జరిగాయన్నారు. భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు. విజయవంతం చేసిన వారందరికీ అధ్యక్షులు వంశీదాస ధన్యవాదాలు తెలిపారు.

శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ చరిత్రాత్మకం

అజిత్‌సింగ్‌నగర్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రీ బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని అజిత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం శోభయాత్ర జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని సీతా సమేత శ్రీరామ లక్ష్మణస్వామి విగ్రహాలను స్వహస్తాలతో పట్టుకుని శోభయాత్రలో పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథయాత్ర

అయోధ్యలో ప్రారంభం కానున్న శ్రీ రాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అజిత్‌సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో వైభవంగా రథయాత్ర ఆదివారం జరిగింది. బొండా రవితేజ పాల్గొని మాట్లాడుతూ రామ జన్మభూమిలో శ్రీరాముడి దేవాలయం ప్రారంభం కానుండటం సంతోషదాయకమన్నారు.

రామభక్తుల ర్యాలీ

పాయకాపురం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరగనున్న నేపథ్యంలో పాయకాపురంలోని రామభక్తులు ఆదివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాజీవ్‌నగర్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో 200 మంది భక్తులు బైక్‌ర్యాలీని నిర్వహించారు. రాజీవ్‌నగర్, కండ్రిక, ప్రకాష్‌నగర్, అజిత్‌సింగ్‌నగర్, బుడమేరు వంతెన, సీతన్నపేట గేటు మీదుగా అయోధ్యానగర్ వరకు జై శ్రీరామ్ నినాదాలతో ర్యాలీని కొనసాగించారు. పైడిమర్రి శేషు, గార్లపాటి సుదర్శన్, సుబ్రహ్మణ్యం, శీఖాకొల్లి జఠాధర్, పేరం కృష్ణ పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయం సిద్ధం

విద్యాధరపురం: అయోధ్య రామమందిరంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసేందుకు స్థానిక బ్యాంక్ సెంటర్‌లో దాసాంజనేయ స్వామి ఆలయాన్ని నిర్వాహకులు సిద్ధం చేశారు. ఉదయం నుంచి ఇక్కడ ప్రత్యేక అర్చనలు, భజనలు, రామనామ జపం చేయనున్నారు. రామాలయాలు, అంజనేయ స్వామి ఆలయాలు, ఇతర ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.




అయోధ్య రాముని చిత్రాన్ని స్కెచ్ పెన్సిల్‌తో గీసిన నడిపల్లి, ఫాంబోర్డుపై రామాలయాన్ని నిర్మించిన రమేష్

అయోధ్య రాముడిపై కళాసేవ



భవానీపురం: ఏపీ సీఆర్‌డీఏ ఉద్యోగి, డాక్టర్ నడిపిల్లి శ్రీనివాస్ అనే ఆర్టిస్ట్ పెన్సిల్‌తో 3 రోజులు శ్రమించి కోదండరాముడు, సీతాలక్ష్మణ, అంజనేయుని పెన్సిల్ చాయాచిత్రాన్ని చిత్రించారు. యనమలకుదురుకు చెందిన పుట్టంరాజు రమేష్ మారుతీ శర్మ ఫాంబోర్డుతో అద్భుతంగా అయోధ్య రామమందిరాన్ని నిర్మించారు. దీనికి వారం పట్టింది. యనమలకుదురుకే చెందిన మరో మహిళ ఎన్.సుజాత చింతాకుపై 55 సార్లు శ్రీరామ నామాలు రాసి ఔరా అనిపించారు.

బాబామందిరానికి అరుదైన పురస్కారం

సత్యనారాయణపురం: భక్తులు, దాతల సహకారంతో ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరానికి ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం లభించిందని మందిర గౌరవాధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. బాబా మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందిరంలో లోకకల్యాణార్థులు తుండూలాభిషేకం, నారికేళ అభిషేకం, సహస్రవస్త్రపూజ, కోటి రుద్రాభిషేకం నిర్వహించామని దీన్ని ప్రత్యక్షంగా వీక్షించిన వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు మందిర సేవలను గుర్తించి అవార్డు అందజేశారన్నారు. మందిర ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, పీ. మల్లయ్య, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, కమ్మిలి రత్నకుమార్ పాల్గొన్నారు.

టీడీపీతోనే యువత భవిష్యత్తు: బొండా రవితేజ

అజిత్‌సింగ్‌నగర్: తెలుగుదేశం పార్టీతోనే యువత భవిష్యత్తు అని బొండా ఉమా తనయుడు బొండా రవితేజ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని యువతతో ఆదివారం సమావేశం నిర్వహించారు. బొండా రవితేజ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో యువత భవిష్యత్తు దిక్సూచి లేని నావలా తయారైందన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్తు అని అన్నారు. ఘంటా కృష్ణమోహన్, కంచి ధనశేఖర్, గాజుల రవి, లబ్బా వైకుంఠం పాల్గొన్నారు.

బ్లేడ్‌బ్యాచ్ సభ్యుడి వీరంగం



వన్‌టౌన్: స్థానిక శ్రీనివాస టవర్స్ సమీపంలోని చికెన్ షాపు వద్ద బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు ఒకరు ఆదివారం వీరంగం వేశాడు. పోలీసులను కూడా లెక్క చేయకుండా హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కృష్ణలంక పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని అతడని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా మరింతగా రెచ్చిపోవడంతో వారు చేతులెత్తేసి వెనుతిరిగి వెళ్లిపోయారు.

భార్యను గాయపరిచిన భర్తపై కేసు నమోదు

పాయకాపురం: భార్యను గాయపరచిన భర్తపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన శివపార్వతికి, రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన మల్లిబోయిన శివకుమార్‌తో 17ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త శివకుమార్ ఆటోడ్రైవర్. కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడి విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచాడు. బంధువులు శివపార్వతిని ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా లెనిన్ శత వర్ధంతి సభ

గవర్నర్‌పేట, జనవరి 21: ప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకుడు వ్లాదిమిర్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా మార్క్స్, ఎంగిల్స్, లెనిన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లోని సభ జరిగింది. సీపీఐ, సీపీఎం, ఎంఎల్.ఎల్ పార్టీలు, ప్రగతిశీల సంఘాల నేతలు, వామపక్ష శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు లెనిన్ విగ్రహానికి భారీ పూలదండ వేసి నివాళులర్పించారు. విశాలాంధ్ర, ప్రజాశక్తి, ప్రజా సాహితి ప్రచురణ సంస్థలు ముద్రించిన లెనిన్ సాహిత్యం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సీపీఐ రామకృష్ణ మాట్లాడుతూ లెనిన్ వర్ధంతి సందర్భంగా ఏడాది పాటు సభలు, సాంస్కృతిక ప్రదర్శలు వివిధ రూపాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వామపక్ష పార్టీల నేతలు అక్కినేని వనజ, జేవీ సత్యనారాయణ, సీహెచ్ బాబూరావు, మనోహర్‌నాయుడు, కె.లక్ష్మయ్య, దుర్గాభవానీ, జి. కోటేశ్వరరావు, జమిందార్, డీవీ కృష్ణ, డి.రమాదేవి, దివికుమార్, జి.ఈశ్వరయ్య, అరుణ్‌కుమార్, టి.లక్ష్మీనారాయణ, పి.ప్రసాద్, బార్గవశ్రీ, చంద్రానాయక్ పాల్గొన్నారు.



లెనిన్ విగ్రహం వద్ద లెనిన్ శత వర్ధంతి సభలో నేతలు

నేటి యువతకు లెనిన్ ఆదర్శం

ధర్నాచౌక్: కార్మికులు, కర్షకులను ఐక్యం చేసి పోరాడిన ఐవీ లెనిన్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం లెనిన్ శత వర్ధంతి సందర్భంగా స్థానిక దాసరి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రష్యా విప్లవంలో కీలకపాత్ర పోషించి, రష్యా చక్రవర్తి జార్ గద్దె దింపడంలో లెనిన్ కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కీ లెనిన్‌బాబు, కంచర్ల బార్గవ్, లంకా గోవిందరాజులు, ఏఐఎస్‌ఎఫ్ నేతలు ఉప్పుటూరి అరుణ్ కుమార్, తదితరులు లెనిన్‌కు నివాళులర్పించారు.

సమాజంతో పాటు మార్క్సిజం అభివృద్ధి చెందుతుందని ఆచరణాత్మకంగా నిరూపించిన గొప్ప కమ్యూనిస్టు మహోపాధ్యాయుల్లో లెనిన్ ఒకరని సీపీఐ (ఎల్.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.ప్రసాద్ తెలిపారు. లెనిన్ శత వర్ధంతి సభ గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. లెనిన్ రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేసి 1917లో సోషలిస్టు రాజ్యాన్ని ఏర్పరచారన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.గంగాభవానీ మాట్లాడుతూ మహిళలను విప్లవంలోకి ప్రోత్సహించడం అవసరమని లెనిన్ తెలిపారన్నారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రవిచంద్ర, పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐ.రాజేష్ ప్రసంగించారు.

కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయండి: ఆర్‌పీఐ

ధర్నాచౌక్: కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడి దీక్షను భగ్నం చేయడాన్ని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నేతలు తీవ్రంగా ఖండించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజును పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిట్ట వరప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు ఆదివారం పరామర్శించారు.

ఏ వర్గానికీ న్యాయం చేయని జగన్: కొలిశెట్టి

ఎమ్మెల్యేల స్థానాలను మారుస్తున్న సీఎం జగన్ స్థానాన్ని రాబోయే ఎన్నికల్లో ప్రజలు మారుస్తారని యుగ తులసీ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి శివకుమార్ విమర్శించారు. గాంధీనగర్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. తండ్రి మార్గంలో నడుస్తాడనే ఉద్దేశంతోనే ప్రజలు వైసీపీని ఆదరించారని కానీ జగన్ ఏ వర్గానికి న్యాయం చేయలేదన్నారు. కె.సంగమేశ్వర చారి, చంద్రస్వామి పాల్గొన్నారు.



ముగిసిన ఉమెన్ స్విమ్మింగ్ జోనల్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని గాంధీనగర్ సర్ వి జీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో రెండ్రోజుల పాటు సాగుతున్న ఖేలో ఇండియా జూనియర్ ఉమెన్ స్విమ్మింగ్ సిరిస్ రౌండ్-1 (జోనల్ పోటీలు) ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆరు రాష్ట్రాల నుంచి క్రీడాకారిణులు అండర్-15,18 విభాగాల్లో ఫ్రీస్టయిల్ బాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై, వ్యక్తిగత మెడ్లీల్లో 100కు పైగా స్విమ్మర్లు పోటీపడ్డారు. విజేతలకు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఛైర్మన్ యలమంచిలి సురేష్‌బాబు, కేడీఏఏ ప్రెసిడెంట్ డీవీడీవీ భాస్కర్, ట్రెజరర్ పి.బాలమురళీకృష్ణ, ఏపీఏఏ ప్రెసిడెంట్ పి.గోవిందరాజు బహుమతులు ఇచ్చారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్, జాయింట్ సెక్రటరీ వి.రాజేశ్వరి హాజరై విజేతలకు మెడల్స్‌ను బహూకరించారు.

మెగా మెడికల్ క్యాంప్‌కు భారీ స్పందన

విద్యాధరపురం: భవానీపురంలోని ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌కు భారీ స్పందన లభించింది. డాక్టర్ కోలా విజయ శేఖర్, లయన్స్ విజయవాడ మెడికా సంయుక్తంగా క్యాంప్ నిర్వహించారు. వివిధ పరీక్షలు నిర్వహించి మందులను సూచించారు. అవసరమైనవారికి కొన్ని మందులను ఉచితంగా ఇచ్చారు. ఈ శిబిరంలో విజయశేఖర్, వైద్యులు శాంతి,గౌతమ్ సూర్యతేజ్, కె.ఉమామహేశ్వరి, కె.ప్రియ, శౌర్య విజయతేజ్, విజయకుమారి, విజయసుజాత పాల్గొన్నారు,

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

సత్యనారాయణపురం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవడంతో పాటు ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని ప్రముఖ వైద్యుడు డా.ఆదిత్య చంద్రభట్ల అన్నారు. దుర్గాపురం విజయనర్సింగ్ కాలేజీలో వయోవృద్ధా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఆయుర్వేద వైద్యనిపుణుడు డా.ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణుడు డా.కె.వీరబ్రహ్మం ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా అన్నిరకాల వ్యాదులు బాగు చేయవచ్చన్నారు. సుమారు 400 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు.

టీడీపీ హయాంలోనే మైనార్టీలకు మేలు

వన్‌టౌన్: టీడీపీ ప్రభుత్వంతోనే మైనార్టీలకు మేలు జరుగుతుందని టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మైనార్టీల ఆత్మీయ సమావేశంలో సీనియర్ నేత ఎంఎస్ బేగ్ అన్నారు. దుల్హన్ పథకంతో మైనార్టీల ఆడబిడ్డలకు చంద్రబాబు అండగా నిలిచారన్నారు. నా మైనార్టీలని చెప్పుకునే సీఎం జగన్ పాలనలో మైనార్టీలపై ఆదరణ లేదన్నారు. మైనార్టీ సెల్ కార్యదర్శి ఇమ్రాన్ మాట్లాడుతూ జగన్ హయాంలోనే ముస్లిం మైనార్టీలకు కష్టాలు వచ్చాయన్నారు.

కోడికత్తి డ్రామాతో జగన్‌కు అధికారం

జగన్ అధికారంలోకి రావడానికి కోడికత్తి డ్రామా సహకరించిందని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల పాటు కోడికత్తి డ్రామాను జగన్ ఆడించారని, కోడికత్తి శ్రీనును మాత్రం వాడుకుని వదిలేయడంతో అమాయకుడైన దళిత యువకుడు జైలులోనే మగ్గుతున్నాడని, బెయిల్ కూడా రావడం లేదన్నారు. న్యాయం కోరుతూ దీక్షకు దిగిన శీను తల్లి సావిత్రమ్మను దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం పలకరించలేదన్నారు. జగన్‌రెడ్డి వాయిదాలకు హాజరై శీనుకు బెయిల్ వచ్చేటట్టు చూడాలన్నారు.

వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేయొచ్చు

గవర్నర్‌పేట: రానున్న సాధారణ ఎన్నికల్లో 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా ఇంటి నుంచే ఓటు వేసే నూతన పద్ధతికి ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టిందని జిల్లా ఎన్నికల నోడల్ అధికారి ఉప్పలపాటి శ్రీనివాసరావు తెలిపారు. బందరు లాకుల సెంటర్‌లోని సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూరి బాబురావు అధ్యక్షత వహించారు. అనంతరం మాట్లాడుతూ కొత్తగా ముద్రించిన ఓటర్ల లిస్టు స్థానిక సచివాలయంలో ఉందని, ప్రతిఒక్కరూ తమ ఓటును చెక్ చేసుకోవచ్చన్నారు. ప్రముఖ వైద్యుడు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు సమరం మాట్లాడుతూ ప్రలోభాలకు, తాయిలాలకు లొంగి ఓటు వేయవద్దన్నారు. ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు వి.కామరాజు, సహాయ కార్యదర్శి డి.సాంబశివరావు, న్యాయవాది పి.రాము, కార్యకర్త ఎం.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ ప్రభంజనం ఖాయం: పోతిన

పాత రాజరాజేశ్వరి పేట: వచ్చే ఎన్నికల్లో జనసేన-టీడీపీ ప్రభంజనం ఖాయమని జనసేన పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన మహేష్ అన్నారు. 55వ డివిజన్ కంసాల పేటలో ఆదివారం ఇంటింటికి రాబోది జనసేన-టీడీపీ ప్రభుత్వం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జనసేన టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు సోమి గోవింద్, పల్లెంటి ఆది, సోమి మహేష్, డాక్టర్ శ్రీనివాసరావు, వడ్డాది రామకృష్ణ, సంఘంరెడ్డి రాజు, శ్రీరామ్ శెట్టి శ్రీను, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

లబ్బీపేట: పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. బందరు రోడ్డు లోని ఏ కన్వెన్షన్ వద్ద కస్తూరి పూర్ణచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు వారి తల్లిదండ్రులకు నూతన వస్త్రాలు అందజేశారు. ట్రస్టీ వల్లూరు అశోక్ బాబు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వల్లూరు రవీంద్రనాథ్, చిలకపాటి ఉషారాణి రాంప్రసాద్ పాల్గొన్నారు.

అధ్యాపక-గ్రంథ పాలకుల మధ్య సహకారం అవసరం

పటమట: ప్రస్తుత విద్యావ్యవస్థ వెబ్ ఆధారిత అవకాశాల వైపు చూస్తోందని ఇందుకు అధ్యాపకులు, గ్రంథ పాలకులు పరస్పర సహకారంతో విద్యార్థుల ప్రగతికి చోదక శక్తిగా మారాలని మద్రాస్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ శాస్త్ర విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ బి.రమేష్ బాబు అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సర్వోత్తమ భవనంలో జరిగిన విద్యా అధ్యయన వ్యవస్థలో గ్రంథ పాలకుల పాత్ర అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ద్రవిడయన్ విశ్వ విద్యాలయం గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎం.దొరస్వామి మాట్లాడుతూ ప్రత్యేక ఫార్మాట్లలో విద్య నేర్చుకోవడం-బోధించడం ద్వారా కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం రాష్ట్ర గ్రంథాలయ సంఘ కార్యదర్శి డాక్టర్ రావి శారద వర్క్‌షాపు ఉద్దేశాలను వివరించారు. రాష్ట్ర గ్రంథాలయ సంఘ ఉపాధ్యక్షుడు వి.కేశవరావు, ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ ఈ-లెర్నింగ్ విభాగాధిపతి డాక్టర్ కోనేరు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాద్ ముస్లిం కమిటీ వార్షికోత్సవం

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 21: ఆజాద్ ముస్లిం కమిటీ 6వ వార్షికోత్సవం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగూల్ మీరా ఆధ్వర్యంలో అజిత్‌సింగ్ నగర్‌లోని బూదాల ఆదాం కల్యాణమండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా వైసీపీ ఎస్సీ సెల్ నేత బెజ్జం రవి, నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బర్మా ఫణిబాబు హాజరై కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 150 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసి 600 మందికి భోజనం పెట్టారు. షేక్ అక్బర్, రమేష్‌రెడ్డి, షేక్ సాజిద్ అలీ, కాలేషా పాల్గొన్నారు.

దిక్సూచి
DIKSUCHI


రీజనింగ్

లెటర్ సిరీస్
పోటీపరీక్షల ప్రత్యేకం

పార్ట్-1

1. PQR/ RPQ/ QRP/ PQR

మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో రెండో , మూడో అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదేవిధంగా రెండో సమూహంలో చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో రెండో, మూడో అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

2. PQ/ PPQ/ PPPQ/ PPPPQ

మొదటి సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'P' అదనంగా వస్తున్నది.

3. abcd/ aabbccdd/ aaabbbccc

మొదటి సమూహంలో ఒక abcd, రెండో సమూహంలో రెండు a లు, రెండు bలు, రెండు cలు, రెండు dలు ఒక సమూహంగా ఏర్పడింది. మూడో సమూహంలో మూడు aలు, మూడు bలు, మూడు cల వరకు ఈ సిరీస్ ఏర్పడింది.

4. baac/ accb/ cbba/ baac/ accb

మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా, రెండో అక్షరమే మరల మూడో అక్షరంగా, నాలుగో అక్షరంగా దాని ముందు సమూహంలోని మొదటి అక్షరం ఏర్పడ్డాయి. అదేవిధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలోని ఒకటో, రెండవ అక్షరాలుగా, రెండో అక్షరమే తిరిగి మూడో అక్షరంగా, నాలుగో అక్షరంగా దాని ముందు సమూహంలోని మొదటి అక్షరం ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

5. ccacc/ aabaa/ bbcbb/ ccacc

మొదటి సమూహంలో నాలుగు cలు, రెండో సమూహంలో నాలుగు aలు, మూడో సమూహంలో నాలుగు bలు ఏర్పడుతూ మొదటి సమూహంలోని నాలుగు అక్షరాలకు మధ్యగా a, రెండో సమూహంలో నాలుగు అక్షరాలకు మధ్యగా b, మూడో సమూహంలో నాలుగు అక్షరాలకు మధ్యగా c. ఈవిధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

6. PQR/ QRST/ RSTUV/ STUVWX

మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా ఏర్పడి అదనంగా రెండు అక్షరాలు వర్ణమాలను(ఆల్ఫాబెట్స్) అనుసరిస్తూ ఏర్పడ్డాయి. రెండో సమూహంలోని చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలోని మొదటి మూడు అక్షరాలుగా ఏర్పడి అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం ఏర్పడినవి. అదేవిధంగా మూడో సమూహంలోని చివరి నాలుగు అక్షరాలు నాలుగో సమూహంలో మొదటి నాలుగు అక్షరాలుగా ఏర్పడుతూ అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

7. aabc/ bbca/ ccab/ aabc

పై సిరీస్‌లో అండర్‌లైన్ చేసిన అక్షరాలు abc/ bca/ cab/ abc-లకు 11వ మోడల్‌కు సంబంధించిన వివరణే. అంతేకాక ప్రతి సమూహంలోను మొదటి అక్షరమే రెండుసార్లు రిపీట్ అయినది.


డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

అదానీ Vs హిండెన్‌బర్గ్
ఆరోపణలు - పరిణామాలు



భారతదేశం తొంభయ్యవ దశకంలో చేపట్టిన సంస్కరణలతో ఆర్థికరంగం సరికొత్త రూపుదాల్చింది. ఎల్‌పీజీ(లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్)ను ప్రవేశపెట్టడం ద్వారా దేశ ఆర్థికవ్యవస్థలో వృద్ధితోపాటు, కొన్ని అవలక్షణాలకు ద్వారాలు తెరిచినట్లయింది. మరీ ముఖ్యంగా వైట్‌కాలర్ నేరాలు(స్టాక్ మార్కెట్ కుంభకోణాలు, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లు, మనీ లాండరింగ్, డొల్ల సంస్థలు, పన్ను ఎగవేతలు, రుణాల కుంభకోణాలు మొదలైన ఆర్థిక నేరాలు) విజృంభించాయి.

కొత్తగా అనుసరిస్తున్న ఆర్థికపంథాకు అవసరమైన నియంత్రణ సంస్థల, చట్టాలపరమైన కొరతకు తోడు ఇతర దేశాలతో ఆర్థిక నేరాల సమాచార మార్పిడి, నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలు విస్తృతంగా లేనందున ఆర్థిక నేరాలను పసిగట్టడం, అదుపు చేయడం, నేరగాళ్లను శిక్షించడంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. అందువల్ల తరచూ ఏదో ఒక తరహా వైట్ కాలర్ నేరాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

ఇటీవల అదానీ గ్రూప్ సంస్థలపై అలాంటి వైట్‌కాలర్ నేరాలను ఆరోపిస్తూ అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్, ఆర్థిక నేరాల పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఒక పరిశోధన నివేదికను జనవరి 2023లో విడుదల చేసింది.

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు

1. అదానీ గ్రూపునకు చెందిన పోర్ట్స్, లాజిస్టిక్, పవర్ జనరేషన్, అగ్రి బిజినెస్ వంటి వివిధ సంస్థలు స్టాక్ మార్కెట్ మ్యానిప్యులేషన్, అకౌంటింగ్ లోసుగులు, పన్ను ఎగవేతలు, ఫ్రాడ్ స్కీమ్‌లు వంటి చర్యల ద్వారా దశబ్దాల తరబడి సుమారు 17.8 ట్రిలియన్ల(218 బిలియన్ డాలర్ల) మేర అక్రమాలకు పాల్పడ్డాయి.
2. అదానీ కుటుంబ సభ్యులు మారిషస్, కరేబియన్ దీవులు, యుఏఈ వంటి టాక్స్‌హెవెన్(పన్ను రాయితీ/పన్నురహిత) దేశాల్లో షెల్ కంపెనీలు(డొల్ల కంపెనీలు) ఏర్పాటుచేసి అనేక అక్రమాలకు తెరలేపారు.
3. ఈ డొల్ల కంపెనీల ద్వారా భారీఎత్తున మనీ లాండరింగ్, అవినీతి, స్వదేశంలో పన్ను ఎగవేత జరిగాయి.
4. అదానీ గ్రూపులోని పబ్లిక్ లిస్టింగ్ కంపెనీల మధ్య నిధుల అక్రమ బదిలీ ఈ డొల్ల కంపెనీల ద్వారా జరిగింది.
5. షేర్ల విలువను తప్పుడు మార్గాల్లో పెంచడం ద్వారా బ్యాంకుల నుంచి భారీఎత్తున రుణాలు, ఇతర సంస్థల నుంచి పెట్టుబడులు అదానీ పొందారు.

> **షార్ట్ సెల్లింగ్ అంటే ఏమిటి?**
>
> హిండెన్‌బర్గ్ సంస్థ షార్ట్ సెల్లింగ్‌కు పాల్పడేందుకే అదానీ గ్రూపు లొసుగులపై నివేదికను వెలువరించిందనే వాదనలూ ఉన్నాయి. షార్ట్ సెల్లింగ్ అంటే సాధారణంగా స్టాక్ మార్కెట్లలో సాధారణ ఇన్వెస్టర్లు, భవిష్యత్తులో షేర్ ధర పెరగవచ్చనే ఆశావాద దృక్పథంతో చేసే కొనుగోళ్లకు పూర్తిగా విభిన్నం అయిన ప్రక్రియ ఇది. ఒక ప్రయోజనంతో, ధరలు ఎక్కువగా ఉన్నప్పుడే అరువుగా ఆ షేర్లను తీసుకుంటారు. వాటిని అమ్మి, ఆ మొత్తంతో ధర పడిపోగానే భారీగా ఆ షేర్లు తిరిగి కొంటారు. ధర పెరిగినప్పుడు మరలా అమ్మి, లభించిన మార్జిన్‌తో భారీగా లాభపడతారు. అలా అరువు తీసుకున్న షేర్లను తిరిగి వెనక్కి ఇచ్చేసే ప్రక్రియ ఇది. దీనిలో తక్కువ కాలానికి స్టాక్స్ ఉంచుకుంటారు.
>
> **19(ఎ) రూల్ అనగా?**
>
> 'సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్(రెగ్యులేషన్) రూల్స్ 1957'లోని 19(ఎ) రూల్ ప్రకారం భారత స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన ప్రతి కంపెనీ కనీసం 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను కలిగి ఉండాలి. అంటే 75 శాతం మించి కంపెనీ యజమానులు కానీ వారి కుటుంబీకులు కానీ వాటాను కలిగి ఉండరాదు. ఈ నియమం ఇన్‌సైడర్ ట్రేడింగ్, షేరు ధరల్లో అవకతవకలకు పాల్పడటం వంటి వాటిని నిరోధించడానికి నిర్దేశించారు. షేర్ మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులో కొంతమొత్తం షేర్లు ఉంచడం ద్వారా ట్రేడింగ్ జరిగి షేర్ విలువల్లో కచ్చితత్వ సాధనకూ ఈ నియమాన్ని ప్రవేశపెట్టారు.

ఈ నివేదిక వెలువడటంతోనే దేశంలోనే సంపన్న వ్యక్తిగా నిలిచిన గౌతం అదానీ సంస్థల షేర్లు గత ఏడాది 150 బిలియన్ డాలర్ల మేర నష్టపోవడానికి, అతని వ్యక్తిగత సంపద 60 బిలియన్ డాలర్ల మేర తుడిచిపెట్టుకుపోవడానికి కారణమైంది. ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయారు. అదానీ కంపెనీలకు పెద్దమొత్తంలో రుణాలిచ్చిన బ్యాంకులు, పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీ సంస్థ షేర్లు అమాంతం పడిపోయాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు అదానీ సెక్యూరిటీ చట్టాల ఉల్లంఘనకు పాల్పడిందన్న హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా మూలధన మార్కెట్ రెగ్యులేటింగ్ ఏజెన్సీ అయిన 'సెబీ(సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)'ను 2023 మార్చిలో ఆదేశించింది. ఈ మేరకు సెబీకి సుప్రీంకోర్టు రెండు కీలక విషయాల పరంగా పరిశోధన జరపాలని టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఇచ్చింది. **అవి–**

1. సెక్యూరిటీస్ కాంట్రాక్ట్(రెగ్యులేషన్)రూల్స్ 1957లోని రూల్ 19(ఎ)ను అదానీ గ్రూపు సంస్థలు అతిక్రమించాయా?
2. స్టాక్ ప్రైసెస్ అవకతవకలు, అదానీ సంస్థల్లో రహస్య లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై పరిశీలన.

దీనితోపాటు సుప్రీంకోర్టు కూడా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏ.ఎం.సప్రే అధ్యక్షతన ఆరుగురు సభ్యుల ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించి హిండెన్‌బర్గ్ రిపోర్టు తో ఇన్వెస్టర్లు సంపద కోల్పోవడానికి రెగ్యులేటరీ వైఫల్యం ఎంత ఉందో చెప్పాల్సిందిగా ఆదేశించింది.

ఈ క్రమంలో సెబీ దర్యాప్తుపై అనుమానాలు రేపుతూ ఫైనాన్షియల్ టైమ్స్, ద గార్డియన్ పత్రికల్లో ఆగస్టులో 'ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్‌పీ)' వెలువరించిన రిపోర్టు సంచలనం రేపింది. ఈ సంస్థ రిపోర్టు, హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఆధారాలను చూపెట్టింది. విదేశాల్లోని డొల్ల కంపెనీల ద్వారా ఏవిధంగా అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్స్‌లో రూల్ 19(ఎ)ను అతిక్రమిస్తూ రహస్యంగా 75 శాతానికి మించి వాటాను అదానీ కుటుంబం సంపాదించిందో అంతర్గత ఈమెయిల్స్ ఇన్వాయిస్‌లు, లావాదేవీల రికార్డులు సహితంగా ఆధారాలు ప్రచురించింది. అంతేకాక గతంలో అదానీ కంపెనీ జరిపిన కొన్ని అనుమానాస్పద లావాదేవీలను సెబీ నియంత్రణ చేయలేకపోవడం గతంలో సెబీ ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి తదుపరి అదానీ గ్రూపు కొనుగోలు చేసిన ఎన్‌డీటీవీలో కీలక పదవి చేపట్టడం వంటి విషయాలు సైతం ఈ నివేదిక వెల్లడించింది. ఈ వార్తా కథనాలతో సెబీ దర్యాప్తుపై అనుమానాలు రేకెత్తించడంతో కొందరు అదానీ కేసులో సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) లేదా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు.ఈ వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం జనవరి 3న తీర్పు చెప్పింది.

సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలు

1. సెబీ చేస్తున్న దర్యాప్తుపై ఎటువంటి అనుమానాలూ లేవని, అదనంగా సిట్‌ను గానీ, సీబీఐని గానీ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సెబీ సమగ్రతను శంకించలేమని పేర్కొంది.
2. ఇప్పటికే విచారణ చేపట్టాల్సిన 22 అంశాల్లో 20 అంశాలపరంగా విచారణ పూర్తయిందని సెబీ తెలిపిన దరిమిలా మిగతా రెండు అంశాలపై కూడా మూడు నెలల్లోగా దర్యాప్తు పూర్తిచేసి నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది.
3. పిటిషన్‌దారులు కోరినట్లుగా, సెబీ ఇటీవల ప్రవేశపెట్టిన ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్స్ రెగ్యులేషన్, ద లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్స్ రిక్వైర్‌మెంట్ రెగ్యులేషన్ పరంగా ఎటువంటి మార్పులు చేయాలని సెబీని ఆదేశించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.
4. హిండెన్‌బర్గ్ సంస్థ నివేదిక వెలువరించిన తరవాత భార త షేర్ మార్కెట్‌లో ఒడుదొడుకులను ఆసరాగా చేసుకొని షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ భారీగా కొనుగోళ్లు జరిపి లాభపడిందనే వార్తల వచ్చాయి. ఆ నేపథ్యంలో, హిండెన్‌బర్గ్ అవకతవకలకు పాల్పడిందేమో విచారించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది. అయితే కొందరు విశ్లేషకులు మాత్రం సుప్రీంకోర్టు తీర్పు విషయంలో కొన్ని అంశాలపరంగా మరింత స్పష్టత ఆశిస్తున్నారు.

అవి–

- సెబీ దర్యాప్తు పూర్తిచేసిన 20 అంశాల్లో ఏముందో ప్రజలకు గానీ, కనీసం సుప్రీంకోర్టు పరిశీలించడానికి గానీ సెబీ నివేదించలేదు. సుప్రీంకోర్టు కూడా వాటి వివరాలు కోరలేదు.
- దర్యాప్తు పూర్తిచేయాల్సి ఉన్న మిగతా రెండు విషయాలైన రూల్19(ఎ) అతిక్రమణకు సంబంధించి, అదానీ సంస్థ ల్లో పెట్టుబడి పెట్టిన విదేశీ సంస్థల యాజమాన్యాలు, వాటి లావాదేవీల గురించి హిండెన్‌బర్గ్ ఓసీసీఆర్‌పీ సేకరించిన వివరాలు, ఆధారాలు సెబీ ఎందుకు సేకరించలేకపోతోంది?
- టాక్స్ హెవెన్ దేశాల్లో ఆర్థిక సంబంధమైన సమాచార మార్పిడిపరంగా ఉన్న నిబంధనల కారణంగా మిగిలిన రెండు అంశాల్లో విచారణ ఆలస్యమవుతోందని సెబీ కోర్టుకు తెలిపింది. అయితే ఆ సమస్య పరిష్కార దిశగా సెబీ, సుప్రీంకోర్టు, ప్రభుత్వం ఎలాంటి పరిష్కార మార్గాలు, ప్రత్యామ్నాయ పద్ధతులు చూపకపోవడంతో కేసు విచారణ మూడు నెలల గడువులోగా పూర్తికావడంపై సందేహాలు ముసురుకుంటున్నాయి.
- సెబీ దర్యాప్తు ఆలస్యం అవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా చర్యలు తీసుకోవడానికి మార్గం సుగమం కావడంలేదు. ఈ పరిస్థితుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విధిని నిర్వర్తించేందుకు సెబీ కనీసం ప్రాథమిక దర్యాప్తు నివేదికనైనా బహిర్గతపరచాల్సి ఉంటుంది. నేరారోపణ ఉన్నట్లయితే మిగతా రెండు విషయాల కోసం కాలయాపన తగదు.

గతంలో ఇదేతరహా ఆర్థిక నేరాలకుగాను 15 సంవత్సరాల క్రితం సెబీ అదానీపై ఫిర్యాదు నమోదుచేసి, పదిలక్షల జరిమానా విధించింది. ప్రస్తుతం వివిధ బ్యాంకులు అదానీకి భారీగా రుణాలు ఇచ్చి ఉండటం, ఎల్ఐసీ అదానీ సంస్థల్లో 81,347 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టి ఉన్న నేపథ్యంలో ఒకవేళ నేరాలు రుజువై, అదానీ రుణాల చెల్లింపులో విఫలమైతే స్టాక్ మార్కెట్‌లో తీవ్ర ఒడుదొడుకులు నమోదవుతాయన్న భయాలు సర్వత్రా నెలకొన్నాయి.

అయితే ఈ తీర్పుతో సెబీ సమగ్రతపై సుప్రీంకోర్టు ధృవీకరణ ఇచ్చినట్లయింది. భారతదేశ విత్త మార్కెట్, రెగ్యులేటరీ మెకానిజాలపై ఇన్వెస్టర్లకు అభద్రతాభావం కలుగకుండా ఉండేందుకు ఇది దోహదపడింది.

ఇదిలా ఉండగా తీర్పు వెలువడిన వెంటనే గౌతమ్ అదానీ 'సత్యమేవ జయతే' అని ట్వీట్ చేయడం మాత్రం కేసులో ఆయన విజయం సాధించినట్లుగా భ్రమలు కల్పించే ప్రయత్నమేనని విమర్శకులు పేర్కొంటున్నారు. నిజానికి సెబీ కానీ, సుప్రీంకోర్టు కానీ ఆయనకు ఎటువంటి క్లీన్‌చిట్ ఇవ్వలేదు. కేవలం సెబీ సమగ్రతకు మాత్రమే సుప్రీంకోర్టు ధృవీకరణ దక్కింది. ●


ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

బొత్స ఇంటిని ముట్టడిస్తాం
▸▸ నిరుద్యోగ జేఏసీ

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'మెగా డీఎస్సీ అంటూ వైసీపీ ప్రభుత్వం పదే పదే నిరుద్యోగులను మోసం చేస్తోంది. సంక్రాంతి పండగ తర్వాత నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన చేశారు. ఆతరువాత కనీస స్పందన లేదు' అని జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్ ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'నిరుద్యోగులు చేస్తున్న ఒత్తిడితో మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి ఏర్పడింది. వారిని మభ్యపెట్టడానికి ఉత్తుత్తి ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోతే త్వరలో మంత్రి బొత్స ఇంటిని ముట్టడిస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను రోడ్లపై తిరగనివ్వం' అని సిద్దిక్ హెచ్చరించారు.

రాజకీయాలకతీతంగా పనిచేస్తాం
▸▸ ఇంజనీరింగ్ కాలేజీల సంఘం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'రాజకీయ పార్టీలతో సంబంధం లేని వారిని సంఘం నేతలుగా ఎన్నుకోవడం ద్వారా సాంకేతిక కాలేజీల అభివృద్ధి జరుగుతుంది. విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి' అని ఏపీ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం పేర్కొంది. నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మధుసూదన్‌రావు, కోశాధికారి గ్రంధి సత్యనారాయణ ఆదివారం విజయవాడలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మొదటి సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్న కళాశాలలు ఇతర కాలేజీలకు తోడ్పా టు ఇవ్వాలని, ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్‌తో సమన్వయం చేసుకుని కాలేజీలు ఆర్థికంగా మెరుగుపడేలా చూడాలని తీర్మానించినట్లు నేతలు తెలిపారు.

కారులో తరలిస్తున్న రూ.2.07 కోట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదుతో నక్కపల్లి పోలీసులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా), జనవరి 21: కారులో తరలిస్తున్న రూ.2.07 కోట్ల నగదును అనకాపల్లి జిల్లా నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. ఎస్ఐ విభీషణరావు ఆదివారం విలేకర్లకు వెల్లడించిన వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా ఎస్పీ, నర్సీపట్నం ఏఎస్పీ ఆదేశాలతోపాటు అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో నక్కపల్లి పోలీసులు శనివారం రాత్రి జాతీయ రహదారిపై వేంపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో తుని వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న కారును ఆపి పరిశీలించారు. లోపల ఇద్దరు వ్యక్తులతోపాటు ఐదు బ్యాగులు కనిపించడంతో ఆ బ్యాగులను తెరిచి చూడగా పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. తాము ధాన్యం వ్యాపారులమని, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నుంచి నగదు తీసుకెళుతున్నామని కారులో ఉన్న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన వజ్రపు వెంకటేశ్వరరావు, యాదవ రాజు బదులిచ్చారు. అయితే ఎటువంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు బ్యాగుల్లోని రూ.2.07 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు సోమవారం అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

29 నుంచి ఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విజయవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ పరిధిలో వచ్చే వార్షిక నివేదికపై ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు సీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సూర్యారావుపేటలోని సీపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ అభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు.



సీన్ మారుతోంది!

గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వల్ల ఎండిపోయిన వరి పైరు


డిసెంబరులో సంభవించిన విచౌంగ్ తుఫాన్ వర్షాలతో నీటిపై తేలుతున్న వరి పనలు

- రుతుపవనాలపై వాతావరణ మార్పు ప్రభావం
- దేశంలో 55 % తాలూకాల్లో 10 % పెరిగిన వర్షపాతం
- గంగా మైదానం, ఈశాన్య భారతంలో వర్షాభావం
- ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడు, తెలంగాణ, ఏపీలో మూడు జిల్లాల్లో పెరిగిన వర్షాలు
- వాతావరణ, పర్యావరణ నిపుణుల అధ్యయనంలో వెల్లడి

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 'వాతావరణ మార్పు ప్రభావం' (క్లైమేట్ చేంజ్ ఎఫెక్ట్)తో వాతావరణ పరిస్థితుల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆకస్మికంగా కుంభవృష్టి వర్షాలు, వరదలు.. ఇదే సమయంలో తీవ్రమైన వర్షాభావంతో కరువు పరిస్థితులు, తీవ్ర వడగాడ్పులు వంటివి సంభవిస్తుండడంతో వాతావరణ, పర్యావరణ నిపుణులు తరచూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నైరుతి సీజన్‌లో వర్షాలు ఆలస్యమై ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడడంతో దిగుబడులు తగ్గుతుందన్న నిపుణుల హెచ్చరికల నేపథ్యంలోనే.. దేశంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లలో మార్పులు సంభవించాయని ఒక అధ్యయనం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ నుంచి తీసుకున్న అంశాలపై స్వతంత్ర అధ్యయన సంస్థ 'ది కౌన్సిల్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ) 1982 నుంచి 2022 వరకు నిర్వహించిన ఈ అధ్యయనంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. గడచిన దశాబ్ద కాలంలో (2012-2022) ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో 5,650 తాలూకాలకుగాను 4,419 తాలూకాల్లో (55 శాతం) 10 శాతం వర్షపాతం పెరగగా 11 శాతం తాలూకాల్లో వర్షపాతం తగ్గింది. ముఖ్యంగా గత దశాబ్ద కాలంలో రుతుపవనాల కదలికలు, వాటి ప్రభావంలో అనేక మార్పులు వచ్చాయని గుర్తించారు. దేశంలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు నైరుతి, అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షాలు కురుస్తాయి. జూన్‌లో కేరళను తాకే నైరుతి రుతుపవనాల వల్ల కురిసే వర్షాలతో దేశంలో ఎండల నుంచి ఉపశమనం పొందడమే కాకుండా ఖరీఫ్ పంటల సాగుకు దోహదపడతాయి. ఈశాన్య రుతుపవనాలు దక్షిణ ద్వీపకల్పంలో రబీ పంటలతోపాటు తాగునీటి అవసరాలను తీరుస్తుంటాయి. క్లైమేట్ చేంజ్ వల్ల దేశంలో రుతుపవనాల మౌలిక స్వరూపంలో అనేక మార్పులు వచ్చాయని ఈ అధ్యయనం వెల్లడించింది. గడచిన 40 సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాల వర్షపాతం వివరాలను విశ్లేషిస్తే.. 29 ఏళ్లపాటు సాధారణంగా, తొమ్మిది సంవత్సరాలు సాధారణం కంటే ఎక్కువగా, మూడు సంవత్సరాలు తక్కువగా వర్షపాతం నమోదైంది. సంప్రదాయంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే రాజస్థాన్, గుజరాత్, మధ్య మహారాష్ట్ర, తదితర ప్రాంతాల్లో వర్షాలు పెరిగాయి. తమిళనాడులో 1981 నుంచి 2011 వరకు సాధారణం కంటే 30 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైంది. దేశంలో 55 శాతం తాలూకాల్లో వర్షపాతం శాతం పెరగడం, వరదలు సంభవించడం జరిగాయి. గత పదేళ్లలో 64 శాతం తాలూకాల్లో సగటున ఒకటి నుంచి 15 రోజులు అధిక వర్షాలు కురిశాయి. ఉదాహరణకు గత ఏడాది హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, 2022లో బెంగళూరులో సంభవించిన వరదలే ఇందుకు తార్కాణమని అధ్యయనంలో తేలింది. కాగా అత్యధిక వర్షాలు కురిసే అసోం, మేఘాలయల్లో వర్షపాతం తక్కువగా నమోదైంది. దేశానికి ధాన్యాగారంగా పేరొందిన గంగా మైదాన ప్రాంతం ప్రధానంగా పశ్చిమబెంగాల్ పరిసర ప్రాంతాల్లో నైరుతి సీజన్‌లో వర్షాలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ ప్రాంతంలో జూన్, జూలై నెలల్లోనే ఖరీఫ్ పంటలను సాగు చేస్తుంటారు. అయితే ఈ రెండు నెలల్లో వర్షాలు ఆలస్యం కావడంతో ఖరీఫ్ సాగులో జాప్యం ఏర్పడంతోపాటు పంటల దిగుబడి గణనీయంగా తగ్గింది. ఇది దేశంలో పంటల దిగుబడి అంచనాపై ప్రభావం చూపుతోంది. ఇదే సమయంలో ఆకస్మిక వరదలు లేదా వర్షాభావంతో కరువు పరిస్థితులు ఎక్కువగా సంభవిస్తున్నాయి. జూన్, జూలైలో వర్షాలు ఆలస్యం కావడంతో గంగా మైదాన ప్రాంతమే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఖరీఫ్ సాగు ఆలస్యమవుతోంది. ఇక అక్టోబరులో దేశంలో 48 శాతం తాలూకాల్లో 10 శాతానికిపైగా వర్షపాతం పెరగడంతో ఖరీఫ్‌లో చేతికి వచ్చిన పంటలు నష్టపోతుండడం, రబీ సాగు ఆలస్యం కావడం వంటివి జరుగుతున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. గత పదేళ్లలో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడులో 80 శాతం, ఆగ్నేయ తెలంగాణలో 44 శాతం, ఏపీలోని మూడు జిల్లాల్లో 39 శాతం వర్షపాతం పెరిగింది. ఇంకా ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, గోవాలో కూడా వర్షపాతం పెరిగిందని ఈ అధ్యయనం వెల్లడించింది.

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక


మాధవస్వామి, నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, జనవరి 21: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళగిరిలో జరుగుతున్న మహాసభల సందర్భంగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుగిడె మాధవస్వామి, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి నాగేశ్వరరావు, కోశాధికారిగా బత్తూరి మోహన్‌రావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కడుపు కన్నయ్య, నీలూరి లక్ష్మయ్య, బి.వెంకట నారాయణ, జొన్నాదుల భారతి, సహాయ కార్యదర్శులుగా పామిశెట్టి గోవిందు, గొట్టుముక్కల బాలాజీ, పీ.హరి, వై.పీతాంబరధరరావు, మరో 35 మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కార్యవర్గం ఎన్నికైనట్టు చేనేత కార్మిక సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జింకా చలపతి ప్రకటించారు.

ధర్మారం క్యాంపుపై మేమే దాడి చేశాం
▸▸ మావోయిస్టు నాయకురాలు సమత పేరుతో లేఖ

చర్ల, జనవరి 21: బీజాపూర్ జిల్లా పామేడులోని ధర్మారం సీఆర్పీఎఫ్ క్యాంపుపై తామే దాడి చేశామని మావోయిస్టులు ప్రకటించారు. ఈ మేరకు దక్షిణ సబ్-జోనల్ బ్యూరో ప్రతినిధి సమత పేరుతో ఆదివారం ఓ లేఖ విడుదలైంది. ఈ ఘటనపై ఇంతవరకు పోలీసులు మాట్లాడేందుకు నిరాకరించినా.. మావోయిస్టులు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. "ఈ నెల 16న ధర్మారం క్యాంపుపై భారీ దాడి చేశాం. పీఎల్‌జీఏ బలగాలు వీరోచితంగా పోరాటం చేశాయి. ఈ పోరులో చాలా మంది పోలీసులు మృతిచెంది ఉంటారు. పలువురు క్షతగాత్రులై ఉంటారు. వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చి సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్ వంటి విభాగాల్లో చేరి, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. చనిపోయిన పోలీసుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాం" అని సమత ఆ లేఖలో పేర్కొన్నారు. సుదీర్ఘంగా సాగిన ఈ పోరాటంలో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారని వివరించారు. మృతిచెందిన మావోయిస్టుల్లో పీఎల్‌జీఏ కమాండర్ కరటం దేవాల్, మూసాక విక్రమ్, మడకం దేవాల్ ఉన్నారని వెల్లడించారు.





ది హార్ట్ ఆఫ్ రామాయణ్



పర్యావరణ హితం... రామాయణ ఘట్టం... ఒకే కాన్వాస్‌పై అత్యద్భుతంగా ఆవిష్కృతమైన నిలువెత్తు 'చిత్రం' ఇది. 'సమస్త సృష్టికి ఆధారభూతమైన భూమి పట్ల మానవాళి కృతజ్ఞతతో ఉంటే ప్రకృతి ఆశీర్వాదం లభిస్తుంది' అనే సందేశాన్ని ఇస్తూ... ప్రముఖ చిత్రకారుడు వెంకటేశ్ కందునూరి ఈ అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ వేశారు.

కృతజ్ఞతకు చిహ్నంగా నమస్కరిస్తున్న హనుమంతుడు... ఆశీర్వాదానికి చిహ్నంగా అభయహస్తంతో శ్రీరాముడు... ఇందులో మనకు కనిపిస్తారు. అంతేకాదు... త్రిమూర్తులు, దశరథ, కౌసల్య, సుమిత్ర, కైకేయి, సీతమ్మవారు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, మారీచుడు, మాయలేడీ, రావణ విభీషణ కుంభకర్ణాదులు, వానరులు... శ్రీరామ జననం నుంచి లవకుశల పట్టాభిషేకం వరకు రామాయణాన్ని మలుపు తిప్పిన పాత్రలు... ప్రకృతితో మమేకమైన మానవాళి జీవన విధానానికి గుర్తుగా చెట్లు చేమలు, పక్షులు, భూమి, సూర్య చంద్రాదులు ఈ చిత్రంలో దర్శనమిస్తాయి.

అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం నిధుల సేకరణలో భాగంగా 'రామతీర్థ ట్రస్టు' వారు చేపట్టిన కార్యక్రమానికి తనవంతు బాధ్యతగా వెంకటేశ్ ఈ పెయింటింగ్ వేశారు. దీన్ని గీయడానికి ఆరు మాసాలకు పైగా సమయం పట్టింది. శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకొని... ఈ చిత్రాన్ని ట్రస్టుకు బహూకరించారు. దీని ద్వారా వచ్చిన మొత్తాన్నీ మందిరం నిర్మాణానికి విరాళంగా ఇవ్వనున్నారు. మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచ గ్రామానికి చెందిన వెంకటేశ్... జేఎన్‌టీయూ ఫైన్‌ఆర్ట్స్‌లో బీఎఫ్‌ఏ చేశారు. ఆయన రామ భక్తుడు.



ఆమె గమ్యం... సురక్షిత ప్రయాణం

పదిహేడేళ్ల కూతుర్ని పోగొట్టుకున్న విషాదాన్ని... మరెవరికీ అలాంటి బాధ కలగకుండా చూడాలనే సంకల్పంగా మార్చుకున్నారు మృదుల్ భాసిన్. రహదారి భద్రతపై అవగాహన కల్పించడానికి ఇరవై మూడేళ్లుగా నిరంతర కృషి సాగిస్తున్నారు. "బయటకు వెళ్లినవారు ఇంటికి సురక్షితంగా తిరిగి రావాలి. మనందరిదీ అదే లక్ష్యం కావాలి" అంటున్న మృదుల్ ప్రయాణమిది.

"దుర్గాని తలుచుకుంటే 'తను దూరమై అప్పుడే పాతికేళ్ళు గడిచిపోయాయా?' అనిపిస్తుంది. తన నవ్వు ముఖం, ఆ చురుకుతనం ఇంకా కళ్ళముందు కదులుతూనే ఉన్నాయి. 'మమ్మీ' అనే తన పిలుపు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. మా జీవితాల్ని మార్చేసిన ఒక దుర్ఘటన గురించి చెప్పే ముందు... మా కుటుంబం గురించి చెప్పాలి. మాది రాజస్థాన్‌లోని జైపూర్. నాకు బాల్యం నుంచి సాహిత్యం అంటే ఆసక్తి. రచయిత్రిని కావాలనుకొనేదాన్ని. జైపూర్‌లో ఎం.ఏ. అయ్యాక... అమెరికాలోని ఎమోరీ యూనివర్సిటీ నుంచి అమెరికన్ సాహిత్యంలో పిహెచ్‌డి చేశాను. ఐటీసీ గ్రూప్‌లో పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌గా చేరాను. నా భర్త ప్రమోద్ సొంత వ్యాపారం నిర్వహించేవారు. మాకు ఇద్దరు పిల్లలు, శాంతను, దుర్గా. చిన్నప్పటి నుంచీ దుర్గా చురుకైనది. చదువులో ఫస్ట్. క్రీడల్లో ఫస్ట్ కథక్ నృత్యంలో ప్రావీణ్యత సంపాదించడమే కాదు... ఆ నృత్య రీతి ద్వారా కథలు చెప్పే 'కథాకార్' సంప్రదాయంలోనూ శిక్షణ పొందింది. ఆమె కలలు, మా బతుకులు ఒకేసారి కుప్పకూలిపోతాయని అప్పుడు మేం ఊహించలేదు.

ఆ టీచర్ రూపంలో...

అది 1999 మే మూడో తారీకు. కాలేజీకి వెళ్తున్న పదిహేడేళ్ళ దుర్గాను... వెనుక నుంచి వస్తున్న ప్రభుత్వ స్కూల్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదానికి కారకుడైన ఆ గవర్నమెంట్ డ్రైవర్ అప్పటికి కొన్ని నెలల కిందటే తాగి వాహనం నడిపి సస్పెండ్ అయ్యాడు. ముందురోజే మళ్ళీ డ్యూటీలో చేరి, ఈ యాక్సిడెంట్ చేశాడు. ప్రమాదంలో దుర్గాకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆ డ్రైవర్, బస్సులోని టీచర్లు, రోడ్డుపై జనం... చూస్తూ నిలబడ్డారే తప్ప.. ఒక్కరూ దుర్గాకు సాయం చెయ్యడానికి ముందుకు రాలేదు. అంబులెన్స్‌కైనా ఫోన్ చెయ్యలేదు. పోలీసులు వచ్చి ఆమెను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దుర్గా ప్రాణాలు పోయాయి. ఆ వార్త తెలిసి మేం కుప్పకూలిపోయాం. ఎందరో వస్తున్నారు. ఓదార్చి, ధైర్యం తెచ్చుకోవాలని చెప్పి వెళుతున్నారు. నిర్లిప్తతలోనే కొన్నాళ్ళు గడిచింది. అలాగే ఉంటే ఏమైపోయేవాళ్ళమో! కానీ దుర్గా టీచర్ సందీప్ సేఠీ రూపంలో... భగవంతుడు మా బాధను కొంతైనా మరచిపోయే మార్గం చూపించాడు. "మీ అమ్మాయి మీ జ్ఞాపకాల్లో ఎప్పుడూ శాశ్వతంగానే ఉంటుంది. కానీ ఆమెకు జరిగిన ప్రమాదంలో తప్పెవరిది? నిబంధనలు పాటించని డ్రైవర్‌దా? ఫిట్‌నెస్‌ను నిర్ధారించకుండా వాహనం నడిపేందుకు అనుమతించిన స్కూలు వర్గాలదా? అధికారులదా? వేడుక చూస్తూ ఉండిపోయిన ప్రజలదా? నా దృష్టిలో అందరూ అపరాధులే. నాకు ఆప్తులైన చాలామంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. ఈ దుర్ఘటనలను కొంతమేరకైనా ఆపాలంటే.. సమాజంలో అవగాహన కల్పించాలి. దాని కోసం మీరొక ఎన్జీవో ఎందుకు ఏర్పాటు చేయకూడదూ?" అని అడిగారు.

ఆ సూచన మాకు ఎంతగానో నచ్చింది. 'ముస్కాన్ ఫౌండేషన్ ఫర్ రోడ్ సేఫ్టీ'కి అలా బీజం పడింది. రహదారి భద్రతపై అవగాహన, శిక్షణ, సూచనలు అందించడానికి కృషి చేసే లాభాపేక్షలేని ఛారిటబుల్ ట్రస్ట్‌గా 2001లో దాన్ని రిజిస్టర్ చేశాం. 'ఏదైనా పని తలపెట్టినప్పుడు... పూర్తిగా దానిమీదే దృష్టి పెట్టాలి. అప్పుడే దానికి న్యాయం చెయ్యగలం' అనేది నా విశ్వాసం. అందుకే ఉద్యోగం మానేశాను. సమయం అంతటినీ ట్రస్టుకే కేటాయిస్తున్నాను. కొన్నాళ్ళ తరువాత నా భర్త ప్రమోద్ కూడా ట్రస్టుకే అంకితమయ్యారు. మా అబ్బాయి శాంతను వారానికి మూడు రోజులపాటు మాతో కలిసి పని చేస్తున్నాడు.



ఎన్నో వర్గాల భాగస్వామ్యం

ట్రాఫిక్, రవాణా, రహదారి భద్రతలకు సంబంధించి మనం నిర్లక్ష్యం చేస్తున్న అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని ప్రజలకు వివరించి, చైతన్య పరచడం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రపంచంలోని రోడ్డు ప్రమాదాల్లో 11 శాతం మన దగ్గరే చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రహదారి భద్రతపై అన్ని వర్గాలవారూ మరింత దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఉంది. దానికోసం మా కార్యకలాపాల్లో పోలీసులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను, సాధారణ ప్రజానీకాన్నీ భాగస్వాములుగా చేశాం. ట్రాఫిక్ పోలీసులు, రహదారి భద్రతా నిపుణులు, విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకొని... బడి పిల్లలకు బోధించడానికి ఒక ప్రణాళిక తయారు చేశాం. రోడ్ షోలు, వీధి నాటకాలు, పాటలు, పప్పెట్ షోలు, ఇంద్రజాల ప్రదర్శనలు లాంటి వాటి ద్వారా రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తున్నాం. 2020లో మొదటిసారిగా దాదాపు పదిహేను సంస్థలు, ప్రభుత్వ విభాగాలతో కలిసి రోడ్డు ప్రమాదాల్లో మరణించినవారికి నివాళిగా ఒక కార్యక్రమం నిర్వహించాం. ఆ కార్యక్రమంలో... బాధిత కుటుంబాలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. రాజస్థాన్‌లోనే కాదు, ఇతర ప్రాంతాల్లో కూడా ప్రజల్లో చైతన్యం తేవడానికి మా ట్రస్ట్ ఇలాంటి కార్యక్రమల ద్వారా ప్రయత్నిస్తోంది. ప్రమాదాలకు సాక్షులుగా ఉన్నవారు 'తమకెందుకులే' అని నిర్లిప్తంగా ఉండడానికి ప్రధాన కారణం... పోలీస్ స్టేషన్లకూ, కోర్టులకూ వెళ్ళాల్సి ఉంటుందన్న బెరుకు, ప్రమాదకారకుల నుంచి ముప్పు కలుగుతుందేమోననే భయం. వాటిని పోగొట్టడానికి పటిష్ఠ చట్టాలు అమలు కావాల్సిన అవసరం ఉంది. దానికోసం వివిధ సంస్థలతో కలిసి పని చేస్తున్నాం.

సమాజాన్ని కోరుతున్నది అదే...

ఈ రంగంలో ఇంతకాలంగా పని చేస్తున్న ఎన్జీవో దేశంలో మాదే. ప్రమాద సమయాల్లో తక్షణ సాయం అందే మౌలిక సదుపాయాల కోసం, వాహన చోదకుల ప్రవర్తనల్లో మార్పు కోసం దక్షిణాసియాలో పని చేస్తున్న వారిలో ఒకరుగా నన్ను పలు సంస్థలు గుర్తించాయి. అయితే మాలాంటి వారు ఎన్ని కార్యక్రమాలు నిర్వహించినా... పౌర చైతన్యం, వాహనాలు నడిపేవారి ధోరణుల్లో మార్పు రాకపోతే ప్రయోజనం ఉండదు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం, అతి వేగం, నిర్లక్ష్యం, నియమాలు ఉల్లంఘనలతో వాహనాలు నడిపేవారు బాధిత కుటుంబాల వేదన గురించి ఆలోచించాలి. వాహనచోదకులు కూడా తాము లేకపోతే తమ కుటుంబం పరిస్థితి ఏమిటనేది దృష్టిలో పెట్టుకోవాలి. మా అమ్మాయి దుర్గా ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. ఎవరికైనా బాధ కలిగితే అల్లాడిపోయేది. ఆమె స్ఫూర్తిని కొనసాగించడం, సురక్షిత ప్రయాణం గురించి వీలైనంతగా ప్రచారం చెయ్యడం ద్వారా అందరి ముఖాల్లో చిరునవ్వులు చూడాలన్నదే మా తాపత్రయం."

స్వశక్తి

అప్పుడు గాల్లో తేలినట్టు ఉంటుంది!

నాన్న చెప్పినట్టు లాయర్‌గా కేసులు వాదించాలా..? మనసు కోరుకున్నట్టు కెమెరా ముందు అభినయించాలా..? ఆమె ముందు రెండు దారులు... చివరకు మనసు మాటే విన్నది చాందినీ భబ్దా. ఇప్పుడు అదే ఆమెను రొటీన్ ఉద్యోగాలకు భిన్నంగా... నలుగురిలో ప్రత్యేకంగా నిలబెట్టింది. కామెడీ కంటెంట్ క్రియేటర్‌గా... మిమిక్రీ ఆర్టిస్ట్‌గా... లక్షల మందికి నెట్టింట వినోదాన్ని పంచుతున్న 24 ఏళ్ల చాందినీ జర్నీ ఇది...

"చెబితే నమ్మరు కానీ... పదేళ్ల కిందటే నేను ఈ కంటెంట్ రూపొందించడం మొదలుపెట్టాను. అంటే నేను బడికి వెళ్లే రోజుల్లో. యూట్యూబ్ చానల్స్, ఇన్‌స్టాల వంటి వాటిపై అప్పుడు నాకు పెద్దగా అవగాహన కూడా లేదు. కెమెరా ముందు నిల్చొని ఏదో నాకు నచ్చింది... నాకు తోచింది... చేసుకొంటూ వెళ్లిపోయాను. ఎలా అబ్బిందో తెలియదు కానీ... నాకు మిమిక్రీ అంటే చాలా ఇష్టం. టీవీల్లో సినిమాలు చూస్తూ... వాటిలో డైలాగులు అనుకరించేదాన్ని. నాకు బాగా నచ్చిన తార అలియాభట్. ఆమె మీద ఉన్న ఇష్టంతో ఆమె చిత్రాల్లోని డైలాగులతో వీడియోలు చేసేదాన్ని. స్కూల్లో మా టీచర్లను, స్నేహితుల్లా హావభావాలు ప్రదర్శించేదాన్ని. అలా పదిహేనేళ్ల వయసులో మొదలుపెట్టిన మిమిక్రీ వీడియోలు ఇవాళ నన్ను మరో స్థాయికి తీసుకువెళ్లాయి. లక్షలమంది ఆదరణకు కారణమయ్యాయి.

చదువుకొంటూనే...

నా అభిరుచే నా కెరీర్ అవుతుందని ఎన్నడూ ఊహించలేదు. నేను పుట్టి పెరిగింది ముంబయిలో. మా నాన్న క్రిమినల్ లాయర్. ఆయన స్ఫూర్తితోనే నేను కూడా లాయర్ కావాలనుకున్నాను. అయితే నాకు స్కూల్లో ఎక్కువ స్నేహితులు ఉండేవారు కాదు. నాలో నేనుగా... ఒంటరిగానే గడిపేదాన్ని. ఆ సమయంలో నాకున్న ఒకే ఒక్క ప్రియ నేస్తం... కెమెరా. నటనంటే నాకు విపరీతమైన ఇష్టం. సినిమాల్లోని ఓ సన్నివేశాన్ని తీసుకొని... వారి గొంతుతో మిమిక్రీ చేస్తూ, సరదాగా నటించేదాన్ని. ఇదంతా రికార్డు చేసుకొనేదాన్ని. చదువుతో పాటు ఒక పక్క ఇవన్నీ నడుస్తూ ఉండేవి. వీడియో జాకీగా కొన్నాళ్లు పని చేశాను. చాలా లైవ్ షోలకు యాంకర్‌గా వ్యవహరించాను.

నచ్చింది చేయాలని...

ఎప్పుడూ నా లోకంలో నేను ఉండేదాన్ని. ఇంట్లో అమ్మానాన్నలు కూడా నాకు స్వేచ్ఛనిచ్చారు. ఎందుకంటే.. వారి ఆకాంక్షకు తగ్గట్టుగా చదివేదాన్ని. వీటన్నిటి నేపథ్యంలో నాకు అర్థమైంది ఏంటంటే.. కంటెంట్ క్రియేషన్‌లో స్వేచ్ఛ ఉంటుందని... దాని ద్వారా ఎదుటివారి మోముపై నవ్వులు పూయించవచ్చని! ఈలోగా నా ఐదేళ్ల లా పూర్తయింది. అప్పుడు నా ముందు ఉన్నవి రెండు దారులు... నాన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ... ఆయన ఆకాంక్షను గౌరవిస్తూ లాయర్‌గా కొనసాగడం. రెండోది... నా మనసుకు నచ్చినట్టు కెమెరా ముందు నటనాభినయంతో నలుగురినీ నవ్వించడం. ఎటు వైపు వెళ్లాలి? నేను నా మనసు చెప్పిన బాటలోనే నడిచాను. నిజంగా తేల్చుకోవడం చాలా క్లిష్టమైన విషయం. పెద్దవాళ్లు చూపిన మార్గాన్ని తోసిపుచ్చలేం. ఎందుకంటే తమ పిల్లల బంగారు భవిష్యత్తు గురించే వాళ్లు కలలు కంటారు. మన ఎదుగుదలలోనే వారి సంతోషాన్ని వెతుక్కొంటారు. అంతే తప్ప వాళ్ల మాటే చెల్లుబాటు కావాలనే పట్టుదలతో కాదు. అది నేను అర్థం చేసుకోగలను. అదే సమయంలో మన మనసు మాట కూడా వినడం ముఖ్యం. అందుకే వారి కోణం నుంచి కూడా ఆలోచించి... నా అభిరుచి గురించి వివరించాను. వాళ్లు అంతే పెద్ద మనసుతో నన్ను అర్థం చేసుకున్నారు. నా మార్గం నేను నిర్మించుకోవడానికి స్వేచ్ఛనిచ్చారు. అన్నిటికీ మించి ఉదయం ఐదింటికి వెళ్లి సాయంత్రం ఐదింటికి వచ్చే మూస ఉద్యోగాలు నాకు అస్సలు నచ్చవు. ఎప్పుడూ కొత్తదనం ఉండాలనుకొంటాను.

ప్రయత్నించి చూద్దామని...

అమ్మా నాన్నల అంగీకారంతో... నాకు ఇష్టమైన కంటెంట్ సృష్టించే మార్గంలో నా అన్వేషణ మొదలైంది. అప్పటికే లెక్కకు మించి యూట్యూబ్ చానల్స్ ఉన్నాయి. వాటిని దాటి నా వరకు రావాలంటే.. నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి కదా. దాన్ని దృష్టిలో పెట్టుకుని... ఎప్పటికప్పుడు విభిన్నమైన కంటెంట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నా. కెమెరా నాకు కొత్తేమీ కాదు. నెటిజనులకు ఏమి కావాలో తెలుసుకోగలిగితే చాలు. కొన్నాళ్లు ప్రయత్నించి చూద్దామనుకున్నా. ఒకవేళ విజయం సాధించలేకపోతే ఎలాగూ చేతిలో లా డిగ్రీ ఉంది కదా. ఆ ధైర్యంతోనే మొదలు పెట్టాను. అమ్మానాన్నలను రెండేళ్ల సమయం ఇవ్వమని కోరాను. ఈ రెండేళ్లలో నేను అనుకున్నది సాధించలేకపోతే తరువాత మీరు ఎటు నడవమంటే అటు నడుస్తానని చెప్పాను. అదృష్టం కావచ్చు... నా కంటెంట్‌లో కొత్తదనం కావచ్చు... మొత్తానికి 'చాందిని మిమిక్' పేరుతో నేను ప్రారంభించిన యూట్యూబ్ చానల్‌కు విశేషం ఆదరణ లభించింది.



అలియాభట్‌లా...

నావన్నీ సరదాగా సాగిపోయే వీడియోలే. ముఖ్యంగా బాలీవుడ్ అందాల తార అలియాభట్‌ను అనుకరిస్తూ చేసే ఏకపాత్రాభినయాలు అధికం. నటనలో, మిమిక్రీలో ఎక్కడా శిక్షణ తీసుకోలేదు. యూట్యూబ్‌లో పాఠాల కోసం వెతకలేదు. నాకు నేనుగా నేర్చుకున్నాను. ఏడేళ్ల కిందట ప్రారంభించిన నా యూట్యూబ్ చానల్‌కు ఇప్పుడు దాదాపు రెండున్నర లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధిక వీడియోలకు లక్ష పైనే వ్యూస్ వచ్చాయి. 250కి పైగా వీడియోలు అప్‌లోడ్ చేశాను. ఇన్‌స్టాగ్రామ్‌లో నాలుగున్నర లక్షలమందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. అందులో రీల్స్‌కు కూడా విశేష ఆదరణ లభిస్తోంది. 'తరువాతి వీడియో ఎప్పుడు పెడతారు' అని నెటిజనులు ఆసక్తిగా అడుగుతుంటే... అది నాకు ఎంతో ప్రేరణగా అనిపిస్తుంది. బాలీవుడ్ స్టార్స్ నుంచి అప్పుడప్పుడూ అభినందనలు అందుతుంటాయి. అప్పుడైతే గాల్లో తేలిన అనుభూతి కలుగుతుంది.

ఆదాయం... ఆనందం...

ఏదీ నేను ముందుగా అనుకొని చేయను. ఏదైనా మంచి ఆలోచన తడితే... వెంటనే డ్రెస్ మార్చేసుకొని షూటింగ్ మొదలుపెట్టేస్తాను. దీనివల్ల విభిన్నమైన కంటెంట్ వస్తుంది. బహుశా అదే నా ప్రత్యేకత అనుకొంటున్నాను. ఒక ప్రణాళిక వేసుకొని... దాని ప్రకారం వెళితే రొటీన్ అయిపోతుందనేది నా అభిప్రాయం. చాలా బ్రాండ్ల ఉత్పత్తులకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నాను. ఇటీవల 'అమెజాన్ మినీ టీవీ'లో వచ్చిన కామెడీ షో 'కానిస్టేబుల్ గిరప్దే'లో నటించాను. ప్రస్తుతం కార్పొరేట్ ఉద్యోగానికి మించి సంపాదిస్తున్నాను. నాకు నచ్చింది నాకు కుదిరినప్పుడు నేను చేసుకొంటున్నాను. ఈ సంతృప్తిని... ఈ స్వేచ్ఛనే నేను కోరుకున్నది."

నవ్య | చిత్రజ్యోతి



అయోధ్య రాముడికి హను-మాన్ 2.6 కోట్లు

ప్రస్తుతం బాక్సాఫీస్ దగ్గర 'హను-మాన్' ప్రభంజనం వీస్తోంది. భారీ వసూళ్లతో ఈ సినిమా దూసుకుపోతోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే దాదాపుగా 150కోట్ల గ్రాస్ వసూళ్లను ఈ సినిమా రాబట్టిందని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. 'హను-మాన్' విజయానందాన్ని వెలిబుచ్చుతూ, రెండుకోట్ల 66లక్షల 41వేల 55 రూపాయిల మొత్తాన్ని అయోధ్యలో శ్రీరామ చంద్రమూర్తి విగ్రహ ప్రాణప్రతిష్ఠామహోత్సవ శుభసందర్భంలో, అయోధ్య రామమందిరానికి అందజేయనున్నట్టు 'హను-మాన్' చిత్రబృందం ప్రకటించింది. అమ్ముడైన టికెట్ ధర నుంచి 5రూ.ని అయోధ్య రామాలయానికి అందిస్తామని విడుదలకు ముందే నిర్మాత ప్రకటించిన విషయం తెలిసిందే. మాట నిలబెట్టుకుంటూ.. ఇప్పటివరకూ విక్రయించిన 53లక్షల 28వేల 211 టికెట్లలో, ఒక్కో టికెట్ నుంచి 5రూ. చొప్పున మొత్తం రెండుకోట్ల 66లక్షల 41వేల 55 రూపాయిలు రామమందిరానికి నిర్మాత అందించనున్నారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాత నిరంజన్‌రెడ్డి, దర్శకుడు ప్రశాంత్‌వర్మ, కథానాయకుడు తేజా సజ్జా ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఉత్కంఠభరితంగా ఉర్వి



మహేశ్, శ్రుతీశంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఉర్వి'. కిరణ్ వై దర్శకుడిగా పరిచయమవుతున్నారు. గిరి పయ్యావుల నిర్మాత. ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్, నవీన్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'తెలంగాణ నేపథ్యంలో రూపొందిన హారర్ చిత్రమిది. నేటి సమాజం ఎదుర్కొంటున్న ఓ సమస్యను తీసుకొని ఆసక్తికరంగా తెరకెక్కించాం. మూడు పాటలూ, నేపథ్య సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని తెలిపారు. అంతా కొత్తవాళ్లమే అయినా కష్టపడి సినిమాను తెరకెక్కించాం అని మహేశ్ చెప్పారు. ఈ చిత్రానికి లక్ష్మణ సాయి సంగీతం అందిస్తున్నారు.

స్ఫూర్తినిచ్చే కథతో 'కంచర్ల'



సమాజానికి స్ఫూర్తినిచ్చే కథతో రూపుదిద్దుకుంటున్న 'కంచర్ల' చిత్రం టాకీ పార్ట్ పూర్తి చేసుకుంది. కంచర్ల ఉపేంద్ర హీరోగా, మీనాక్షి జైస్వాల్, ప్రణీత హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి రెడ్డెం యాదకుమార్ దర్శకుడు. చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు చిత్ర వివరాలు వెల్లడిస్తూ 'యువత రాజకీయాల్లోకి రావాలని, భూస్వాముల దగ్గరున్న భూమిని పేద ప్రజలకు పంచాలన్నది ఈ చిత్రకథాంశం. దీనికి కమర్షియల్ అంశాలు జోడించి ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ప్రస్తుతం పాటల చిత్రీకరణ కేరళ, గోవా, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లో జరుగుతోంది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి' అన్నారు. 'ఉపేంద్రగాడి అడ్డా' చిత్రంతో తను ప్రేక్షకులకు దగ్గరయ్యానని, ఈ సినిమాతో మరింత గుర్తింపు తెచ్చుకుంటాననీ హీరో ఉపేంద్ర చెప్పారు. సామాజిక స్పృహతో సమాజాన్ని జాగృతం చేసే అంశాలను ఇందులో పొందుపరుస్తున్నట్లు దర్శకుడు యాదకుమార్ తెలిపారు. సుమన్, అజయ్ ఘోష్, కాశీ విశ్వనాథ్, సుధ, రాజా రవీంద్ర, సుమన్ శెట్టి, దువ్వాసి మోహన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రఘు కుంచె, ఫొటోగ్రఫీ: గుణశేఖర్, మాటలు: ప్రసాదుల మధుబాబు, సహ నిర్మాతలు: కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత.

బాలరాముడికి అంకితం



తేజేశ్వర్, ప్రజ్ఞ నయన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మిషన్ సి 1000'. కబీర్‌సింగ్, సంజయ్ పాండే, అనీష్ కురువిల్లా కీలకపాత్రలు పోషించారు. తేజేశ్వర్ దర్శకుడు. ఎస్ వీ క్రియేషన్స్ బేనర్‌పై నిర్మించారు. ఈ చిత్రం నుంచి శ్రీరాముని గుణాలను కీర్తిస్తూ సాగే ప్రత్యేక గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. శ్రీధర్ ఆత్రేయ స్వరాలందించగా, విజయ్ ప్రకాశ్ ఆలపించారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ పాటను బాల రాముడికి అంకితం ఇస్తున్నామని తేజేశ్వర్ తెలిపారు. మార్చిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని యూనిట్ తెలిపింది. సినిమాటోగ్రఫీ: సుధాకర్.



నటరత్నాల క్రైమ్ కామెడీ..

ఇనయ సల్తానా, సుదర్శన్‌రెడ్డి, 'రంగస్థలం' మహేశ్, తాగుబోతు రమేశ్ ప్రధానపాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'నటరత్నాలు'. శివనాగు ఈ చిత్రానికి దర్శకుడు. చంటి యాలమాటి నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను ఘనంగా విడుదల చేశారు. 'క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కావల్సినంత వినోదాన్ని పంచుతుంది. సినిమా తీయాలనే ఆశతో పరిశ్రమకు వచ్చినవాళ్లు ఎలా విఫలమవుతున్నారు? ఎలా సఫలమవుతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. అడిగినవన్నీ సమకూర్చిన నిర్మాతకు, అన్ని విధాలా సహకరించిన యూనిట్ సభ్యులకూ థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను' అని దర్శకుడు శివనాగు అన్నారు. సినిమా విజయం పట్ల నిర్మాత ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన నిర్మాతలు దామోదరప్రసాద్, టి.ప్రసన్నకుమార్, డి.ఎస్.రావు, రామసత్యనారాయణ దర్శకులు కె.ఎస్.రవికుమార్‌చౌదరి, సముద్ర కూడా మాట్లాడారు.

కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్నాం

రాజు దుస్సా

'పాటలు, ఫైట్లు, కామెడీ లాంటివి లేకుండా ఒక కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా '105 మినిట్స్'. డైలాగ్స్ కూడా ఉండవు. అయినా ప్రేక్షకులను అలరిస్తుంది' అని దర్శకుడు రాజు దుస్సా అన్నారు. హన్సిక లీడ్‌రోల్‌లో రాజు దుస్సా తెరకెక్కించిన ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా రాజు దుస్సా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



- స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు బలం. తర్వాత ఏం జరుగబోతోందో ప్రేక్షకులు ఊహించలేరు. ఒక కనిపించని మనిషి పంచభూతాలను గుప్పిట్లో పెట్టుకొని ఓ అమ్మాయిని ఇబ్బందిపెట్టే క్రమంలో ఏం జరిగిందనేది ప్రధాన కథ.
- ఒకటే పాత్రపైన లెంగ్తీ షాట్ తీస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచన నుంచి '105 మినిట్స్' చిత్రం పుట్టింది. సింగిల్ క్యారెక్టర్‌తో రెండున్నర గంటలు ప్రేక్షకులను కూర్చోబెడతాం. ప్రేక్షకులకు రియల్ టైంలో ఎదురుగా కూర్చొని చూస్తున్న అనుభూతినిస్తుంది.
- మా సినిమాటోగ్రాఫర్ ఇచ్చిన సూచనతో ఈ సినిమాకు సింగిల్ షాట్ అనే కాన్సెప్ట్ జతయ్యింది. దీనికి చాలా గ్రౌండ్ వర్క్ చేశాం. హన్సిక కథ వినగానే ఓకే చెప్పారు. చెప్పింది చెప్పినట్లు చేసుకుంటూ వెళ్లారు. ఇందులో ఆమె నటన ప్రేక్షకుల్ని కట్టిపడేస్తుంది.



కొరియా జోడీకి టైటిల్
సింగిల్స్ విజేతలు షి యు కి, తై జు యింగ్
ఇండియా ఓపెన్

సాత్విక్/చిరాగ్ రన్నరప్‌తో సరి



న్యూఢిల్లీ: స్వదేశంలో టైటిల్ ఫేవరెట్‌గా బరిలో దిగిన స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నీలో రన్నరప్‌గానే సరిపెట్టుకుంది. అయితే ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రత్యర్థి ద్వయం, వరల్డ్ చాంపియన్స్ కాంగ్ మిన్ యుక్/సొ సెంగ్ జే (కొరియా)కి భారత జోడీ సులువుగా లొంగలేదు. 65 నిమిషాలు ఉత్కంఠ భరితంగా జరిగిన టైటిల్ ఫైట్‌లో సాత్విక్/చిరాగ్ 21-15, 11-21, 18-21తో కొరియా జంట చేతిలో పరాజయం చవిచూశారు. ఈ సీజన్‌లో రెండో టోర్నీలోనూ భారత ద్వయం రన్నరప్‌గానే నిలిచింది. గతవారం జరిగిన మలేసియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లోనూ సాత్విక్/చిరాగ్ ఫైనల్లో ఓటమి చవిచూసిన సంగతి తెలిసిందే. మరోవైపు కొరియా జోడీ ఎప్పుడూ భారత ద్వయానికి కొరకరాని కొయ్యగానే ఉంటోంది. రెండు జోడీలు ఐదుసార్లు పరస్పరం తలపడితే మనోళ్లు ఒక్కసారే గెలవడం గమనార్హం. ఇక..ఈ ఫైనల్ తొలి గేమ్‌లో అద్భుతమైన నెట్ గేమ్‌తో ప్రత్యర్థిని బెంబేలెత్తించిన సాత్విక్/చిరాగ్ 11-9తో ఆపై 19-13తో ఆధిక్యం ప్రదర్శించడంతోపాటు అదే ఊపులో గేమ్‌ను సొంతం చేసుకున్నారు. కానీ రెండో గేమ్‌లో భారత ద్వయం ఆట దిగజారగా..ఇదే అదనుగా విజృంభించిన కాంగ్/సెంగ్ ఆ గేమ్‌ను చేజిక్కించుకుంది. నిర్ణయాత్మక గేమ్ మళ్లీ పుంజుకున్న భారత్ జోడీ ప్రత్యర్థిని ముప్పు తిప్పలు పెట్టింది. విరామం తర్వాత రెండు జోడీలు తగ్గేదేలే అనేలా ఆడడంతో ఆధిక్యం తరచూ చేతులు మారుతూ వచ్చింది. చివరగా కొరియా జోడీదే పైచేయి అయింది. మహిళల సింగిల్స్‌లో తై జు యింగ్ విజేతగా నిలిచింది. ఫైనల్లో తైపీ అమ్మాయి తై జు 21-16, 21-12తో రెండో సీడ్ చెన్ యూఫీ (చైనా) చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్ తుది పోరులో వరల్డ్ నెం2 షి యు కి 23-21, 21-17తో లీ చుక్ ఇయు (హాంకాంగ్)ని ఓడించి టైటిల్ అందుకున్నాడు.




ఆస్ట్రేలియన్ ఓపెన్

సబలెంక

జోకో.. అలవోకగా

- క్వార్టర్స్‌లో ప్రవేశం
- సబలెంక, గాఫ్ సైతం
- పోరాడి నెగ్గిన రుబ్లెవ్



జొకోవిక్

మెల్‌బోర్న్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన వరల్డ్ నెంబర్‌వన్ నొవాక్ జొకోవిక్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. అలాగే మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్, రష్యన్ బ్యూటీ సబలెంక, నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా)సైతం తమ ప్రత్యర్థులపై నెగ్గారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో జొకో 6-0, 6-0, 6-3 తేడాతో ఆడ్రియన్ మన్నారినో (ఫ్రాన్స్)ను చిత్తుగా ఓడించాడు. సెర్బియా సూపర్‌స్టార్‌కిది 58వ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్. దీంతో గతంలో ఇదే ఫీట్‌తో టాప్‌లో ఉన్న రోజర్ ఫెడరర్‌తో జొకో సమంగా నిలిచాడు. అలాగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా ఇది 32వ విజయం. బుధవారం జరిగే క్వార్టర్స్‌లో అతను టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో తలపడతాడు. గంటా 44 నిమిషాలపాటు సాగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో 17 ఏస్‌లతో బెంబేలెత్తించిన జొకో ఏడు బ్రేక్ పాయింట్లు సాధించాడు. తొలి 13 గేమ్‌లపాటు జొకోవిక్‌కు ఎదురులేకుండా పోయింది. ఆఖరి సెట్‌లో మాత్రం మన్నారినో మూడు గేమ్‌లతో ఉనికి చాటుకున్నాడు. ఇక ఇతర సింగిల్స్ నాలుగో రౌండ్లో ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6-4, 6-7, 6-7, 6-3, 6-0తో అలెక్స్ డి మినార్ (ఆసీస్)పై చెమటోడ్చి నెగ్గాడు. అలాగే గతేడాది సెమీఫైనలిస్ట్, ఏడో సీడ్ స్టెఫనోస్ సిట్సిపాస్ (గ్రీస్)కు షాక్ తగిలింది. అతడిపై టేలర్ ఫ్రిట్జ్ 7-6, 5-7, 6-3, 6-3 తేడాతో గెలవగా, నాలుగో సీడ్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ) 6-4, 7-5, 6-3తో ఖచనోవ్ (రష్యా)పై నెగ్గాడు.

మహిళల సింగిల్స్‌లో: డిఫెండింగ్ చాంపియన్ ఎరీనా సబలెంక ఎలాంటి పోటీ లేకుండా 6-3, 6-2 తేడాతో అమండా అనిసిమోవా (అమెరికా)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించింది. అలాగే గాఫ్ 6-1, 6-2తో మగ్దలేనా ఫ్రెక్ (పోలెండ్)పై, తొమ్మిదో సీడ్ క్రెజికోవా (చెక్) 4-6, 6-3, 6-2తో ఎండ్రీవా (రష్యా)పై, కోస్త్యుక్ (ఉక్రెయిన్) 6-2, 6-1తో టిమోఫీవా (రష్యా)పై గెలిచి ముందంజ వేశారు.



తలైవాస్ అదుర్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రైడర్లు నరేందర్ (14 పాయింట్లు), అజింక్యా పవార్ (11 పాయింట్లు) చెలరేగడంతో ప్రో కబడ్డీలో తమిళ్ తలైవాస్ జట్టు అదరగొట్టింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తలైవాస్ 45-28తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. బుల్స్ రైడర్ అక్షిత్ (12 పాయింట్లు) ఒంటరి పోరాటం వృథా అయింది. ఆట ప్రారంభంలోనే తలైవాస్ 10-7తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి 18-9తో స్పష్టమైన ఆధిక్యాన్ని తలైవాస్ సాధించింది. ద్వితీయార్థంలోనూ తలైవాస్ అదే జోరు కొనసాగించడంతో బుల్స్‌కు పరాభవం ఎదురైంది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 34-24తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.



మీది బజ్‌బాల్ ఐతే.. మాకు 'విరాట్‌బాల్'

న్యూఢిల్లీ: టెస్టు ఫార్మాట్‌లో ఇంగ్లండ్ జట్టు బజ్‌బాల్ వ్యూహంతో ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగుతుంటుంది. దీనికి దీటుగా భారత్ కూడా విరాట్‌బాల్ గేమ్‌తో వారిని అడ్డుకుంటుందని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ తెలిపాడు. 'విరాట్ ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అందుకే బజ్‌బాల్‌కు విరాట్‌బాల్‌తో కౌంటర్ ఇస్తాం. భారీ స్కోర్లను ఎలా సాధించాలో కోహ్లీకి తెలుసు. పరిస్థితి ఎలా ఉన్నా ఇంగ్లండ్ దూకుడుగానే ముందుకెళ్తుంటుంది. కానీ ఈ తరహా ఆట భారత్‌లో పనికొస్తుందో? లేదో? చూడాలి. ముఖ్యంగా వారు స్పిన్‌ను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికర అంశం' అని సన్నీ చెప్పాడు.

పాక్‌కు ఓదార్పు విజయం

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో ముగిసిన ఐదు టీ20ల సిరీస్‌లో పాకిస్థాన్ ఎట్టకేలకు విజయం రుచి చూసింది. ఆదివారం జరిగిన ఆఖరిదైన ఐదో మ్యాచ్‌లో పాక్ 42 పరుగులతో నెగ్గింది. అయితే ఈ సిరీస్‌ను కివీస్ 4-1తో దక్కించుకుంది. ముందుగా పాక్ 20 ఓవర్లలో 134/8 స్కోరు చేసింది. రిజ్వాన్ (38) టాప్‌స్కోరర్. స్వల్ప ఛేదనలో కివీస్ తడబడి 17.2 ఓవర్లలో 92 పరుగులకే కుప్పకూలింది. ఫిలిప్స్ (26), అలెన్ (22) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇఫ్తికార్‌కు 3 వికెట్లు దక్కాయి. అలెన్‌కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ లభించింది.



భారత్‌తో సిరీస్‌కు బ్రూక్ దూరం

లండన్: భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆరంభానికి ముందే ఇంగ్లండ్ జట్టుకు గట్టి షాక్ తగిలింది. మిడిలార్డర్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వ్యక్తిగత కారణాలతో ఈ సిరీస్‌కు దూరమవుతున్నట్టు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. ఈనెల 25 నుంచి జరిగే సిరీస్‌కు బ్రూక్ స్థానంలో డాన్ లారెన్స్‌ను తీసుకుంటున్నట్టు పేర్కొంది. బ్రూక్ ఆడిన 12 టెస్టుల్లో 62.15 అద్భుత సగటుతో 1181 పరుగులు సాధించాడు.

షోయబ్‌తో ఎప్పుడో విడాకులు తీసుకుంది



సానియా మీర్జా కుటుంబం వెల్లడి

న్యూఢిల్లీ: షోయబ్ మాలిక్‌తో సానియా మీర్జా గతంలోనే విడాకులు తీసుకుందని ఆమె కుటుంబం ఆదివారం స్పష్టంజేసింది. పాకిస్థాన్ నటి సనా జావెద్‌తో తన నిఖాకు సంబంధించిన ఫొటోను పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షోయబ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న నేపథ్యంలో..సానియా కుటుంబం స్పందించింది. 'తన వ్యక్తిగత జీవితంలో సానియా ఎప్పుడూ గోప్యతనే పాటించింది. కానీ ఇప్పుడు ఓ విషయాన్ని బహిర్గతం చేయాల్సిన సమయం వచ్చింది. సానియా, షోయబ్ కొన్ని నెలల క్రితమే విడిపోయారు' అని మీర్జా కుటుంబం విడుదలజేసిన ప్రకటనలో వెల్లడించింది. ఇక.. కొత్తగా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన షోయబ్‌కు సానియా శుభాకాంక్షలు తెలుపుతూ అతడి నూతన ప్రయాణం సాఫీగా సాగాలని కూడా ఆకాంక్షించినట్టు ఆ ప్రకటనలో తెలిపింది.

థిల్లాన్ జంటకు కాంస్యం

కువైట్: ఆసియా ఒలింపిక్ క్వాలిఫికేషన్ షాట్‌గన్‌లో యువ షూటర్ రైజా థిల్లాన్ జోడీ కాంస్యం పతకం సాధించింది. ఆదివారం జరిగిన మిక్స్‌డ్ స్కీట్ రెండో కాంస్య పోరులో థిల్లాన్-గుర్‌జోత్ కంగురా జంట 41-39తో కువైట్‌కు చెందిన అల్‌రషీద్ అబ్దుల్లా-అల్‌షమా ఎమాన్ జోడీపై గెలిచింది.

రవి కంచు 'పట్టు'



న్యూఢిల్లీ: ఒలింపిక్ రజత పతక విజేత రవికుమార్ దహియా ఫ్రాన్స్‌లోని నైస్‌లో జరిగిన గ్రాండ్ ప్రీ రెజ్లింగ్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పతకంతో సత్తా చాటాడు. 61 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు.



రికీ భుయ్ శతకం

గెలుపు దిశగా ఆంధ్ర ● అసోంతో రంజీ

డిబ్రూఘర్: ఆతిథ్య అసోంతో ఎలిట్ గ్రూప్-బి రంజీ పోరులో ఆంధ్ర జట్టు విజయం దిశగా సాగుతోంది. 363 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన అసోం..ఆదివారం ఆట ఆఖరికి 81/5తో ఓటమి దిశగా పయనిస్తోంది. కెప్టెన్ రియాన్ పరాగ్ (46) క్రీజులో ఉన్నాడు. గిరినాథ్ రెడ్డి మూడు, లలిత్ మోహన్ రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ 147/1 స్కోరుతో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 334 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రికీ భుయ్ (125) సెంచరీతో కదం తొక్కగా, హనుమ విహారి (63) అర్ధ శతకంతో సత్తా చాటాడు. రషీద్ (40 నాటౌట్) రాణించాడు. ఇక..తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 188, అసోం 160 రన్స్ చేసిన విషయం విదితమే.

బిజినెస్

మూలధన పెట్టుబడులకే అగ్రప్రాధాన్యం



మౌలిక వసతుల రంగానికి ఉత్తేజం
ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్

న్యూఢిల్లీ: దేశంలో ప్రైవేటు పెట్టుబడులు ఇప్పటికీ ప్రోత్సాహకరంగా లేకపోవటంతో బడ్జెట్లో ప్రభుత్వం మూలధన పెట్టుబడులను (క్యాపెక్స్) మరింతగా పెంచటంపై దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక వృద్ధిని ఉత్తేజితం చేయడం కోసం మౌలిక వసతులపైనే అధికంగా దృష్టి పెట్టే వీలుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.. ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాత్కాలిక బడ్జెట్ ప్రతిపాదించనున్నారు. కొవిడ్-19 తర్వాత ప్రభుత్వం క్యాపెక్స్‌కే ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా ఆర్థిక రంగం నిద్రాణ స్థితి నుంచి మేల్కొని పరుగులు తీయడం ప్రారంభించింది. ఫలితంగా గత మూడేళ్ల కాలంలో 7 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోంది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలన్నింటిలో ఇదే అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం మూలధన పెట్టుబడులకు రూ.10 లక్షల కోట్లు కేటాయించింది. 2020-21లో ఇది రూ.4.39 లక్షల కోట్లు కాగా 2022-23లో 35 శాతం పెంచి రూ.7.5 లక్షల కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్లో ఇది 37.4 శాతం పెరిగింది. ఆ రకంగా చూసినట్టయితే రాబోయే బడ్జెట్లో కూడా భారీ మొత్తంలో నిధులు ఇందుకు కేటాయించే ఆస్కారం ఉందన్నది కొందరి అంచనా. ప్రభుత్వం క్యాపెక్స్‌పై అత్యధికంగా దృష్టి సారిస్తుందని, దీనివల్ల వివిధ రంగాల్లో సామర్థ్యాలు ఉత్తేజితం అవుతాయని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం హెడ్ శేషాద్రి సేన్ అన్నారు. పెట్టుబడుల మద్దతుతో ఉత్పాదకత పెరిగి తద్వారా ఉపాధి కల్పన, డిమాండు, ఎగుమతులు జోరందుకుంటాయని, వీటన్నింటి ప్రభావం ఆర్థిక వృద్ధిపై ఉంటుందంటున్నారు.

ఇక్రా అంచనా ఇదీ...

అయితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం కాపెక్స్ కోసం రూ.10.2 లక్షల కోట్లు మాత్రమే కేటాయించే ఆస్కారం ఉన్నదని ఇక్రా అంటోంది. మూలధన పెట్టుబడిలో స్వల్ప వృద్ధి ప్రభావం ఆర్థిక కార్యకలాపాల పైన, జీడీపీ పైన ఉండవచ్చునంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరు నెలల మధ్య కాలంలో క్యాపెక్స్ 31 శాతం పెరిగి రూ.5.9 లక్షల కోట్లకు చేరింది. 2024 సంవత్సరపు బడ్జెట్ అంచనాల కన్నా ఇది 58.5 శాతం అధికం. వృద్ధి అత్యధికంగా ఉన్న కారణంగా పెట్టుబడి వ్యయాలు 2023 అక్టోబరులో 14.9 శాతం తగ్గాయి. గత ఏడాది ఏప్రిల్ తర్వాత ఇదే తొలి క్షీణత. కాగా నవంబరులో మాత్రం 1.6 శాతం పెరిగాయి. నెలవారీ సగటు క్యాపెక్స్ రూ.73,210 కోట్లు ఉంది.

బడ్జెట్లో నిర్దేశించిన రూ.10 లక్షల కోట్ల లక్ష్యం చేరాలంటే నెలవారీ సగటు రూ.83,400 కోట్లు ఉండాలి. భారత దేశం మౌలికంగా ఇన్‌ఫ్రా కొరత ఉన్న దేశం. ఈ లోటును పూడ్చడానికి ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తూ ఉంటుంది. ఇటీవల వృద్ధి పుంజుకోవడంతో కొన్ని రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులు ఊపందుకున్నాయి. వాటిలో స్టీల్, సిమెంట్, పెట్రోలియం రంగాలున్నాయి.


పారిశ్రామిక, లాజిస్టిక్ వసతులకు డిమాండ్ అదుర్స్

సీబీఆర్ఈ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామిక, లాజిస్టిక్ వసతులకు డిమాండ్ జోరుగా ఉంది. ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఏడాది డిమాండ్ 8 శాతం పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరిందని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ సీబీఆర్ఈ చెబుతోంది. 2022లో పారిశ్రామిక లాజిస్టిక్ వసతుల లీజింగ్ 3.6 కోట్ల చదరపు అడుగులుండగా 2023లో అది 3.88 కోట్ల చదరపు అడుగులున్నట్టు తాజా నివేదికలో తెలిపింది. ప్రధానంగా థర్డ్ పార్టీ లాజిస్టిక్ కంపెనీలే (3పీఎల్) ఈ డిమాండుకు కారణమని పేర్కొంది. 2023లో పారిశ్రామిక, లాజిస్టిక్ విభాగం లీజింగ్‌లో ఈ కంపెనీల వాటా 45 శాతం ఉంది. ప్రపంచ ఆర్థిక సవాళ్లను కూడా ఈ రంగాలు తట్టుకుని నిలబడ్డాయనేందుకు ఇది నిదర్శనమని సీబీఆర్ఈ చైర్మన్, సీఈఓ (ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా) అన్షుమన్ మాగజైన్ అన్నారు. ఈ-కామర్స్, రిటైల్, తయారీ రంగ కంపెనీలు సరఫరా వ్యవస్థ కార్యకలాపాలను 3పీఎల్ కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ ఇవ్వడమే అవి అధిక మొత్తంలో స్థలాలు లీజింగ్ తీసుకోవడానికి కారణమని ఆయన చెప్పారు. స్టోరేజి అవసరాలు, వ్యయ నియంత్రణ, కార్మిక శక్తిని సమీకరించడంలో గల కష్టాల నుంచి బయటపడేందుకే పెద్ద కంపెనీలన్నీ ఔట్‌సోర్సింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెబుతున్నారు. ఇంజనీరింగ్, తయారీ రంగ కంపెనీలో మొత్తం లీజింగ్‌లో 17 శాతం వాటా కలిగి ఉన్నాయి. అధిక నాణ్యత గల స్థలాలకు డిమాండ్ పెరగడంతో అలాంటి ప్రదేశాల్లో భూమి వ్యయాలు, అద్దెలు కూడా పెరిగాయని సీబీఆర్ఈ తెలిపింది.

హైదరాబాద్‌లో: నగరాలవారీగా చూస్తే పారిశ్రామిక, లాజిస్టిక్ స్థలాల డిమాండ్ ముంబైలో చారిత్రక గరిష్ఠస్థాయిలో ఉంది. 2023లో ముంబైలో 99 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజింగ్‌కు తీసుకున్నారు. 2022లో ఇది 73 లక్షల చదరపు అడుగులుంది. హైదరాబాద్‌లో డిమాండ్ 37 లక్షల చదరపు అడుగుల నుంచి 43 లక్షల చదరపు అడుగులకు పెరిగింది. అయితే ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, కోల్‌కతాల్లో డిమాండ్ క్షీణించగా చెన్నై, పుణె, అహ్మదాబాద్‌లలో పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ		విజయవాడ	550
హైదరాబాద్	531	విశాఖపట్నం	560
22 జనవరి		వరంగల్	533
చిత్తూరు	548	దజను గుడ్లు రూ.72	
గోదావరి	550		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	103
విశాఖపట్నం	101		

ఫిబ్రవరి 1 నుంచి కార్ల ధరల పెంపు

టాటా మోటార్స్

న్యూఢిల్లీ: ప్యాసింజర్ కార్ల ధరలను ఫిబ్రవరి 1 నుంచి పెంచుతున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) సహా మొత్తం ప్యాసింజర్ వాహన శ్రేణి ధరలను సగటున 0.7 శాతం మేర పెంచుతున్నట్లు వెల్లడించింది. ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోవటంతో ధరలను పెంచాల్సి వస్తోందని తెలిపింది.

నేడు మార్కెట్లకు సెలవు

అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం నాడు స్టాక్ మార్కెట్లకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సెలవు ప్రకటించాయి. మంగళవారం మార్కెట్లు యధావిధిగా కార్యకలాపాలు సాగిస్తాయి.

ఈ ఏడాదే న్యూ ఎనర్జీ గిగా కాంప్లెక్స్ ప్రారంభం

రిలయన్స్ ఇండస్ట్రీస్

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ఎనర్జీ గిగా కాంప్లెక్స్‌ను ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రారంభించనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ప్రకటించింది. జామ్‌నగర్‌లో 5,000 ఎకరాల్లో ఈ గిగా కాంప్లెక్స్‌ను రిలయన్స్ అభివృద్ధి చేస్తోంది. ఈ గిగా కాంప్లెక్స్‌లో ఫోటో వోల్టాయిక్ ప్యానల్స్, ఫ్యూయల్ సెల్ సిస్టమ్, గ్రీన్ హైడ్రోజన్, ఎనర్జీ స్టోరేజ్, పవర్ ఎలక్ట్రానిక్స్ కోసం ఐదు గిగా ఫ్యాక్టరీలను రిలయన్స్ ఏర్పాటు చేస్తోంది. న్యూ ఎనర్జీ గిగా కాంప్లెక్స్‌లో పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది ద్వితీయార్థంలో వీటిని ప్రారంభించాలని చూస్తున్నట్లు ఇన్వెస్టర్లతో జరిగిన ఎర్నింగ్స్ కాల్‌లో కంపెనీ వెల్లడించింది. ధీరూభాయ్ అంబానీ గ్రీన్ ఎనర్జీ గిగా కాంప్లెక్స్, ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత పునరుత్పాదక ఇంధన తయారీ కేంద్రంగా ఉండనుందని రిలయన్స్ పేర్కొంది. స్వచ్ఛమైన ఇంధనాలను అందించటంలో రిలయన్స్ న్యూ ఎనర్జీ బిజినెస్ కీలక పాత్ర పోషించనుందని తెలిపింది.

రూ.5 లక్షల కోట్ల పెట్టుబడితో 100 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్లను ఏర్పాటు చేయటానికి గుజరాత్ ప్రభుత్వంతో రిలయన్స్ ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. కాగా గ్రీన్ హైడ్రోజన్ కోసం కచ్ ప్రాంతంలో 74,750 హెక్టార్ల భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వంగా సూత్రప్రాయంగా అనుమతులు మంజూరు చేసింది.

21,850 పైన బుల్లిష్

(జనవరి 23-25 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ లైన్

గత వారం నిఫ్టీ: 21,572 (-322)

నిఫ్టీ గత వారం 22,124-21,360 పాయింట్ల మధ్యన కదలాడి 322 పాయింట్ల నష్టంతో 21,572 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 21,850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,499, 20,892, 19,944, 19,495 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,300
బ్రేక్‌డౌన్ స్థాయి: 21,500
నిరోధ స్థాయిలు: 21,775, 21,875, 21,975 (21,675 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,375, 21,275, 21,175 (21,475 దిగువన బేరిష్)

అమెరికా మార్కెట్లోకి కెంట్ ఆర్ఓ సిస్టమ్స్

వచ్చే మూడేళ్లలో రూ.2,000 కోట్ల టర్నోవర్ టార్గెట్

న్యూఢిల్లీ: వాటర్ ప్యూరిఫైయర్ తయారీదారు కెంట్ ఆర్ఓ సిస్టమ్స్.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమెరికా మార్కెట్లోకి అడుగుపెట్టనుందని కంపెనీ సీఎండీ మహేశ్ గుప్తా వెల్లడించారు. అంతేకాకుండా ఉత్పత్తుల పోర్టుఫోలియోను మరింగా పెంచుకోవటం ద్వారా వచ్చే మూడేళ్లలో రూ.2,000 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గడచిన మూడేళ్ల కాలంలో విస్తరణ కార్యకలాపాల కోసం రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టగా తాజాగా మరో రూ.300 కోట్లతో ఉత్తరప్రదేశ్‌లోని యమునా ఎక్స్‌ప్రెస్‌వే వద్ద కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు గుప్తా పేర్కొన్నారు. కాగా అమెరికా మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు యూఎస్‌కు చెందిన బ్లాక్ అండ్ డెకెర్ కంపెనీతో బ్రాండ్ లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆయన చెప్పారు. భారత్‌లో బ్లాక్ అండ్ డెకెర్ బ్రాండ్ కింద వాటర్ ప్యూరిఫైయర్లను తయారు చేసి అమెరికాకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కంపెనీ వాటార్ ప్యూరిఫైయర్స్‌తో పాటు ఎయిర్ ప్యూరిఫైయర్లు, వాక్యూమ్ క్లీనర్స్ కిచెన్ అప్లయెన్సెస్, కుక్‌వేర్ సహా మరికొన్ని ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తోంది.

స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన మదుపర్లు తమ డీమ్యాట్ ఖాతాలోని లావాదేవీలు, షేర్ల వివరాలను తమ ప్రాంతీయ భాషలో తెలుసుకోవడానికి ప్రాంతీయ భాషల్లోనే కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్లను సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్ఎల్) అందించనుంది. తెలుగు సహా 23 భాషల్లో స్టేట్‌మెంట్లను పొందవచ్చు. 1999లో ప్రారంభమైన సీడీఎస్ఎల్ వద్ద 10 కోట్ల డీమ్యాట్ అకౌంట్లు ఉన్నాయి.

- ఆంధ్రప్రదేశ్‌లో ఏజీ అండ్ పీ ప్రథమ్.. సీఎన్‌జీ గ్యాస్ నెట్‌వర్క్‌ను విస్తరించింది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాలో 14వ సీఎన్‌జీ ఫ్యూయలింగ్ స్టేషన్‌ను ప్రారంభించింది. ఈ సెంటర్‌తో రాష్ట్రంలో కంపెనీ మొత్తం స్టేషన్ల సంఖ్య 51కి చేరింది.

కన్సాలిడేషన్ ట్రెండ్

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభమైనా మానసిక అవధి 22,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమయింది. ఆ తర్వాత బలమైన కరెక్షన్‌లో పడినా 21,300 స్థాయిలో మైనర్ రికవరీ సాధించి చివరికి ముందు వారంతో పోల్చితే 320 పాయింట్ల నష్టంతో 21,570 వద్ద వారం కనిష్ఠ స్థాయిలో ముగిసింది. అయినా స్వల్పకాలిక మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. 22,000-21,300 పాయింట్ల మధ్యనే కదలాడుతూ గత నాలుగు వారాలుగా మార్కెట్ స్వల్పకాలిక కన్సాలిడేషన్ ట్రెండ్‌లో ఉంది. గత 12 వారాలుగా 19,000 స్థాయి నుంచి 3,000 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించింది. గత కొద్ది వారాలుగా అనిశ్చిత ధోరణి కనిపిస్తోంది. కొత్త ధోరణిని సూచించాలంటే 21,800 వద్ద బ్రేకౌట్ లేదా 21,400 వద్ద బ్రేక్‌డౌన్ తప్పనిసరి. అయితే 21,350 వద్ద మద్దతు తీసుకుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 21,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక ప్రధాన నిరోధం 21,850. ఆ పైన ప్రధాన నిరోధం 22,100.

బేరిష్ స్థాయిలు: 21,600 వద్ద విఫలమైతే మైనర్ అప్రమత్తతను సూచిస్తుంది. భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 21,400 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 48,000 వద్ద నిలదొక్కుకోలేక బలమైన కరెక్షన్‌లో పడింది. చివరికి 2,000 పాయింట్లు నష్టపోయి 46,000 సమీపంలో ముగిసింది. ఈ స్థాయిలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 46,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో నిరోధం 47,200.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 20 డీఎంఏ వద్ద ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. 21,850 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన నిరోధం ఉంది. 21,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. అంతకన్నా దిగజారితే అప్రమత్తతను సూచిస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	21,640, 21,700
మద్దతు	21,500, 21,460

www.sundartrends.in

వైసీపీలో కలకలం

షర్మిల రాకతో తాడేపల్లిలో ప్రకంపనలు

వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా పోస్టింగ్‌లు.. వివరణ పేరిట సజ్జల విమర్శలు

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే తాడేపల్లిలో ప్రకంపనలు మొదలయ్యాయి. తన అన్న, సీఎం జగన్‌పై విమర్శలు చేయగానే వైసీపీ సోషల్ మీడియా ఆమెపై వ్యక్తిగత దాడికి దిగింది. మరోవైపు సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వివరణ ఇచ్చుకునే పేరిట విమర్శలకు దిగారు. చంద్రబాబు కుట్రలో పావుగా మారారని ఆరోపించారు. ఆమె అసలు ఏపీకి ఎందుకొచ్చారని ప్రశ్నించారు. షర్మిల గన్నవరం విమానాశ్రయం నుంచి విజయవాడలోని పీసీసీ కార్యాలయానికి వచ్చే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రత్యేకించి వైఎస్ అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చి ర్యాలీ నిర్వహించారు. జీవం లేని కాంగ్రెస్ పార్టీకి ఇంత బలముందా అని పాలక పార్టీ సైతం విస్మయం చెందేలా ర్యాలీ కొనసాగింది. తర్వాత ఆమె పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాంగ్రెస్ నేతలు, పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఉత్తేజపూరితంగా ప్రసంగించారు. జగన్ పాలనలోని వైఫల్యాలు, లోపాలను ఎత్తి చూపారు. తీవ్ర విమర్శలు గుప్పించారు. మూడు రాజధానులు, పోలవరం ప్రాజెక్టు, జగన్ సర్కారు అడ్డగోలుగా చేసిన అప్పులు, రహదారుల దుస్థితి పై వ్యంగాస్త్రాలు విసిరి కార్యకర్తల్లో ఉత్తేజం నింపారు. మణిపూర్‌లో ఆదివాసీలు, క్రైస్తవులపై తీవ్రస్థాయిలో దాడులు జరిగినా బీజేపీకి జగన్ మద్దతు ఇచ్చారంటే అసలు మనుషులేనా అంటూ జగన్‌ను టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు వైసీపీకి వణుకు పుట్టించాయి. ఆ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న మైనారిటీ వర్గాల సమస్యలనే ఏకరువు పెడుతూ జగన్‌పై విమర్శల దాడి చేయడం వైసీపీని ఆత్మరక్షణలో పడేసింది. మణిపూర్‌పై ఈ ప్రశ్నలు వామపక్ష పార్టీలు, కొందరు కాంగ్రెస్ నేతల నుంచే వచ్చాయి. ఇప్పుడు తన సోదరి నుంచే రావడంతో జగన్‌ను, ఆయన శిబిరాన్ని కలవరానికి గురిచేసి ఉంటుంది. కాంగ్రెస్ ఆఫీసులో షర్మిల ప్రసంగం ముగిసిన వెంటనే వైసీపీ పెద్దలు మంతనాలు జరిపినట్లు తెలిసింది. సలహాదారు సజ్జలతో కౌంటర్ ఇప్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అంతకుముందే వైసీపీ సోషల్ మీడియాతో షర్మిలపై పోస్టుల యుద్ధం చేయించారు. ఆమె వ్యక్తిత్వాన్ని, నాయకత్వ పటిమను దెబ్బతీసేలా పోస్టింగ్‌లు వదిలారు. కాసేపటికే సజ్జల తెరమీదకు వచ్చి ప్రెస్‌మీట్‌ను తలపించేలా ఓ వీడియోను రికార్డు చేసి వదిలారు. షర్మిల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

వైఎస్ పేరును షర్మిల దుర్వినియోగం చేస్తున్నారు

» జగన్‌పై ఈర్ష్య పెంచుకున్నారేమో: సజ్జల

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వైఎస్ పేరును షర్మిల దుర్వినియోగం చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల విమర్శించారు. వైఎస్ అనే పేరు వాడుకుని, ఆ కుటుంబం నుంచి వచ్చానంటూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. ఇలా చేయడం ద్వారా తనను తాను శాంతపర్చుకుంటున్నారని తాము భావిస్తున్నామన్నారు. ఈ విషయంలో ఎవరూ గందరగోళం చెందాల్సిన పనిలేదన్నారు. ఆదివారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. షర్మిల ఏదో ఓ పాత్రలోకి వచ్చి చేసిన ప్రయత్నమే తప్ప సిన్సియారిటీ (నిజాయితీ) ఏదని ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఉపయోగపడాలన్న అజెండా స్పష్టంగా కనబడుతోందన్నారు. 'షర్మిలను పావులాగా వాడుకుంటున్నారు. ఆమె ఎందుకు అలా పావులాగా మారడానికి ఇష్టపడుతున్నారో తెలియడం లేదు. కారణాలు వేరే ఏమీ కనిపించడం లేదు. జగన్‌పై ఏదో తెలియని ఈర్ష్య పెంచుకున్నారో తెలియడం లేదు. సడన్‌గా ఇక్కడకు వచ్చి తండ్రి ఆశయాల గురించి అని చెబుతున్నారు. లేని పార్టీకి అధ్యక్షురాలిగా వచ్చి సింపతీని, గందరగోళాన్ని క్రియేట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. మా బాధ ఒక్కటే? రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన చరిత్ర మరువలేనంతగా 100 ఏళ్లయినా తరగిపోకుండా జగన్ నిలిపారు. ఆమె రోడ్డు మీద పడి ఆ కుటుంబం గురించి చర్చించడం బాధాకరం. ఆమె రావడం రావడమే అన్న మీద ఇలా మాట్లాడుతోందని చాలా మంది గందరగోళపడతారు కాబట్టి మేం మాట్లాడుతున్నాం. రాజకీయాల్లో అన్నాచెల్లెలు వేర్వేరుగా లేరా? కానీ ఏ ప్రాతిపదికమీద ఎవరితో ఉన్నారు? రాష్ట్రం గురించి ఏం అధ్యయనం చేశారు? తెలంగాణ లో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ గురించి చదివారా? లేక ఈ పదిరోజులు చదివేసి ఇక్కడ మాట్లాడుతున్నారా?' అని సజ్జల అన్నారు.



ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడుతున్న వైఎస్ షర్మిల

దోచుకోవడం.. దాచుకోవడమే!

> రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా తెలంగాణ నాకు మెట్టినిల్లు. ఏపీ పుట్టినిల్లు. జమ్మలమడుగులో పుట్టా. రెండు చోట్లా పని చేసే హక్కు నాకు ఉంది. నా రాకతో ఎవరికి ఎక్కువ భయం ఉంటే వారే నన్ను ఎక్కువ టార్గెట్ చేస్తారు. ఇందులో అనుమానం ఏమీ లేదు.
> - వైఎస్ షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నాయన్నారు. 'రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న అప్పు రూ.లక్ష కోట్లు. చంద్రబాబు హయాంలో రూ.2 లక్షల కోట్లు అప్పు చేస్తే, ప్రస్తుతం సీఎం జగన్‌రెడ్డి రూ.3 లక్షల కోట్లకు పైగా చేశారు.. మొత్తంగా రూ.6.50 లక్షల కోట్లు అప్పు చేశారు. కార్పొరేషన్ రుణాలు, ఇతర బకాయిలతో కలిపితే రూ.10 లక్షల కోట్లు అప్పుచేసినా రాష్ట్రం అభివృద్ధి చెందిందా..? రాష్ట్రానికి రాజధాని ఉందా..? విజయవాడలో కనీసం మెట్రో అయినా ఉందా..? పదేళ్లలో కనీసం 10 పెద్ద పరిశ్రమలైనా వచ్చాయా? రోడ్డు వేయడానికి కూడా నిధుల్లేని పరిస్థితి. కనీసం ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వడం లేదు. దేనికీ డబ్బుల్లేవు' అని విరుచుకుపడ్డారు. తాను కాంగ్రెస్‌లో చేరితే ఏ పార్టీకి కీడు జరుగుతుందో తనను అడగడం కంటే ప్రజలను అడిగితే వారే సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమన్నారంటే..

వైసీపీ, టీడీపీ.. బీజేపీ తొత్తులు

బీజేపీ రైటిస్ట్ పార్టీ. అది అధికారంలో ఉంటే మణిపూర్ వంటి ఘటనలే జరుగుతాయి. ఏపీకి అన్యాయం చేసింది. ప్రత్యేక హోదా ఇవ్వలేదు. అమరావతి నిర్మాణాన్ని నిలిపేసింది. పోలవరం పూర్తి చేయకుండా రైతులను మోసం చేసింది. ఏపీ ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలి.. చెబుతారు కూడా. రాజధాని అమరావతిని చంద్రబాబు పూర్తి చేయలేదు. జగన్ మూడు రాజధానులని చెప్పి ఒక్కటీ చేయలేదు. రాజధాని ఏదంటే ఇప్పుడు ఏమీ అర్థం కాని పరిస్థితి. ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేది. హోదా కోసం జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు నిరాహారదీక్ష కూడా చేశారు. సీఎం అయిన తర్వాత ఒక్కసారైనా ఆయన నిజమైన ఉద్యమం చేశారా? ఎంపీలందరి చేత రాజీనామా చేయిస్తే ప్రత్యేక హోదా ఎందుకు రాదంటూ అప్పట్లో టీడీపీకి సవాల్ విసిరిన జగన్‌రెడ్డి.. ఆ తర్వాత ఏం చేశారు? స్వలాభం కోసం ఇద్దరూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారు. ప్రత్యేక హోదా కాదు కదా.. ప్యాకేజీ లేదు. ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీకి ఆ రెండు పార్టీలు తొత్తులుగా మారాయి. ఐదేళ్లలో ఒక్క అంశంలోనైనా బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడారా? ఆ పార్టీతో వాటికి కంటికి కనిపించని పొత్తులున్నాయి. ఈ పార్టీలకు వేసే ప్రతి ఓటు బీజేపీకే పోతుంది. ఏపీ ప్రజల పట్ల, ఏపీ అభివృద్ధి పట్ల రాహుల్ పట్టుదలతో ఉన్నారు. అందుకే ప్రధాని కాగానే తొలి సంతకం హోదా కల్పిస్తూ చేస్తానని మాటిచ్చారు.

జగన్‌రెడ్డీ.. క్రైస్తవుల కడుపు మండిపోదా?

మణిపూర్‌లో 2 వేల చర్చిలను ధ్వంసం చేసినా.. 60 వేల మంది క్రైస్తవులను నిర్వాసితులను చేసినా.. కనీసం అప్పుడు కూడా జగన్‌రెడ్డి క్రైస్తవుడిగా అయి ఉండి ఒక్కసారైనా ఆ ఘటనపై మాట్లాడలేదు. మరి క్రైస్తవుల కడుపు మండిపోదా? మనుషులు చచ్చిపోతున్నా.. మీరు బీజేపీకి మద్దతిస్తా ఉన్నారంటే మీరు మనుషులేనా..?

సోనియా, రాహుల్‌కు ధన్యవాదాలు

రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం. నా తండ్రి రెండు దఫాలు పీసీసీ అధ్యక్షుడిగా, రెండు దఫాలు సీఎంగా బాధ్యతలు చేపట్టారు. నన్ను నమ్మి పార్టీలోకి తీసుకుని పార్టీ బాధ్యతలు కట్టబెట్టినందుకు సోనియా, మల్లికార్జున ఖర్గే, రాహుల్, కాంగ్రెస్ నేతలకు ధన్యవాదాలు. రాజశేఖర్‌రెడ్డి బిడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఒక నియంతను గద్దె దించింది. రాజశేఖర్‌రెడ్డి బిడ్డ ప్రతి నియోజకవర్గంలో తిరుగుతూ తెలంగాణలో పాదయాత్ర చేసింది కాబట్టే అక్కడ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది. కాబట్టి ప్రజలు కాంగ్రెస్ వైపు చూశారు. నాకు బలం లేకపోయినా మరొకరికైనా ఉంది. పెద్ద మనసు చేసుకుని నేను చేసిన త్యాగం వల్ల ఒక నియంత అధికారంలో లేకుండా పోయారు. రాహుల్‌ని ప్రధాని చేయాలని 14 ఏళ్ల కిందటే వైఎస్ కోరుకున్నారు. ఆయన కల నెరవేర్చేందుకు కృషిచేస్తా.

23 నుంచి 31 దాకా జిల్లా టూర్లు

పీసీసీ అధ్యక్షురాలి హోదాలో ఈ నెల 23వ తేదీ నుంచి 31 వరకూ జిల్లాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతా.. తొమ్మిది రోజుల పాటు పర్యటిస్తా.. రోజుకు మూడు జిల్లాల నాయకులను కలుస్తా. రాబోయే ఎన్నికలకు కాంగ్రెస్ కేడర్, నాయకులను సమాయత్తం చేయడానికే వీటిని నిర్వహిస్తున్నాం. రాబోయే ఎన్నికల్లో 175 అసెంబ్లీ నియోజవర్గాల్లో, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం. 24న రాష్ట్రంలో పర్యటించే కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్.. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.



షర్మిల రాక నేపథ్యంలో గన్నవరం ఎయిర్‌పోర్టు వద్ద కాంగ్రెస్ కార్యకర్తల హడావుడి

నేను ఎవరో వదిలిన బాణాన్ని కాను..

'జగన్ వదిలిన బాణంగా చెప్పుకోవడానికి మీకు అభ్యంతరం లేదు.. కానీ మరొకరు వదిలితే మీకు బాధగా ఉందా' అని వైసీపీ నేతలను షర్మిల నిలదీశారు. అయితే తాను ఎవరు వదిలిన బాణాన్నీ కాదన్నారు. తాను సొంత ఆలోచనతో, వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకుని కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు.

షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లోకి ఆళ్ల



విజయవాడ-ఆంధ్రజ్యోతి-మంగళగిరి సిటీ, జనవరి 21: తన అడుగులు షర్మిలతోనేనని ప్రకటించిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి.. షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఆమె కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రామకృష్ణారెడ్డి ముందుగా గన్నవరంలోని విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడారు. షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని, ప్రజలు ఆమె నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. కాన్వాయ్‌లో ఆమె ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఆయన.. తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఇచ్ఛాపురం టూ కర్నూలు!

» అంతర్గత భేటీలకు షర్మిల శ్రీకారం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్రను ముగించిన ఇచ్ఛాపురం నుంచే కాంగ్రెస్‌ను బలోపేతం చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని పీసీసీ నూతన అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్ణయించారు. ఇందుకోసం ఓ ప్రణాళికను కూడా రూపొందించారు. మంగళవారం నుంచి అంతర్గత సమావేశాలకు శ్రీకారం చుడుతున్నారు. తొలిరోజు రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మస్తాన్‌వలీ, సుంకర పద్మశ్రీ, సీనియర్ నేతలు జంగా గౌతమ్, తులసిరెడ్డి తదితరులు హాజరవుతారు. ఇచ్ఛాపురంలో మొదలయ్యే ఈ భేటీలు తొమ్మిది రోజులు జరుగుతాయి. వరుసగా జిల్లాలన్నీ తిరిగి.. పార్టీ వాస్తవ స్థితిగతులేంటో తెలుసుకుంటారు. ఈ పర్యటనల్లోనే.. పార్టీలో ఎవరు చేరినా స్వాగతిస్తామని.. హోదాకు ప్రాధాన్యమివ్వకుండా సామాన్య కార్యకర్తను కూడా కండువా కప్పి ఆహ్వానిస్తామని సీనియర్ నేతలకు షర్మిల హామీ ఇచ్చారు. వాస్తవానికి.. పీసీసీ పగ్గాలు చేపట్టాలన్న నిర్ణయానికి వచ్చిన వెంటనే.. ఆమె రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి నడుం బిగించారు. శనివారం ఇడుపులపాయలోని తన తండ్రి సమాధి వద్ద నివాళులు అర్పించి.. ఆదివారం విజయవాడ చేరుకున్నారు. శనివారం రాత్రి పొద్దుపోయాక.. ఠాగూర్, రఘువీరారెడ్డి, రుద్రరాజు, కేవీపీ తదితరులతో 'జూమ్' కాన్ఫరెన్సు జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలంటే.. కేంద్రంలోని బీజేపీ సర్కారును, ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను మాత్రమే ఎండగడితే చాలదని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ సమావేశాలు పూర్తయ్యాక షర్మిల జనంలోకి వెళ్తారని తెలుస్తోంది.

20-30 నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇద్దాం

నిస్వార్థంగా పని చేసే నాయకులను గుర్తించి, వారిని ప్రోత్సహించి.. కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని షర్మిల పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే రాష్ట్ర కార్యవర్గ భేటీ నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో అన్ని ఎంపీ, ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో పార్టీ పోటీ చేస్తుందని.. 25-30 నియోజకవర్గాల వరకైనా గట్టిగా దృష్టిపెడదామని సూచించారు. కనీసం 30 అసెంబ్లీ స్థానాలనైనా దక్కించుకుంటే.. 2029 ఎన్నికల నాటికి అధికారంలోనికి రావడం సునాయాసమవుతుందని అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 1.5 శాతమే. ప్రతి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు ఉంది. అది ఇతర పార్టీలకు పోయి ఉండొచ్చు. దానిని వెనక్కి తీసుకొద్దాం. ఇది మనందరి బాధ్యత' అని స్పష్టం చేశారు. అంతకుముందు అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న వెంటనే ఆంధ్రరత్న భవన్‌కు చేరుకున్న షర్మిలను రుద్రరాజు అధ్యక్ష సీట్లో కూర్చోబెట్టారు.

భయపడుతున్నారా సార్..!

ప్రమాణ స్వీకారానికి బయల్దేరిన షర్మిల కాన్వాయ్ విజయవాడలో అడుగుపెట్టగానే అడ్డంకులు ఎదురయ్యాయి. వాహన శ్రేణిని ఎనికేపాడు వద్ద జాతీయ రహదారిపై పోలీసులు అడ్డుకున్నారు. ఆమె కారు ముందు, వెనుక ఉన్న ఎస్కార్ట్ వాహనాలను విజయవాడ వైపు వదిలి.. ఆ తర్వాత వచ్చే వాహనాలను తాడిగడప 100 అడుగుల రోడ్డులోకి వెళ్లాలని సూచించారు. వాహనాలను అడ్డుకున్నారని తెలిసిన షర్మిల తన కారును అక్కడే ఆపేశారు. పోలీసుల తీరుకు నిరసనగా పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, కార్యకర్తలు జాతీయ రహదారిపై బైఠాయించారు. 'వైఎస్సార్ బిడ్డ ఎవరికీ భయపడదు. ప్రభుత్వం కావాలనే నా కాన్వాయ్‌ను అడ్డుకుంది. అంటే కాంగ్రెస్‌కు భయపడుతున్నట్లే కదా! భయపడుతున్నారా సార్' అని సూటిగా జగన్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. షర్మిల ఆందోళనకు దిగడంతో పోలీసులు చేసేది లేక మిగిలిన వాహనాలను అనుమతించారు. ఆ తర్వాతా జగన్‌పై షర్మిల స్పందించారు. జగన్‌రెడ్డీ అని సంబోధించడాన్ని వైసీపీ వాళ్లు వ్యతిరేకిస్తున్నారని విలేకరులు ప్రస్తావించగా.. 'జగన్‌రెడ్డి గారు.. జగన్‌రెడ్డి గారు అంటే కూడా అభ్యంతరం ఉందా' అని ఎదురుప్రశ్నించారు.



విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా

ఓటర్ల జాబితాలో అవకతవకలపై గవర్నర్ ఆరా

» అబ్దుల్ నజీర్‌ను కలిసిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనా

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఓటర్ల జాబితాలో అవకతవకలపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆరా తీసినట్టు తెలిసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదివారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 25న నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతున్న పలు కార్యకలాపాలను గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే చాలా మంది ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై నేరుగా గవర్నర్‌కే ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జాబితాల్లోని అవకతవకలపై గవర్నర్ ఆరా తీసినట్టు తెలిసింది. ఈ సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ కూడా పాల్గొన్నారు.

అసలువో... నకిలీవో తేల్చండి

» ఆరు ఓటరు కార్డులపై పోలీసులకు తిరుపతి కమిషనర్ ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21: తిరుపతి ఎంపీ ఉప ఎన్నిక సందర్భంగా 2021లో చోటుచేసుకున్న దొంగ ఓట్ల వ్యవహారానికి సంబంధించి మరో కేసు నమోదైంది. తిరుపతిలోని రెండు ప్రాంతాలకు చెందిన ఆరుగురి ఓటరు కార్డులు అసలువో, నకిలీవో తేల్చాలని తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత శనివారం రాత్రి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుందరయ్యనగర్‌కు చెందిన లక్ష్మమ్మ, కోమాంగి, కోమల, మల్లిక, శాంతి, క్రాంతినగర్‌కు చెందిన కుమారి అసలైన ఓటర్లేనా, వారి కార్డులు సరైనవేనా నిగ్గు తేల్చాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జయనాయక్ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులు, వారి ఓటరు కార్డులు అసలువో, నకిలీవో ప్రస్తుతానికి తెలియనందున గుర్తు తెలియని వ్యక్తుల కింద కేసు నమోదు చేశారు.

ఓట్ల తొలగింపునకు కొత్త కుట్ర

» ఒకే డోర్ నంబర్‌తో వందకుపైగా ఓట్లు

» అన్నీ టీడీపీ సానుభూతిపరులవే నమోదు

శింగనమల, జనవరి 21: టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడానికి వైసీపీ నాయకులు కొత్త కుట్రకు తెరలేపారు. అనంతపురం జిల్లా శింగనమల మండలంలో టీడీపీకి కంచుకోటగా ఉన్న పెరవలి గ్రామంలో ఈ వ్యవహారం వెలుగు చూసింది. గ్రామంలోని 91వ పోలింగ్ కేంద్రం పరిధిలో 704 మంది, 92వ పోలింగ్ కేంద్రం పరిధిలో 849 మంది ఓటర్లున్నారు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి ఆయా కేంద్రాల పరిధిలో 1-222ఏ, 1-222బీ, సీ డోర్ నంబర్లతో గ్రామంలోని టీడీపీ సానుభూతి పరులకు చెందిన ఫొటోలు, పేర్లు వందకుపైగా నమోదు చేశారు. ఈ సాకుతో వారి ఓట్లు తొలగించడానికి కుట్రపన్నారని, దీన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, జాబితాను సరిదిద్దాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమార్కుల్లో వణుకు!

(మొదటి పేజీ తరువాయి)

> ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించి, అక్రమంగా దొంగ ఓట్లు చేర్చారంటూ రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 92 మంది తహసిల్దార్‌లు, 76 మంది డిప్యూటీ తహసిల్దార్‌లపై ఆరోపణలు వచ్చాయి. వారిపై ఎన్నికల కమిషన్, రెవెన్యూ శాఖకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో జిల్లాల వారీగా ఈసీ నిఘాపెట్టింది. అక్రమాలు బయటపడితే సంబంధిత అధికారులపై వేటు వేయడం ఖాయం.

లోక్‌సభ ఉప ఎన్నిక దొంగ ఓట్ల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్ర బయటకొస్తోంది. అధికార పార్టీ నేతలతో అంటకాగి అడ్డగోలుగా తప్పులు చేసిన ఓ తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్‌పై ఇప్పటికే వేటు పడింది. ఓ ఐఏఎస్‌పైనా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ పరిశీలన పూర్తయ్యేనాటికి మరి కొందరిపైనా వేటు పడనుందని రెవెన్యూ వర్గాల్లో భయాందోళన నెలకొంది. గతంలో చేసిన తప్పులు, ఇటీవలి కాలంలో గుట్టుగా చేసిన అక్రమాలు బయటకొస్తే తమ పరిస్థితి ఏమిటని కొందరు అధికారులు వణికిపోతున్నారు. తదుపరి చర్యల జాబితాలో తమ పేరు ఉందా? అని ఇక్కడి సీఈఎల్‌ఏ కార్యాలయంలో ఆరా తీస్తున్నారు. అధికారులకు ఫోన్‌లు చేసి తమ పరిస్థితి ఏమిటంటూ వాకబు చేస్తున్నారు. కొందరయితే.. ఇటీవల దొంగ ఓట్ల నమోదు, తొలగింపు కేసుల్లో తమపై ఏమైనా ఫిర్యాదులు వచ్చాయా? అంటూ ఆరాతీస్తున్నారు. ఈసీ ఎప్పుడు ఎవరిపై చర్యలు తీసుకుంటుందో, ఎవరిపై విచారణకు ఆదేశిస్తుందోనని పలువురు తహసిల్దార్‌లు, డీటీలు బెంబేలెత్తిపోతున్నారు.

'తిరుపతి'లో అక్రమాలు వెలుగులోకి

తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలున్నాయి. తిరుపతి జిల్లాలో మూడు స్థానాలు... తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నెల్లూరు జిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాలు... సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఉన్నాయి. తిరుపతి లోక్‌సభ పరిధిలోని తిరుపతి అసెంబ్లీకి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో)గా మున్సిపల్ కమిషనర్, ఏఈఆర్‌వోగా తిరుపతి అర్బన్ తహసిల్దార్, సహాయకులుగా తిరుపతి అర్బన్ డిప్యూటీ తహసిల్దార్ వ్యవహరించారు. తిరుపతి ఆర్‌డీవో చంద్రగిరి అసెంబ్లీకి ఆర్‌వో, ఈఆర్‌వోగా ఉంటారు. చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం చిత్తూరు లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది. దీంతో తిరుపతి ఆర్‌డీవోకు ఉపఎన్నికల విధులు అప్పగించలేదు. తిరుపతి లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోని మండలాల తహసిల్దార్‌లకు ఏఈఆర్‌వోలుగా, వారికి సహాయకులుగా ఆయా మండలాల డిప్యూటీ తహసిల్దార్‌లకు బాధ్యతలు అప్పగించారు. ప్రతిపక్షాల ఫిర్యాదుల మేరకు ఒక్క తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జరిగిన 30 వేల దొంగ ఓట్ల నమోదు కేసుపైనే స్పష్టత వచ్చింది. దీంతో నాటి తిరుపతి అసెంబ్లీ ఆర్‌వోగా ఉన్న ఐఏఎస్ గిరీషా, ఆయనకు ఏఈఆర్‌వోగా సహాయకుడిగా ఉన్న తిరుపతి అర్బన్ తహసిల్దార్ జయరాములును ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. ఏఈఆర్‌వోకు సహాయకుడిగా ఉన్న తిరుపతి అర్బన్ డిప్యూటీ తహసిల్దార్ విజయ్ భాస్కర్‌ను కూడా ఈసీ సస్పెండ్ చేసింది. తిరుపతితో పాటు శ్రీకాళహస్తి, సత్యవేడు, సర్వేపల్లి, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ భారీగా దొంగ ఓట్లు చేర్పించి ఉంటారన్న ఆరోపణలున్నాయి. ఈసీ దీనిపై లోతుగా పరిశీలన చేస్తోంది. ఈ నేపథ్యంలో మరి కొందరు అధికారులపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చని అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. తిరుపతి ఉపఎన్నిక సమయంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల గుండెల్లో వణుకు పుడుతోంది.

తాజా అక్రమాలపైనా నిఘా

తిరుపతి ఉపఎన్నికల్లో దొంగ ఓట్ల వ్యవహారం అధికారుల్లో అలజడి రేపుతుండగా, తాజా దొంగ ఓట్ల వ్యవహారం రాష్ట్రంలోని అధికారుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ప్రతిపక్షాల సానుభూతిపరుల ఓట్లను తొలగించి, అధికారపార్టీ నేతల సిఫారసుతో అక్రమంగా దొంగ ఓట్లు చేర్చారంటూ రాష్ట్రవ్యాప్తంగా 92మంది తహసిల్దార్‌లు, 76 మంది డిప్యూటీ తహసిల్దార్‌లపై ఇటు ఎన్నికల కమిషన్‌కు, అటు రెవెన్యూ శాఖకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదుల పరిష్కారం, అధికారులకు క్లీన్‌చిట్ ఇచ్చే అంశంపై జిల్లాల వారీగా ఈసీ నిఘాపెట్టింది. ఫిర్యాదులను బుట్టదాఖలు చేయకుండా ప్రతిదాన్నీ పరిశీలించాలని ఆదేశించింది. దీంతో ఈసీ విచారణ పేరిట తమపై చర్యలు తీసుకుంటే సర్వీసుకు, భవిష్యత్ పదోన్నతులకు ఇబ్బందులొస్తాయని కొందరు ఆందోళన చెందుతున్నారు.

తిరుపతి ఆర్‌డీవోకు సంబంధం లేదు: రెవెన్యూ

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల వ్యవహారంలో తిరుపతి తహసిల్దార్‌తో పాటు ఆర్‌డీవోకు కూడా భాగస్వామ్యం ఉంటుందని, ఆయన్ను కూడా సస్పెండ్ చేసి ఉంటారని సోషల్ మీడియాలో గత రెండు రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆర్‌డీవోపై ఎలాంటి చ ర్యలు తీసుకోలేదని, ఉప ఎన్నికలకు ఆర్‌డీవోకు సంబంధం లేదంటూ రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. 'తిరుపతి లోక్‌సభ స్థానం పరిధిలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. అక్కడ స్థానిక మున్సిపల్ కమిషనర్, అర్బన్ తహసిల్దార్, డీటీ, ఇతర అధికారులకు ఎన్నికల బాధ్యతలు అప్పగించారు. ఆర్‌డీవోకు ఎన్నికల బాధ్యతలు అప్పగించలేదు. తిరుపతి పక్కనే ఉన్న చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి తిరుపతి ఆర్‌డీవో ఎన్నికల అధికారి (ఆర్‌వో, ఈఆర్‌వో)గా ఉన్నారు. చంద్రగిరి చిత్తూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఉంది. కాబట్టి తిరుపతి ఆర్‌డీవోకు ఉప ఎన్నికలకు సంబంధం లేదు. పైగా ఉప ఎన్నికల సమయంలో తిరుపతి ఆర్‌డీవో వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉన్నారు. తిరుపతి ఆర్‌డీవోను సస్పెండ్ చేశారంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం తప్పు' అని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

ఆ అధికారులను బదిలీ చేయండి

» సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారిని
మూడేళ్లుగా ఒకే చోట ఉన్న వారిని
తక్షణ ట్రాన్స్‌ఫర్‌కు సీఈసీ ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలోనే జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) కార్యాచరణ ప్రారంభించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు సంబంధించి కీలక ఆదేశాలు జారీచేసింది. తమ సొంత జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను, ఒకే ప్రాంతంలో నాలుగేళ్లకు పైబడి పనిచేస్తున్న వారిని తక్షణం బదిలీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఆదేశించింది. ఈ ఏడాది జూన్ 30లోపు ఒకేచోట పనిచేస్తూ మూడేళ్లు పూర్తిచేసుకునే వారిని కూడా బదిలీ చేయాలని పేర్కొంది. ఈ మేరకు సీఈసీ సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేంద్ర ఎన్. బుటోలియా రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. నిర్దిష్ట ఎన్నికల విధులతో సంబంధం ఉన్న డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల్ అధికారులకు, ఏడీఎం, ఎస్‌డీఎం, డిప్యూటీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తహసీల్దార్, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని బుటోలియా పేర్కొన్నారు. మునిసిపల్ కార్పొరేషన్లు, డెవలప్‌మెంట్ అథారిటీలో పనిచేస్తున్న అధికారులను కూడా మూడేళ్లు దాటితే కొనసాగించరాదని తెలిపారు. పోలీసు శాఖలో ఏడీజీలు, ఐజీలు, డీఐజీలు, సాయుధ పోలీసు కమాండెంట్లు, ఎస్‌ఎస్‌పీలు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, పోలీసు సబ్ డివిజన్ హెడ్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ, సార్జంట్ మేజర్లు, ఎన్నికల సమయంలో జిల్లాలో పోలీసు బలగాల నియామకం, భద్రతా ఏర్పాట్లతో సంబంధం ఉన్న ఏ అధికారీ మూడేళ్లకు మించి కొనసాగించేందుకు వీలులేదని తెలిపారు. పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆ పైస్థాయిగల వారెవరినీ వారి సొంత జిల్లాల్లో కొనసాగించవద్దని తెలిపారు. ఈ ఆదేశాలు ఎక్సైజ్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆపై స్థాయి వారికి కూడా వర్తిస్తాయని పేర్కొన్నారు.

వీరికి మినహాయింపు

పోలీసు విభాగంలో కంప్యూటరైజేషన్, స్పెషల్ బ్రాంచ్, శిక్షణ తదితర విభాగాలు.

డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, యూనివర్సిటీ చాన్స్‌లర్లు.

నేరం జగన్ నైజం.. మళ్లీ ఆయనొస్తే.. దళిత జాతి అంతరించిపోతుంది: గోరంట్ల

రాజమహేంద్రవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'నేరం జగన్ నైజం. అధికారం కోసం ఎంతకైనా తెగిస్తాడు. గత ఎన్నికల ముందు సానుభూతి కోసం దళిత యువకుడి చేత చిన్న కత్తితో దాడి చేయించుకున్నాడు. సొంత బాబాయిని హత్య చేయించి ఆ నేరం చంద్రబాబుపై మోపాడు. ఇటువంటి జగన్ మరోసారి అధికారంలోకి వస్తే అధోగతే' అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. ఇక్కడ తన స్వగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కోడికత్తి శ్రీను దాడి వల్ల చిన్న గాయమే అయినా, అది ప్రేమతే, సానుభూతి కోసమేనని తేలినా.. ఐదేళ్లుగా అతన్ని జైలులోనే ఉంచాడు. జగన్‌రెడ్డి దళిత ద్రోహి. అతను మళ్లీ అధికారంలోకొస్తే దళిత జాతే అంతరించిపోయే ప్రమాదం ఉంది' అన్నారు.

ఫైనాన్స్ కంపెనీలకు కోట్లు ఎగ్గొట్టిన ఎంపీ నాని

» భూకబ్జాలకు పేటెంట్ ఆయనదే: బుద్దా వెంకన్న

విజయవాడ (వన్‌టౌన్), జనవరి 21: దొంగ రశీదు పుస్తకాలతో ఫైనాన్స్ కంపెనీలకు ఎంపీ కేశినేని నాని రూ.కోట్లు ఎగనామం పెట్టాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కేశినేని నాని తన బస్సుల్లో ప్రయాణించే వారి నుంచి విపరీతంగా వసూలు చేశాడు. ఒకే నంబరు ప్లేటుతో బస్సులు తిప్పాడు. భూకబ్జాలకు పేటెంట్ హక్కుగా ఉన్న కేశినేని నానీ.. దివంగత జీఎంసీ బాలయోగి ఆస్తులను కాజేశాడన్న విషయాన్ని చిన్నపిల్లలను అడిగినా చెబుతారు. ఊహల్లో బతుకుతూ చంద్రబాబుతో పోల్చుకుంటున్నాడు. నారా లోకేశ్ గెడ్డంలో నెరిసిన వెంట్రుక స్థాయి కూడా నానికి లేదు. ఎన్నికల తరువాత నాని సహ వైసీపీ ఖాళీ అయిపోతుంది. నాని బతుకే తీసుకున్న అప్పులు ఎగ్గొట్టడం. కోవర్టు నానిని ఎంపీ చేసి చంద్రబాబు తప్పు చేశారు. చంద్రబాబు అమాయకుడు కనుక ఆయన్ను వదిలేశారు. జగన్ అయితే కొట్టి పంపించేవాడు. 2019లో నాని రూ.9కోట్ల మేర చందాలు వసూలు చేశాడు. అతని కొవ్వు కరిగిస్తాం. చంద్రబాబు, లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశా. విజయవాడ పశ్చిమం ఇన్‌చార్జి కావాలని అడగలేదు' అని బుద్దా అన్నారు.

బాబుపై విమర్శలతో జగన్ పబ్బం: అనగాని

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చంద్రబాబును విమర్శిస్తూ, జగన్ పబ్బం గడుపుకొంటున్నారని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదివారం మండిపడ్డారు. 'అబద్ధాలు చెప్పడంలో జగన్ దిట్ట. అబద్ధాలు, మోసాలు, దోపిడీ, అవినీతి, దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులు, అక్రమ నిర్బంధాలతో పాలన సాగిస్తున్నారు. విధ్వంసం, నాశనం తప్ప జగన్ ఏం సాధించారు?' అంటూ అంశాల వారీగా వివరణాత్మక విమర్శ చేశారు.

సీఎం ఇల్లు ముట్టడిస్తాం: ఆచంట

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించాలన్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోకపోతే.. సీఎం ఇల్లు ముట్టడిస్తామని టీడీపీ అంగన్వాడీ వర్కర్స్ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత ఆదివారం హెచ్చరించారు. అధికారంలోకి వచ్చాక తెలంగాణ కంటే ఎక్కువ జీతాలిస్తామన్నది మీరు కాదా? మీరిచ్చిన హామీని విస్మరించి, న్యాయం కోరితే బెదిరిస్తారా?' అంటూ సునీత మండిపడ్డారు.

ఐదేళ్ల పాలనతో 50 ఏళ్లు వెనక్కి: వీరంకి

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో 50 ఏళ్లు వెనక్కి నెట్టారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి ఆదివారం ధ్వజమెత్తారు. 'వైసీపీ పాలనలో నష్టపోని వర్గం ఏదైనా ఉందా? నేరాలు, ఘోరాలు తప్ప.. జగన్ పాలనలో సాధించిన ప్రగతి మచ్చుకైనా లేదు. ఈ సారి పులివెందులతో సహా అన్ని స్థానాల్లో టీడీపీ గెలుపు ఖాయం' అన్నారు.

ఉషానాయుడికి రాహుల్ యాత్రలో కీలక బాధ్యతలు

న్యూఢిల్లీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) గుంటూరు జిల్లాకు చెందిన ఏఐసీసీ కార్యదర్శి ఉషా నాయుడుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయయాత్రలో కీలక బాధ్యతలు అప్పగించారు. పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో భారత్ జోడో న్యాయ యాత్రలో ఏర్పాట్లను సమన్వయం చేసేందుకు ఉషానాయుడును నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ప్రకటించారు. ఉషానాయుడుతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఏఐసీసీ కార్యదర్శులకు ఈ బాధ్యతలు అప్పగించారు.

కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడి దీక్ష విరమణ



కోడికత్తి శ్రీను తల్లి దీక్షను విరమింపజేస్తున్న వివిధ పార్టీల నేతలు

విజయవాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో సీఎం జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు ఆదివారం రాత్రి ఆ దీక్షను విరమించారు. నాలుగు రోజులుగా కొనసాగుతున్న వారి దీక్షను పోలీసులు భగ్నం చేసి ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. విజయవాడ ప్రభుత్వాసుపత్రి సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో చికిత్స పొందుతున్న వారిని టీడీపీ నేతలు బొండా ఉమామహేశ్వరరావు, మాల్యాద్రి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ తదితరులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. కాగా, దీనిపై ఈనెల 24న సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తామని సమతాసైనిక్‌దళ్ ప్రకటించింది.

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోంది

- అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టిన జగన్ ఆయన రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు
- జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నా: కొణతాల



అనకాపల్లి టౌన్, జనవరి 21: 'రాష్ట్రంలో ప్రస్తుతం నెల కొన్న పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఏపీని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చా. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పట్టుదలతో అనుకున్నది సాధించే వ్యక్తి. అందుకే ఆయనతో కలిసి పనిచేయడానికి ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నా' అని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం అనకాపల్లిలో తన అనుచరులు, అభిమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోంది. ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన జగన్.. అంతకుముందు తన తండ్రి వైఎస్ శంకుస్థాపన చేసిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తారని ఆశించా. కానీ పట్టించుకోలేదు. దీనివల్ల ఉత్తరాంధ్ర భూములకు సాగునీరు అందక రైతులు వర్షంపై ఆధారపడి పంటలు సాగుచేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని నెలకొల్పిన సీఎం జగన్‌రెడ్డి.. ఆ మహనీయుడు రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. విశాఖను రాజధానిగా ప్రజలు కోరుకోవడం లేదు' అని కొణతాల స్పష్టం చేశారు.

కేంద్రం పథకాలకు వైసీపీ స్టిక్కర్లు: పురందేశ్వరి

నంద్యాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలకు వైసీపీ స్టిక్కర్లు వేసుకుని ప్రచారం చేసుకుంటోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి, నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ప్రముఖులు, పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశం స్థానిక ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. పురందేశ్వరి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను ఓటర్ల కోణంలో చూడకుండా అభివృద్ధి పథకాలను అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలకు కేటాయించిన మొత్తాలను ఆమె వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని చెప్పకుండా, ఆయా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తామే చేపట్టామని ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. సీఎం జగన్ జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని, ఒక్క పరిశ్రమను కూడా తీసుకు రాలేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్ర పేరుతో రాష్ట్ర ప్రజలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. ఈ నెల 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అన్ని రాష్ట్రాలు సెలవు ప్రకటిస్తే జగన్ మాత్రం పట్టించుకోలేదన్నారు.

ఉద్యోగం లేక బందరు యువకుడి అగచాట్లు

- జగన్ సర్కారు నిర్వాకంతో కూలీగా మారిన వైనం

మచిలీపట్నం టౌన్, జనవరి 21: ఉద్యోగాల భర్తీ విషయంలో జగన్ ప్రభుత్వం చేస్తున్న అలివిమీరిన నిర్లక్ష్యానికి ఉన్నత విద్య చదివిన ఓ యువకుడు కూలీ గా మారాడు. కృష్ణాజిల్లాలోని గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తిచేసి, ఉద్యోగం దొరక్క, జీవనోపాధి కోసం ఊక మూటలు మోస్తున్న నిరుద్యోగి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బందరులోని నాగపోతరావు సెంటర్‌కు చెందిన దూండీ అనే యువకుడు నాలుగేళ్లుగా ఉద్యోగం లేక అవస్థలు పడుతున్నాడు. చివరకు హోటళ్లకు ఊక మూటలు మోసి జీవిస్తున్నాడు. బీటెక్ చదివిన తనకు టీడీపీ హయాంలో నిరుద్యోగ భృతి లభించేదని, వైసీపీ వచ్చాక అది ఆగిపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నానన్నాడు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తే తమకు ఉద్యోగం వస్తుందన్న నమ్మకం ఉందని దూండీ పేర్కొన్నారు. కాగా, దూండీ బావ వెంకట శివసాయిరావు కూడా ఉద్యోగం లభించక ఊక మూటలు మోస్తున్నారు.



ఊక మూటలు మోస్తున్న దూండీ

సరదాగా సంబరాలు

సీరియస్‌గా అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

కట్టాల్సిందే. ప్రభుత్వ పథకాలనూ వదలకుండా దందా చేస్తున్నారు. ఆ నేతను ముద్దుగా సంబరాల బాబు.. కాం బాబు.. శ్యాంబాబు అని ప్రతిపక్ష నేతలే కాదు.. ఆయనంటే గిట్టని సొంత పార్టీ నేతలూ పిలుస్తుంటారు. ఆ నియోజకవర్గంలో ఈయన అవినీతి, అక్రమాలను సొంత పార్టీ మనుషులే నిలదీస్తున్నారంటే ఏ మేరకు అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థమవుతుంది. ఆయనకు ఎదురు తిరిగిన సొంత పార్టీ వ్యక్తులపైనే కేసులు పెట్టించారు. ఎమ్మెల్యే అక్రమ క్వారీయింగ్ విషయంలో సొంత వారే హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. అడిగినంత ఇవ్వలేదని పరిశ్రమలపై ఉక్కుపాదం మోపారు. 23 సున్నం మిల్లులకు విద్యుత్ సరఫరా నిలిపివేయించడంతో మిల్లులు మూత పడి కార్మికుల ఉపాధికి గండిపడింది. రియల్ వెంచర్ల వ్యాపారుల వద్ద డబ్బు దండుకుంటున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. స్థిరాస్తి వ్యాపారానికి అనుమతులు రావాలంటే ఎకరాకు రూ.5 లక్షలు చెల్లించాల్సిందేనని స్థానికంగా ప్రచారంలో ఉంది. ఇక, ఈ ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలనూ వదలలేదు. జగనన్న కాలనీల మాటున పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. భూమిని తన అనుచరుల ద్వారా తక్కువ రేటుకు కొనుగోలు చేయించి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించినట్టు వైసీపీ శ్రేణులే చెబుతున్నాయి. ఇలా ఎకరాకు రూ.10 లక్షల నుంచి 20 లక్షల వరకు అక్రమంగా ఆర్జించినట్టు సమాచారం. చివరకు పార్టీ పదవులను కూడా వదల్లేదు.



ఎమ్మెల్యే దందా, ధనార్జనపై సొంత పార్టీ నేతలే తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. బొత్తిగా నోరు కుదరని ఈయనకు ఆ నియోజకవర్గంలో అన్ని పనులకూ కప్పం కట్టాలిసిందే. మట్టిని కూడా కోట్ల రూపాయల సంపాదనకు వాడుకోనే నేర్పరి

మండలానికో అనుచరుడు!

మండలానికి ఒక అనుచరుడిని నియవింపుకొని వారి ద్వారా ఎమ్మెల్యే వసూళ్ల పర్వం సాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మీడియా ఎదుట పలుమార్లు ఆ నేత అక్రమార్జనను కొందరు సొంత పార్టీ నేతలే వెల్లడించడం గమనార్హం. రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద డబ్బు దండుకుంటున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది.

ఆయన అక్రమార్జనపై పార్టీలోని వ్యక్తులు కథలు కథలుగా చెబుతుంటారు. ఇలా అడ్డదిడ్డంగా సంపాదించిన సొమ్ముతో ఒక మండలంలో సదరు ఎమ్మెల్యే 20 ఎకరాలు కొనుగోలు చేసి గెస్ట్ హౌస్ నిర్మించుకున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నేత ఓ మహిళతో సాగించిన కామ సంభాషణ ఆడియో వైరల్ అయ్యింది. ఎమ్మెల్యే కాకముందు కూడా హైదరాబాద్‌లో ఒక మహిళతో ఇలాం టి సంభాషణే జరిపి అడ్డంగా బుక్ అయ్యారు.

బార్‌ల నుంచి భారీగా

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో బార్ అండ్ రెస్టారెంట్లను సిండికేట్‌గా ఏర్పాటు చేసి నెల వారిగా ఈ ఎమ్మెల్యే వాటాలు దోచేస్తున్నారు. నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లు కూడా ఈయన ఆధ్వర్యంలోనే నడుస్తుండడం గమనార్హం. మద్యం షాపులను సిండికేట్‌గా ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి కొట్టారు. పట్టణంలో 40 సెంట్లు దాకా స్థిరాస్తిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల ద్వారా ఏర్పాటు చేసుకున్నారు. ఒక స్పిన్నింగ్ మిల్లును మూయించేసి వందలాది మంది కార్మికులను రోడ్డున పడేసిన వ్యక్తి వద్ద రూ.1.50 కోట్లు తీసుకొని ఆయన భార్యకు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి. పురపాలక సంఘంలో చైర్‌పర్సన్ రాటిఫికేషన్ పేరిట నామమాత్రంగా పనులు చేస్తూ రెండేళ్ల కాలంలో చైర్‌పర్సన్ భర్త నుంచి సదరు ఎమ్మెల్యే రూ.2 కోట్లకు పైగా దోచుకున్నారు. పురపాలక సంఘంలో సాంబశివ మహత్యం చూపిస్తూ దోపిడీకి తెరదీశారు. సున్నపురాయి వ్యాపారుల నుంచి ప్రతి నెలా రూ.కోటి మామూళ్లు మామూలుగా మారాయి.

టికెట్ సెగ

సంబరాల ఎమ్మెల్యే బాబు.. స్థానికేతరుడు కావడంతో వచ్చే ఎన్నికల్లో స్థానికులకే పార్టీ టిక్కెట్ ఇవ్వాలన్న నినాదాన్ని సీనియర్లు తెరపైకి తెచ్చారు. తమ మాటను కాదని ఆ నేతకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని బహిరంగంగానే చెప్పేస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఆందోళనను నిర్వహించారు.

కరిగిన కొండలు!

ఎమ్మెల్యే సాగిస్తున్న అవినీతి, అక్రమాలకు అడ్డు లేకుండా పోయిందనే వాదన ఉంది. ఎమ్మెల్యే కనుసన్నల్లో సాగుతున్న అక్రమ మైనింగ్‌తో కొండలు, గుట్టలు కరిగిపోయాయి. రెండు మండలాల్లో ఆ నేత కనుసన్నల్లోనే అక్రమ మైనింగ్ పెద్ద ఎత్తున జరుగుతోంది. పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిన నేతలను దూరంగా పెట్టారన్న విమర్శలు సొంత మనుషుల నుంచే వ్యక్తమవుతున్నాయి. అక్రమ మైనింగ్‌కు అడ్డు వస్తున్నారని సొంత పార్టీలోని నేతల పైనే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయించారు. ఏకంగా ఆ ఎమ్మెల్యే అక్రమ మైనింగ్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే పరిస్థితి వచ్చిందంటే అక్కడ నెలకొన్న పరిస్థితి తీవ్రత తెలుస్తుంది.

సంబరాల బాబు

ఏటా సంక్రాంతి వస్తోందంటే ఈ ఎమ్మెల్యేకు సంబరాలే. ప్రతి సంవత్సరం ముగ్గులు పోటీల పేరుతో లక్కీడిప్ నిర్వహిస్తారు. వేలాది కూపన్లు అమ్ముతూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ విషయంపై కోర్టులో ప్రైవేటు కేసు కూడా నమోదైంది. ఇక, నోటి దూలకు ఈయన పెట్టింది పేరు. రూ.2 కోట్లు తీసుకుని నియోజకవర్గంలో జిల్లా పరిషత్ స్థలం వేరొకరికి కట్టబెట్టిందుకు రంగం సిద్ధం చేశారు. దీనిపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కు, ఆయనకు వివాదం నడుస్తోంది.

దళితుడిపై ఎమ్మెల్యే సోదరుడి

దాష్టీకం

- చేతబడి నెపంతో చితకబాదిన వైనం
- ఆస్పత్రిపాలైన కోడిపుంజుల కాపలాదారు
- తనను భరత్ చౌదరి కొట్టారన్న వృద్ధుడు
- దెందులూరులో ఘటన.. దళిత సంఘాల ఆగ్రహం
- ఆదివారం మారిన సీన్.. మాట మార్చిన చంటి



ఆసుపత్రి బెడ్‌పై బాధితుడు చంటి

పెదవేగి, జనవరి 21: దళిత పక్షపాతి వైసీపీ అని చెప్పుకునే ఆ పార్టీ నేతలు దళితులపై విచక్షణారహితంగా దాడులకు తెగబడుతున్నారు. ఏలూరు జిల్లా, దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి మండలం రాయన్న పాలెంలో శనివారం జరిగిన ఘటన అగ్రవర్ణ కుల అహంకారానికి ప్రతీకగా నిలుస్తోందని దళిత సంఘాలు మండిపడుతున్నాయి. రాయన్నపాలెం శివారు చింతలపాటివారిగూడేనికి చెందిన దళితుడైన దొండపాటి ఏసు అలియాస్ చంటి(60) అనే వృద్ధుడు అదే గ్రామానికి చెందిన చల్లగొళ్ల భరత్‌చౌదరి అలియాస్ నానీ దగ్గర కోడిపుంజుల కాపలాదారుడుగా పనిచేస్తున్నారు. భరత్ చౌదరి స్వయానా దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చిన్నాన్న కుమారుడు. శనివారం మధ్యాహ్నం భరత్‌చౌదరి కోడిపుంజుల దగ్గరకు వచ్చేసరికి చంటి చెత్తను తగులబెడుతున్నారు. ఆ చెత్తలో కొన్ని కోడి ఈకలు ఉన్నాయి. అయితే, చంటి చేతబడి చేస్తున్నారని అనుమానించిన భరత్ చౌదరి, ఆ వృద్ధుడిపై దాడికి తెగబడ్డారు. "చేతబడికోసం కోసిన కోడి ఎక్కడ దాచావు" అంటూ విచక్షణారహితంగా దాడి చేశారు. తాను చేతబడి చేయలేదని, చెత్తను మాత్రమే తగులబెడుతున్నానని చంటి ఎంత చెప్పినా వినకుండా భరత్‌చౌదరి.. చంటిపై దాడిచేయడంతో భుజం ఎముక విరిగిపోయి, ముఖం, ఇతర శరీరభాగాలపై తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా చంటిని భరత్ చౌదరి హుటాహుటిన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ తనను ఎమ్మెల్యే తమ్ముడు తీవ్రంగా కొట్టాడని చెప్పడంతో ఎమ్మెల్యే వర్గీయు లు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇంటికి తీసుకెళ్లి ఎమ్మెల్యే అనుచరుల పహారాలో ఉంచారని సమాచారం. కాగా, దళితుడైన ఏసుపై దాడికి తెగబడిన వైసీపీ ఎమ్మెల్యే సోదరుడు భరత్‌చౌదరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి న్యాయం చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు, ఆదివారం నాటికి సీన్ మారింది. బాధితుడు చంటి తనను ఎవరు కొట్టలేదని, తానే ఓ బైక్ పైనుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయని పేర్కొంటూ ఆదివారం రాత్రి ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "నన్నెవ్వరూ కొట్టలేదు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పడిపోయాను. నన్ను చల్లగొళ్ల భరత్ చౌదరి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆస్పత్రిలో ఎవరో ఒకాయన వచ్చి ప్రశ్నలు వేసి, వాటిలో కొన్ని తీసివేసి, ఎమ్మెల్యే భరత్ నన్ను కొట్టినట్టుగా నేను చెప్పని మాటలతో వీడియో చేశారు. అది వాస్తవం కాదు" అని చంటి పేర్కొన్నారు.

లెనినిజం ప్రపంచానికి అవసరం

- లెనిన్ శతవర్ధంతి కార్యక్రమంలో వక్తలు



మురళి

విజయవాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): లెనిన్ రూపొందించిన సిద్ధాంతాలు, ఆయన భావనలు ఇప్పటికీ రాజకీయ, తాత్విక, ఆర్థిక, సామాజిక రంగాలను ప్రభావితం చేస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా 'నూతన కెరటం' ఆధ్వర్యంలో విజయవాడ బాలోత్సవ భవనంలో 'ఐవీ లెనిన్‌తో ఒకరోజు' పేరుతో చర్చాగోష్ఠిని ఆదివారం నిర్వహించారు. 'లెనిన్ - వలసానంతర ప్రపంచంలో సామ్రాజ్యవాదం' అనే అంశంపై న్యూ సోషలిస్ట్ ఇనిషియేటివ్ గడియారం భార్గవ ప్రసంగించారు. మార్క్సిస్టు సిద్ధాంతవేత్త కె.మురళి 'లెనిన్, టేలర్, కమ్యూనిస్టు వ్యవస్థ నిర్మాణంలో పర్యావరణ పట్టింపులు' అనే అంశంపై పత్రాన్ని సమర్పించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయ రాజనీతిశాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సరోజ్‌గిరి 'లెనిన్, ప్రజాస్వామ్య యుగ చైతన్యం'పై ప్రసంగించారు. కెనడా టోరంటోలోని యార్క్ విశ్వవిద్యాలయం ఫిలాసఫీ ప్రొఫెసర్ డాక్టర్ జె.మౌ ఫావడ్-పాల్ 'వైరుధ్యం, సంపూర్ణత్వం.. లెనిన్ తాత్విక కార్యాచరణ' అంశంపై జూమ్‌లో ప్రసంగించారు. లెనిన్ ప్రపంచానికి నేర్పిన పాఠాలను వారు వివరించారు. కమ్యూనిజం పర్యావరణానికి వ్యతిరేకమని, అది యాంత్రీకరణను కోరుకుంటుందన్న భావన చాలామందిలో ఉందన్నారు. ఇది ఏమాత్రం వాస్తవం కాదని, కమ్యూనిస్టులు పర్యావరణ హితమైన విధానాలే అమలు చేస్తారని చెప్పారు. టేలర్ యంత్రాలపై పనిని సులభతరం చేయడం కోసం కార్మికులను ఎలా తయారు చేయాలన్న దానిపై ఒక సిద్ధాంతాన్ని రూపొందించాడన్నారు. ఒక కార్మికుడు యంత్రంపై ఎంత పనిచేస్తే అంతకు తగిన విశ్రాంతి దక్కుతుందన్నారు. ఈ సిద్ధాంతాన్ని రష్యాలో లెనిన్ అమలు చేసి చూపించారన్నారు. మార్కెట్‌లో కూరగాయల్లో ఉన్న రకాలు మాదిరిగా ప్రపంచంలో అనేక ప్రజాస్వామ్యాలు ఉన్నాయన్నారు. ఇవన్నీ బోగస్ అని విమర్శించారు. అసలైన ప్రజాస్వామ్యం ఎలా ఉంటుందో లెనిన్ చూపించారని చెప్పారు. ప్రస్తుతం ఉన్నది నిజమైన ప్రజాస్వామ్యం కాదని అభిప్రాయపడ్డారు. నిజమైన ప్రజాస్వామ్యం వచ్చే వరకు కార్మిక, వర్గ పోరాటాలు జరుగుతూనే ఉంటాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయుడు ఎ.నరసింహారెడ్డి, సోషల్ సైన్సెస్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎ.జగన్నాథరావు, ఓపీడీఆర్ అఖిల భారత అధ్యక్షుడు సి.భాస్కరరావు, నాగార్జున వర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగ ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీరు బెల్ట్‌షాపు

- 200 మద్యం బాటిళ్లతో అరెస్టు వైసీపీ కార్యకర్త కూడా

నెల్లిమర్ల, జనవరి 21: బెల్ట్‌షాపు నడుపుతున్న వలంటీర్ బాగోతం బయటపడింది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎస్ఐ రామగణేష్, సిబ్బంది ఆదివారం జరిపిన దాడుల్లో ఇదే మండలం వల్లూరు గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న నేరెళ్ల సత్యన్నారాయణ అలియాస్ సతీష్ సుమారు 200 మద్యం బాటిళ్లతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మద్యం బాటిళ్లను, వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేశారు. వలంటీర్ కొంతకాలంగా బెల్ట్‌షాపు నడుపుతున్నాడు. వలంటీర్ ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని దందా సాగిస్తున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఐదు రోజుల కిందట ఎస్ఐగా బదిలీపై వచ్చిన రామగణేష్ బెల్ట్ షాపులపై దృష్టి సారించి వరుస దాడులు చేపట్టడంతో వలంటీర్ అడ్డంగా బుక్కయ్యాడు. వలంటీర్‌తో పాటు అధికార పార్టీ కార్యకర్త నాగను కూడా పట్టుకున్నారు.

ఢీ అంటే ఢీ

నేడు అంగన్వాడీల 'చలో విజయవాడ'

(మొదటి పేజీ తరువాయి)

వెంట తీసుకురావాలని అన్ని జిల్లాల అంగన్వాడీలకు ఆయా సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో జగన్ సర్కారు అప్రమత్తమైంది. పోలీసులను ఉసిగొల్పి ఉక్కుపాదం మోపింది. విజయవాడ వెళ్లొద్దంటూ నోటీసులు ఇప్పించడంతోపాటు.. ముందస్తు హౌస్ అరెస్టులకు దిగింది. ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతున్నా.. అంగన్వాడీలు ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అంటున్నారు. దీంతో తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు విజయవాడకు తరలివస్తున్న అంగన్వాడీలను పలుచోట్ల అడ్డుకున్నా రు. చలో విజయవాడను విజయవంతం చేయాలని అంగన్వాడీలు అంతే పట్టుదలగా ఉన్నారు. చలో విజయవాడలో భాగంగా విజయవాడలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో నిరసన ప్రదర్శన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కార్మిక సంఘాలు మద్దతిచ్చాయి. ఈ మేరకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలారి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ఒక ప్రకటలో పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే అంగన్వాడీలకు జీతాలు పెంచి సమస్యలను పరిష్కరించాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేశాయి.

విజయవాడలో హైటెన్షన్

అంగన్వాడీలు చలో విజయవాడకు పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. విజయవాడలోనూ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల వద్ద పోలీస్ పహారా పెంచారు. రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడకు వచ్చే అంగన్వాడీలను అరెస్టు చేసేందుకు సిద్ధమయ్యారు.

అనంతపురం జిల్లా ఉరవకొండకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌ను ఆదివారం అంగన్వాడీలు అడ్డుకున్నారు. దీంతో అధికారులు ప్రతీకార చర్యలకు దిగారు. విధులకు ఆటంకం కలిగించారంటూ.. ఉరవకొండ తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి పోలీసులు 12మంది అంగన్వాడీలపై కేసులు నమోదు చేశారు. 23న సీఎం జగన్ ఉరవకొండ పర్యటన నేపథ్యంలో ఆదివారం అంగన్వాడీల సమ్మె చేస్తున్న టెంట్‌ను తొలగించారు. జిల్లా వ్యాప్తంగా పలువురు అంగన్వాడీలకు చలో విజయవాడకు వెళ్లకుండా నోటీసులు జారీ చేశారు. కలెక్టరేట్ వద్ద సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ నేతలు కోటి సంతకాల సేకరణ ద్వారా వినూత్న నిరసన తెలిపారు. 23న ఉరవకొండ సీఎం పర్యటనకు వెళ్లరాదంటూ రాయదుర్గంలో అంగన్వాడీలకు నోటీసులు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అంగన్‌వాడీల చలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. రైల్వేస్టేషన్‌కు బయలుదేరిన కార్యకర్తలను పోలీసులు బలవంతంగా ఆటోల్లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద శిబిరంలో అంగన్‌వాడీలు ఆందోళనను కొనసాగించారు. సాలూరులో అంగన్‌వాడీలు ఆకులు తింటూ, పాలకొండలో కళ్లు మూసుకుని నిరసన తెలిపారు. చలో విజయవాడ కార్యక్రమానికి బయల్దేరిన మన్యం జిల్లాకు చెందిన 19మంది అంగన్‌వాడీలను విజయనగరం పోలీసులు అరెస్టు చేశారు. అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ జిల్లా కమిటీ నాయకురాలు బి.సుధారాణిని హౌస్ అరెస్ట్ చేశారు. గుంటూరు-రాయగడ ప్యాసింజర్ రైలు ఎక్కబోతున్న వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నెల్లూరు లోని కలెక్టరేట్ సహా పలు మండల కేంద్రాల్లో అంగన్‌వాడీల నిరవధిక దీక్ష కొనసాగుతోంది.

నీ భార్యను డ్యూటీలో చేరమని చెప్పు.. లేదంటే ఉద్యోగం ఊడుతుంది!

ఒంగోలులో కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరాహార దీక్షల శిబిరం వద్దకు పోలీసులు చేరుకుని విజయవాడలో జరిగే ఆందోళనకు వెళ్లవద్దంటూ నోటీసులివ్వడానికి యత్నించగా తీసుకోవడానికి అంగన్వాడీలు నిరాకరించారు. కొన్నిచోట్ల శిబిరాల్లో ఉన్నవారికి పోలీసులు నోటీసులు ఇచ్చారు.'నీ భార్యను వెంటనే డ్యూటీలో చేరమని చెప్పు.. లేదంటే ఉద్యోగం ఊడుతుంది' అని తమ భర్తలకు ఫోన్లుచేసి అధికారులు బెదిరిస్తున్నారని అంగన్వాడీలు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఎన్ని నిర్బంధాలు పెట్టినా మారు వేషాల్లో అయినా విజయవాడ చేరుకోవాలని యూనియన్ నాయకుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న అంగన్వాడీలకు మెసేజ్‌లు వెళ్లాయి. దీంతో రాత్రికి రాత్రే వారు విజయవాడ బయల్దేరారు.



నిరవధిక దీక్ష చేస్తున్న అంగన్వాడీ నాయకురాలు రేఖా ఎలిజబెత్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

'చలో సీఎంవో'కు అనుమతి లేదు

- ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్

విజయవాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు సోమవారం చేపట్టే 'చలో సీఎంవో/చలో విజయవాడ' కార్యక్రమానికి ఎలాంటి అనుమతీ లేదని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కాంతిరాణా స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఇచ్చిన పిలుపునకు స్పందించి జిల్లాల నుంచి కార్యకర్తలు ఎవరూ రావొద్దని విజ్ఞప్తి చేశారు. విజయవాడలో 144, 30 సెక్షన్లు అమల్లో ఉన్నాయని చెప్పారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా కార్యక్రమానికి సిద్ధమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసుల వివరాలు వారి సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారని ఆయన తెలిపారు.



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు

నేటి నుంచి తొలగింపులు

- ఉదయం పది గంటల్లోగా విధుల్లో చేరాలంటూ సర్కారు హుకుం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల విషయంలో జగన్ సర్కార్ చివరి అస్త్రాన్ని సంధించింది. ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిందిపోయి, అంగన్వాడీలపై కక్ష సాధింపులకు దిగింది. సమ్మె విరమించని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను విధుల నుంచి తొలగించడానికి రంగం సిద్ధం చేసింది. ఈమేరకు సోమవారం ఉదయం పది గంటల వరకు డెడ్ లైన్ పెట్టింది. పదిగంటలలోపు విధుల్లో చేరిన వారిని కొనసాగించాలని, విధుల్లో చేరని వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని ఆయా జిల్లా కలెక్టర్లు, జిల్లాల్లోని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారులు ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలిచ్చారు. విధుల్లో చేరని అంగన్వాడీల వివరాలను కలెక్టర్లకు పంపి అప్రూవల్ తీసుకుని మధ్యాహ్నం 12గంటల కల్లా విధుల నుంచి తొలగిస్తూ(టెర్మినేషన్) ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవడానికి ఈ నెల 25వ తేదీన కొత్త నోటిఫికేషన్ ఇచ్చి ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్లు కాల్ ఫర్ చేస్తారు. 26వ తేదీ నుంచి గ్రామ వార్డు సచివాలయం ద్వారా దరఖాస్తులు స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలిసింది.

వాటాలు తెగలేదు!

- కోడిపందేలు, జూదాల లంచాల సొమ్ము పంపకాల్లో పోలీసుల మధ్య వివాదం

పాలకొల్లు, జనవరి 21: సంక్రాంతిని పురస్కరించుకుని నిబంధనలు, కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కోడి పందేలు, జూదాల నిర్వహణకు అనుమతులు ఇచ్చి భారీ ఎత్తున కమీషన్లు పుచ్చుకున్న పోలీసులు వాటాలు పంచుకోవడంలో వివాదాలకు దిగారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన వాటాల పంపకం వివాదం చర్చనీయాంశమైంది. సంక్రాంతి నాలుగు రోజులు పాలకొల్లు పరిధిలో కోడిపందేలు, గుండాట, పేకాట నిర్వహణకు పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతి ఇచ్చారు. పట్టణ ప్రధానకూడలిలో గుండాట బోర్డులు పెట్టుకున్నా చూసీ చూడనట్లు వ్యవహరించారు. ఈ క్రమంలో జూదాల నిర్వాహకుల నుంచి సర్కిల్‌కి రూ.20లక్షలు లంచాలు ముట్టినట్టు సమాచారం. ఈ మొత్తం పంపకాల్లో కానిస్టేబుళ్లకు, హోంగార్డులకు రూ.2వేలు చొప్పున ఇచ్చి సరిపెట్టుకోమనడంతో విషయం బయటకు పొక్కింది. సర్కిల్‌లో ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు, నలుగురు ఏఎస్ఐలు, 8మంది హెడ్‌కానిస్టేబుళ్లు ఉన్నారు. కానిస్టేబుళ్లు, హోంగార్డులు 50 మంది ఉన్నట్లు తెలిసింది. రూ.2వేలు మాత్రమే చేతిలో పెట్టడంతో పలువురు కానిస్టేబుళ్లు ఆవేదన చెందుతున్నట్టు తెలిసింది.

హైదరాబాద్‌లో రూ.41 కోట్ల హెరాయిన్ సీజ్

శంషాబాద్ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దక్షిణాఫ్రికా నుంచి దర్జాగా డాక్యుమెంట్ ఫోల్డర్‌లో హెరాయిన్ తీసుకొస్తున్న ఇద్దరు మహిళలు హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టయ్యారు. వారి నుంచి రూ.41.4 కోట్లు విలువచేసే 5.92 కిలోల హెరాయిన్‌ను సీజ్ చేసినట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. నిందితులిద్దరూ జాంబియా జాతీయులని వివరించారు.

అందుబాటులో జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డులు

- ఈ నెల 24 నుంచి సెషన్-1 పరీక్షలు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షల కోసం విద్యార్థులకు సంబంధించిన అడ్మిట్ కార్డులను తాజాగా విడుదల చేశారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి ఈ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ సూచించింది. మెయిన్ పరీక్షలకు దేశవ్యాప్తంగా సుమారు 12.3 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 2.5 లక్షల మంది ఉంటారని అంచనా. దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు జనవరి 24, 27, 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో జరగనున్నాయి. తర్వాత మెయిన్ సెషన్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అడ్వాన్స్‌డ్ కోసం ఎంపిక చేస్తారు.

అపరిచిత వాట్సప్ కాల్స్‌తో జాగ్రత్త

- అలాంటివాటికి స్పందించవద్దు..
- కొత్తగా 'సెక్స్టార్షన్' నేరం జరుగుతోంది.. కేంద్ర హోం శాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 21: వాట్సప్‌లో పలు రకాల సైబర్ నేరాలు చోటుచేసుకుంటున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర హోం శాఖ పరిధిలోని నిపుణుల బృందమైన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్డీ) వినియోగదారులను హెచ్చరించింది. వివిధ రకాల సైబర్ నేరాలను ప్రస్తావిస్తూ ఎనిమిది పేజీల సూచనలను విడుదల చేసింది. వివిధ రూపాల్లో సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఉద్యోగ అవకాశాలు, సొమ్ము పెట్టుబడుల ప్రణాళికల పేరుతో మిస్డ్ కాల్స్, వీడియో కాల్స్ చేస్తున్నారు. మారు పేర్లతో సందేశాలు పంపిస్తున్నారు. మొత్తం కంప్యూటర్‌నే హైజాక్ చేసి ఆ వ్యక్తి పేరుతో డబ్బులు సర్దుబాటు చేయాలంటూ మెసేజ్‌లు పెడుతున్నారు. వీటన్నింటికన్నా ప్రమాదమైనది 'సెక్స్టార్షన్' నేరమని హెచ్చరించింది. గుర్తు తెలియని వ్యక్తులు వాట్సప్ కాల్స్ చేస్తారు. అనంతరం పూర్తి నగ్నంగా ఉంటూ వీడియో కాల్ చేసి మాట్లాడుతారు. ఆ తరువాత బెదిరించి డబ్బులు గుంజుతారు. దీన్నే సెక్స్టార్షన్‌గా వ్యవహరిస్తున్నారు. వియత్నాం, కెన్యా, ఇథియోపియా, మలేసియాల నుంచి ఇలాంటి మిస్డ్ కాల్స్ వస్తున్నాయని తెలిపింది. వాట్సప్‌లో చురుగ్గా ఉన్నవారిని గమనించి 'కోడ్ స్క్రిప్టెడ్ బోట్స్' ద్వారా వాటిని హ్యాక్ చేస్తున్నట్లు వివరించింది. ఇలాంటి ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదని హెచ్చరించింది. ఇటీవల వాట్సప్ ఆవిష్కరించిన 'స్క్రీన్ షేర్' విధానాన్ని కూడా దుర్వినియోగం చేసి డబ్బు గుంజుతున్నారని తెలిపింది. ఇలాంటివాటిని అరికట్టడానికి వాట్సప్‌లో టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఏ)ను వినియోగించాలని సూచించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.